www.jagritiweekly.com
సంపుటి : 76 సంచిక : 47 పుటలు : 52

# జాగృతి

కలి 5126-శ్రీ క్రోధి భాద్రపద బహుళ త్రయోదశి
30 సెప్టెంబర్-06 అక్టోబర్ 2024
వెల : ₹20/-

## మహాపరాధం

# మన్నించు స్వామి!



జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

76 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక




# ధన్యవాదాలు



పురాతన భారతీయుల కళా వైభవం చెప్పడానికి మాటలు చాలవు. ప్రధానంగా శిల్పకళలో వారి విద్యకు సాటి లేదు. కానీ విదేశీయుల పాలనలో వేలాది కళాఖండాలు సరిహద్దులు దాటిపోయాయి. చాలా పాశ్చాత్య దేశాలలో అవి మగ్గిపోతున్నాయి. భారత్ సాంస్కృతిక వారసత్వాన్ని, ఔన్నత్యాన్ని గ్రహించిన దేశంగా అమెరికా 297 పురాతన కళాఖండాలను భారత్‌కు అప్పగించింది. ఇవన్నీ భారతదేశంలో దొంగిలించి అంతర్జాతీయ విపణిలో విక్రయించినవే. ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటన సందర్భంగా ఆ దేశ అధ్యక్షుడు జో బైడెన్ వీటిని అప్పగించారు. సెప్టెంబర్ 22న ఇందుకు కృతజ్ఞత తెలియచేస్తూ మోదీ, అధ్యక్షుడు బైడెన్‌కు శతధా ధన్యవాదాలని ఎక్స్ వేదికగా తెలియచేశారు. ప్రస్తుతం భారత్‌కు చేరుకుంటున్న పురాతన కళాఖండాలలో సాధారణ శకం 2000 సంవత్సరం మొదలు, సాధారణ శకం 1900 సంవత్సరం మధ్య కాలానికి చెందినవి ఉన్నాయని ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది. సాంస్కృతిక వారసత్వాన్ని ఆవిష్కరించే వస్తువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు ఉద్దేశించిన ఒక ఒప్పందం ఇరు దేశాలు ఈ జూలైలో చేసుకున్నాయి. ప్రస్తుతం 297 కళాఖండాలను అప్పగించారు. బైడెన్‌తో వామింగ్టన్‌లో జరిగిన సమావేశం మధ్యలో బైడెన్ లాంఛనంగా కొన్నింటిని అప్పగించారు.

# దేవాలయాలతో దీపావళి

## 'జాగృతి'



- గుడి– హిందూ జీవనానికి నాడి
- గుడి– భారతీయత గుండె సవ్వడి
- గుడి– ఆత్మక్షాళన పాఠాల బడి
- ఆలయం అంటే దేవుడు, మంత్రాలు, ఆరాధన.
- ఆలయం అంటే సామాజిక కేంద్రం, విద్యాకేంద్రం.
- ఆలయం అంటే కళాత్మకం, కళలకి ఆలవాలం.
- ఎన్ని వేల ఆలయాలు ఈ నేల మీద!
- వాటి మీద ఎన్ని లక్షల శిల్పాలు!
- దైవదర్శనం ప్రతి హిందువు నిత్యవేడుక
- పుణ్యక్షేత్ర దర్శనం ప్రతి హిందువు జీవితేచ్ఛ

అందుకే ఈ దీపావళికి జాగృతి వారపత్రిక దేవాలయాల ప్రత్యేక సంచికగా వెలువడుతున్నది. దేవాలయాల చరిత్ర, ఆచారాలు, వాస్తు, గుడులు నేర్పే సమరసత, శిల్పకళను పరిచయం చేస్తున్నది.

దేవాలయాల వైభవం మీ చేతులలోకి వస్తోంది! **త్వరపడండి!!**

## 28 అక్టోబర్ 2024 దీపావళి ప్రత్యేక సంచికలో!!!

అదనపు కాపీల కోసం పాఠకులు, ఏజెంట్లు అక్టోబర్ 16లోగా జాగృతి కార్యాలయానికి 9959997013 నంబరుకు ఫోన్ చేసి లేదా వాట్సప్‌లో సంప్రదించవచ్చు.

**పేజీలు : 250**
**వెల : 125/-**

- ➡ 25 నుంచి 50 కాపీలు ఆర్డరు చేసిన వారికి 30 శాతం
- ➡ 51 నుంచి 99 కాపీలు ఆర్డరు పెట్టుకున్న వారికి 35 శాతం
- ➡ 100, ఆ పైన కాపీలకు 40 శాతం డిస్కౌంట్ లభిస్తుంది.
- ✿ పార్శిల్ ఖర్చులు అదనం

jagritiweekly.com | facebook.com Jagriti Telugu Weekly | youtube.com/@Jagrititv | 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

**జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్**
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి : | అసోసియేట్ ఎడిటర్ | - |
| సబ్ ఎడిటర్ : | - | 9959991304 |

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అంకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

**విడి ప్రతి రూ.20**

**5 సం॥ల చందా రూ.4000** **సంవత్సర చందా రూ.850**

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**


- సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

**భా**రత్‌కు సరిపడని తీరులో బాంగ్లాదేశ్‌లో పరిణామాలు చోటు చేసుకున్నాయి. అక్కడి కల్లోలం అలా ఉండగానే మరొక పొరుగు దేశం శ్రీలంకలో మరొక పరిణామం జరిగింది. 'మార్క్సిస్టు' అనూర కుమార దిస్సనాయకె 9వ దేశాధ్యక్షునిగా సెప్టెంబర్ 23న ప్రమాణ స్వీకారం చేశారు. శ్రీలంకకూ చైనాకూ మధ్య ఉన్న ప్రత్యక్ష పరోక్ష సంబంధాలు, అనూర కుమార దిస్సనాయకె (ఏకేడీ) అనే పేరుకు ముందు మీడియా తగిలించిన 'మార్క్సిస్టు' విశేషణం కొన్ని అనుమానాలకు తావిచ్చేవే. భారత్‌కు సానుకూల అంశాలు కాకపోవచ్చునన్న నిర్ణయానికి వచ్చేటట్టు చేసేవే. అనూర కుమార ప్రాతినిధ్యం వహిస్తున్న జనతా విముక్తి పెరుమున (జేవీపీ) చరిత్ర కూడా ఆ అనుమానాలను బలోపేతం చేసేదే. మార్క్సిస్టు దృక్పథం కలిగిన ఈ పార్టీ భారత వ్యతిరేకి అన్నది సుస్పష్టం. 1971,1987,1990లలో ప్రభుత్వాలను కూలదోసేందుకు హింసాయుత మార్గంలో జేవీపీ అలజళ్లు లేవదీసింది. 1987లో భారత్-శ్రీలంక మధ్య జరిగిన శాంతి ఒప్పందాన్ని కూడా జేవీపీ వ్యతిరేకించింది. కానీ 1990 నుంచి జేవీపీ ప్రజాస్వామ్యం వైపు మొగ్గిన క్రమంలో పార్టీలో వచ్చిన మార్పులు అనూర కుమారకు అనుకూలించాయి. ఆ నేపథ్యంలో ఎదిగిన నేత అనూర కుమార. ఈయన ఆ ఏడాది ఫిబ్రవరిలో భారత్‌కు వచ్చినప్పుడు మన పట్ల సానుకూలత ఏర్పడిందన్న మాట కూడా ఉన్నది. అందుకే అనూరను భారత్‌కు సన్నిహితుడవుతున్న చైనా అనుకూలుడన్న వ్యాఖ్యలు వినపడుతున్నాయి.

అనూర కుమార తన సమీప ప్రత్యర్థి ఎస్‌జేబీ నేత సజిత్ ప్రేమదాస మీద విజయం సాధించారు. అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే తొలి రౌండ్‌లోనే వైదొలిగారు. అయితే ఏ ఒక్కరికీ విజయానికి కావలసిన 50 శాతం ఓట్లు రాలేదు. దీనితో ద్వితీయ ప్రాధమ్య ఓట్ల లెక్కింపు తరువాత అనూర కుమార విజేతగా అవతరించారు. తానేమీ మాంత్రికుడిని కాననీ, ఈ దేశంలో పుట్టిన సాధారణ పౌరుడినేననీ, నేను చేయగలిగినవి కొన్ని ఉంటే, చేయలేనివీ కొన్ని ఉన్నాయని ఆయన ప్రమాణ స్వీకారం తరువాత అన్నారు. అలాగే ప్రపంచ అగ్రదేశాల సహకారం తీసుకుంటానని కూడా చెప్పారు. ఏ నాయకుడైన ప్రమాణ స్వీకారం చేసే సందర్భంలో మంచి మాటలే

**శాలివాహన 1946 శ్రీ క్రోధి భాద్రపద బహుళ త్రయోదశి**

## లోపలి పేజీలలో...




6లో

ముఖపత్ర కథనం

**మహాపరాధం మన్నించు స్వామి!**

కథ

**మళ్లీ మైదానంలోకి!**


- సరస్వతి కరవది

20లో

అంతర్జాతీయం

**నూతన యుద్ధరీతికి తెరలేపిన ఇజ్రాయెల్**

26లో





# జాగృతి

## సంపాదకీయం

చెబుతారు. అయితే బాంగ్లాదేశ్‌లో మహమ్మద్ యూనస్ చెప్పిన మాటలు తరువాత ఏమైనాయో అందరికీ తెలుసు.

ఇప్పుడు అందరూ వేసుకుంటున్న ప్రశ్న ఒక్కటే. గత ఏడాది దారుణ సంక్షోభం కారణంగా తల్లకిందులైన శ్రీలంక ఆర్థిక వ్యవస్థ మార్క్సిస్టు మూలాలు కలిగిన రాజకీయ పార్టీ అధికారంలోకి రావడం వల్ల పునరుత్థానం చెందగలదా? నిజానికి దేశంలో తలెత్తిన రాజకీయ సంక్షోభం, దాని వెన్నంటే వచ్చిన ఆర్థిక సంక్షోభాల నివారణకు ఇంతకు ముందు అధ్యక్షునిగా పనిచేసిన రణిల్ విక్రమ్ సింఘే అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ నుంచి రుణం తెచ్చారు. ఈ చర్యను అనూర

# శ్రీలంక కొత్త నేత

కుమార తప్పు పడుతున్నారు. వారిదైన పరిభాషలో 'ప్రజా వ్యతిరేకం' అని వ్యాఖ్యానించారు. ఇంధనం ఇతర అత్యవసరాల ధరలు అంతర్జాతీయద్రవ్య నిధి సంస్థ రుణం తరువాతే దేశంలో తగ్గాయి. అయినా అనూర కుమార ఇలాంటి వ్యాఖ్య చేశారు. కానీ ఆయన పార్టీ జేవీపీని బట్టి, ఆ పార్టీకీ చైనాకు ఉన్న బంధాన్ని బట్టి ఆయన చైనాకు అనుకూలంగా ఉంటాడనే అంతా భావిస్తున్నారు. అదే సమయంలో శ్రీలంక సంబంధాల పరిధిలో భారత్‌తో సంయమనంతోనే వ్యవహరిస్తారన్న నమ్మకం కలిగించే పనిలో ఉన్నారు. అందుకు తగ్గట్టే శ్రీలంకలోని భారత దౌత్య కార్యాలయం కూడా వ్యవహరించింది. సెప్టెంబర్ 22వ తేదీన అనూర కుమార ఎన్నికైనట్టు ఫలితం వెలువడిన 90 నిమిషాలలోనే శ్రీలంకలో భారత హైకమిషనర్ సంతోష్ ఝా ఆయనను కలుసుకుని అభినందించారు. భారత్, శ్రీలంక సాంస్కృతిక కవలలేనని, ఆ బంధం మరింత పటిష్టం కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. విజన్ సాగర్ పథకం ప్రకారం పొరుగు దేశంగా శ్రీలంకకు ప్రత్యేక స్థానం ఉన్నదని ప్రధాని మోదీ కూడా ఘనంగా శుభాకాంక్షలు తెలియచేశారు.

ఈ ఫిబ్రవరిలో అనూర కుమార భారత్‌లో పర్యటించి, మన విదేశ వ్యవహారాల మంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌ను కలుసుకున్న తరువాత పరిస్థితులు మారాయనే చెప్పాలని విశ్లేషకులు అంటున్నారు. 2022 సంక్షోభంలో భారత్ అందించిన సహాయం మరువ లేనిదని శ్రీలంక వెళ్లిన తరువాత అనూర కుమార వ్యాఖ్యానించారు కూడా. ఐటీలో భారత్ సాధించిన నైపుణ్యాన్ని చూసి నేర్చుకోవాల్సినది ఎంతో ఉందని కూడా కితాబు ఇచ్చారు. నిజానికి భారత్ పట్ల శ్రీలంకలోని చాలా పార్టీల అభిప్రాయం సానుకూలంగానే ఉందని అనిపిస్తుంది. జేవీపీ, మరొక 28 పార్టీలు కలసి కూటమిగా ఈ అధ్యక్ష ఎన్నికలలో పోటీ చేశాయి. అదే ది నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పీపీ). ఆ పార్టీలు కూడా భారత్‌తో కలసి పని చేయాలన్న ఆకాంక్షనే వ్యక్తం చేయడం విశేషం. ఎన్‌పీపీ వామపక్ష భావజాలాన్ని పక్కన పెట్టినట్టే ఉంది. శ్రీలంకను ఆర్థికంగా పటిష్టం చేయడానికి ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానిస్తున్నట్టు ఈ కూటమి ఎన్నికల ప్రణాళికలోనే హామీ ఇచ్చింది. శ్రీలంకలో భారతీయులు కూడా పెట్టుబడులు పెట్టాలని వారు కోరుకుంటున్నారు. అయితే అనూర కుమార ఆదాని పెట్టుబడులను, హంబన్ టోటా నౌకాశ్రయంలో చైనా పెట్టుబడులను సమంగానే దుయ్యబడతారు.

బాంగ్లాదేశ్‌లో వచ్చిన మార్పు, శ్రీలంకలో వచ్చిన మార్పు ఒకటి కాదు. బాంగ్లాదేశ్ పరిణామాలలో ఇస్లామిస్టులు, ఐఎస్ఐఎస్, పాక్ అనుకూల శక్తులు కీలకం. కానీ శ్రీలంక పరిణామాలలో ఒక సిద్ధాంతానికి సంబంధించిన జాడ ఉంది. పైగా మౌఢ్యానికి దూరంగా జరుగుతున్న క్రమం కనిపిస్తున్నది. దీనినే భారత్ దౌత్యపరంగా తనకు సానుకూలం చేసుకొనే ప్రయత్నం మొదటే చేయడం పెద్దరికాన్ని నిలుపుకోవడమే. ★

30 సెప్టెంబర్ 2024, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్




34లో

కథ

**ఆకలి**

– భమిడిపాటి గౌరీశంకర్





| | | |
|---|---|---|
| ఆర్టికల్ 370 : పాక్, కాంగ్రెస్, ఎన్సీ బాంధవ్యం (జాతీయం) | - | 12 |
| ఎందెందు వెతికినా అందందే అవినీతి (తెలంగాణ) | - | 14 |
| అవినీతి అడ్డాగా టీటీడీ (ఆంధ్రప్రదేశ్) | - | 16 |
| జమిలికి జై (జాతీయం-1) | - | 23 |
| సమరస వనాన 'తులసి' (మహిళ) | - | 28 |
| ఐడబ్ల్యుటిపై పునఃసమీక్షకు పట్టుబడుతున్న... (అంతర్జాతీయం) | - | 30 |
| అంతర్జాతీయ హాకీలో భారత్ జైత్రయాత్ర! (క్రీడ) | - | 43 |
| దామగుండం క్షేత్రాన్ని రక్షించుకుందాం (ప్రత్యేక వ్యాసం) | - | 44 |
| బాలజాగృతి | - | 46 |
| చిరంజీవి కీర్తి కిరీటంలో మరో కలికితురాయి! (సినిమా) | - | 50 |

**1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి తక్షణ కారణం ఒకటి ఉంది. సిపాయిలు (ఆంగ్లేయుల సైన్యంలో భారతీయులని అలా అనేవారు) ఉపయోగించవలసిన తూటాలకు కొవ్వు పూసారన్న ఒక్క మాట ఈస్టిండియా కంపెనీని నేలమట్టం చేసిన చరిత్రాత్మక సంగ్రామానికి దారి తీసింది. తూటాల మీద పందికొవ్వు పూత అన్న మాట ముస్లింలను, ఆవు కొవ్వు పూసారన్న మాట హిందువులను అంత తీవ్ర తిరుగుబాటుకు ప్రేరేపించింది. అది ఇరుమతాల వారి మనోభావాలను అంత లోతుగా గాయపరిచింది. అయితే హిందువుల మనోభావాలను నేడు కూడా అదే స్థాయిలో, అంతే దారుణంగా గాయపరిచిన ఘటన జరిగింది. అది కూడా కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరుని సన్నిధిలో జరగడం మరింత కలచివేసింది. ఇంతకు ముందు ఉన్న వైసీపీ ప్రభుత్వం, టీటీడీ పాలకులు శ్రీవారి లడ్డులో 'బీఫ్ టాలో' ఉపయోగించారని సాక్షాత్తు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆరోపించడం సంచలనం సృష్టించింది. సెప్టెంబర్ 18వ తేదీన ప్రకటించిన ఈ అంశం హిందువుల పాలిట శరాఘాతమే. బీఫ్ టాలో, లేర్డ్ అనే పదార్థాలు పంది కొవ్వు నుంచి వచ్చేవే. అంతేకాదు, ఆవు నెయ్యి పేరుతో వచ్చిన పదార్థంలో చేపనూనె కలిసింది.**



ఇంతకు ముందు అధికారంలో ఉన్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో శ్రీవారి లడ్డులో నెయ్యికి బదులు జంతువుల కొవ్వు వాడారని చంద్రబాబు ఆరోపించారు. ఈ మేరకు గుజరాత్‌కు చెందిన ఎన్‌డీడీబీ కాఫ్ లిమిటెడ్ సంస్థ అనుమానాలు వ్యక్తం చేసింది. లడ్డూల తయారీ కోసం వినియోగించిన నెయ్యిలో పెద్ద ఎత్తున కల్తీ జరిగిందని ఆ సంస్థ నివేదిక చెబుతున్నది. నెయ్యిలో కల్తీ జరిగిందని, పాలకు సంబంధించినవి కాకుండా ఇతరత్రా కొవ్వులు (ఫారిన్ ఫ్యాట్స్) ఉపయోగించారని నివేదిక తెలియచేసింది. ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చాక అనుమానం వచ్చి లడ్డూ నాణ్యతా ప్రమాణాల మీద వచ్చి పరీక్షల కోసం నమూనాలను ఎన్‌డీడీబీ కాఫ్‌కు పంపించారు. దీనికి కొన్ని మినహాయింపులు ఉండ వచ్చునని ఆ సంస్థ పేర్కొన్నప్పటికీ, వైఎస్ఆర్ సీపీ హయాంలో జరిగిన కొన్ని చర్యలను, బట్టి అధికారులు ఇష్టారాజ్యంగా చేసిన పనులను బట్టి ప్రసాదాల పవిత్రత దెబ్బ తినే అవకాశం కచ్చితంగా ఉన్నట్టే అంతా భావించవలసి వస్తున్నది. అందుకే దేశమంతా గగ్గోలు మొదలయింది. అయోధ్య సాధుసంతుల నుంచి, రమణ దీక్షితులు, రంగరాజన్, తిరుమల అవకతవకలమీద చిరకాలంగా పోరాడుతున్న రాధామనోహర్ దాస్ వంటివారంతా భగ్గుమంటున్నారు. విశ్వహిందూ పరిషత్, అయోధ్య అర్చక స్వాములు ఇంకా ఎందరో ఈ దురాగతం మీద నోరు విప్పారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నివేదిక కోరింది. నాణ్యమైన ముడి సరుకులు వాడకపోవడం ఒకటి, పవిత్రతకు భంగం వాటిల్లే పదార్థాలు వినియోగించడం మరొకటి అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ప్రకటించారు. అయితే ఆ దుస్థితినుంచి తిరుమలను తమ ప్రభుత్వం ఇప్పటికే తప్పించిందని, నాణ్యతా ప్రమాణాలను తిరిగి ప్రవేశపెట్టామని ఆయన అన్నారు. ఈ అంశాన్ని వైఎస్ఆర్‌సీపీ నాయకులు రాజకీయ విమర్శగానే పరిగణిస్తూ, వెంటనే ఖండించారు. చంద్రబాబు రాజకీయలబ్ది కోసం చేస్తున్న దుష్ప్రచారంగా అభివర్ణించారు. దుర్గ గుడిలో రథం సింహాలను ఎత్తుకుపోతే ఏమిటి? ఆంజనేయుడి విగ్రహం చేయి విరిగితే ఏమైంది? అంతర్వేది రథం దహనమైతే ఏం కొంప మునిగింది? ఇంకొకటి తయారు చేయిస్తాం వంటి సమాధానాలే ఇప్పుడు కూడా వైఎస్ఆర్ సీపీ గణాలనుంచి రావడం అత్యంత శోచనీయం.



చంద్రబాబు, వైఎస్ జగన్

వైఎస్ జగన్మోహనరెడ్డి పాలనలో హిందూ వ్యతిరేక చర్యలు చాలా జరిగినప్పటికీ, ఈ స్థాయిలో నీచత్వానికి పాల్పడతారని మాత్రం ఊహించలేదని విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి వినోద్ బన్సాల్ విమర్శించారు.

శ్రీవారి లడ్డు వివాదం క్షణాలలో సుప్రీంకోర్టుకు చేరింది. ఆ వివాదం మీద దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ వ్యాజ్యం దాఖలైంది. ఈ చర్యతో హిందువుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఒక న్యాయవాది దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో



# రాధం
# ంచుము స్వామి!

ఆరోపించారు. ఇది హిందువుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే అంశం కూడానని ఆయన విశ్లేషించారు.

శేషాద్రివాసుడు శ్రీ వేంకటేశ్వర స్వామి కలియుగ ప్రత్యక్ష దైవం. కోట్లాది భక్తుల ఆరాధ్య మూర్తి. ప్రపంచవ్యాప్తంగా ఎంతో పేరు పొందిన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సేవలు, ఉత్సవాలు, ప్రసాదాలు హిందూ భక్తుల మనోభావాలకు అనుగుణంగా సంప్రదాయ రీతిలో, ఆగమ నిబంధనల మేరకు కొన్ని వందల సంవత్సరాలుగా జరుగుతున్నాయి. గత కొంతకాలంగా తిరుమల ఆలయానికి సంబంధించిన అనేక అంశాలు భక్తులకు ఆవేదన కలిగిస్తున్నాయి. మనోభావాలను గాయపరుస్తూనే ఉన్నాయి. కొండపై జరుగుతున్న ఆచార వ్యవహారాల నిర్వహణ లోపాలు వెలుగులోకి వచ్చి సమాజంలో కలకలం సృష్టిస్తున్నాయి. అటువంటిదే తాజాగా తిరుపతి లడ్డు తయారీలో వినియోగించే ఆవు నెయ్యి ప్రామాణికంగా లేదని, లోప భూయిష్టమైన నెయ్యి వినియోగిస్తున్నారన్న అంశం విశ్వవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. స్వయంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తిరుమల ప్రసాదాలలో చోటు చేసుకున్న సంప్రదాయ విరుద్ధ విధానాన్ని ప్రస్తావించడంతో దీని తీవ్రత మరింత పెరిగింది.

## చరిత్ర

తిరుమల ఆలయానికి సంబంధించి సాధారణ శకం 666లో, 965-1801 మధ్య 1300 దాకా శాసనాలను ఆలయ గోపురాళ్లపైన, గోడల పైన, రాగి రేకుల పైన గుర్తించారు. అయితే ఎక్కడ స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రంగా పేర్కొంటున్న ఈ లడ్డు, ప్రసాదంగా మొదలైనది ఎప్పుడు అనే విషయం అధికారికంగా లభించడం లేదు. కొన్ని ఆధారాలు దొరికినా వాటి మీద లోతైన పరిశోధన జరగలేదనే అనుకోవాలి. సాధారణ శకం 1193లో అప్పటి తిరుపతి ప్రాంత పాలకుడు వీరరాక్షస యాదవరాయలు వేయించిన శాసనంలో శ్రీవారికి వినియోగించే నైవేద్యాలలో నెయ్యి వినియోగించాలనే నిబంధన విధించాడు.

ఎన్టీ రామారావు మొదటిసారి(1983) ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత తిరుమల ఆలయంలో భారీ ఎత్తున సంస్కరణలు మొదలయ్యాయి అప్పటికి నెలకొన్న మిరాశి వ్యవస్థను ఆయన రద్దు చేశారు. అప్పటి వరకు ఈ లడ్డు సహా ప్రసాదాలు ఇతర నైవేద్యాల తయారీని ఆలయానికి చెందిన మిరాశి కుటుంబాల శ్రీ వైష్ణవ బ్రాహ్మణులు నిర్వహించేవారు. ఇప్పుడు ఆ బాధ్యత శ్రీవారి ఆలయ నిర్వహణ అధికారి, పాలకమండలి చూసుకుంటూ ఉంది. వంటశాల(పోటు)లో తయారీ మాత్రమే శ్రీ వైష్ణవ



డాక్టర్ మన్నవ గంగాధరప్రసాద్
సీనియర్ జర్నలిస్ట్




# మూడు వందల ఏళ్ల చరిత్రకు కళంకం

శ్రీవారి లడ్డు లేదా తిరుపతి లడ్డుకు ఘన చరిత్ర ఉంది. ఈ అద్భుత ప్రసాదం లేని తిరుమల తిరుపతి యాత్ర, ఏడుకొండలవాడి దర్శనం అనూహ్యమే. యావన్మంది భక్తులు లడ్డూ ప్రసాదం తమ వరకే కాకుండా, స్వస్థలంలో బంధుమిత్రులకు ఇవ్వడం కూడా ఆచారంగా వస్తున్నది. అప్పుడే తిరుమల యాత్ర, దర్శనం పూర్తి తృప్తిని ఇస్తాయి. అందుతున్న చరిత్ర ప్రకారం శ్రీవారి లడ్డును భక్తులకు అందించే ఆచారం 1715లో ఆరంభమైంది. అంటే మూడు వందల ఏళ్ల చరిత్ర. ఈ కాలమంతా ఒకే పరిమాణంలో లడ్డు లేకపోవచ్చు. ఆ ప్రసాదం పట్ల భక్తిప్రపత్తులు మాత్రం అలాగే ఉన్నాయి. లడ్డుకు జియోగ్రఫికల్ ఇండికేషన్ ట్యాగ్ ఉంది. కాబట్టి ఈ ప్రసాదం తయారీకి ఒక్క తిరుమలకే పరిమితం. శ్రీవారి లడ్డు గుబాళింపు ఏడుకొండలకే కాదు, తెలుగు ప్రాంతాలకే కాదు, ఆఖరికి భారతదేశానికే పరిమితం కాదు. అది ప్రపంచ దేశాలకు తెలిసిన గుబాళింపు. విశ్వవ్యాప్తమైన రుచి. తోమాల వడ, శర్కర పొంగలి, దధ్యోజనం, జిలేబీ వంటి ఇతర ప్రసాదాలు కూడా తిరుమలలో ఉన్నా, అటు స్వామివారికి ఇష్టమైనదీ, ఇటు అత్యధికంగా భక్తకోటి ఆస్వాదించేది లడ్డుయే. ఏడుకొండలు చేరి, గంటల తరబడి స్వామివారి దర్శనానికి వేచి ఉండే క్రమంలో ఏర్పడిన నలత లడ్డు ప్రసాదంతో మటుమాయం అవుతుందని భక్తుల విశ్వాసం.

నిత్యం 3.5 లక్షల లడ్డులు సిద్ధమవుతాయి. ఒక్క లడ్డు ధర రూ.50. ఏటా కోట్లలో లడ్డూలు తయారవుతాయి. అంతా శ్రమ విభజనతో సాగుతుంది. కల్యాణం లడ్డు (ఒకప్పుడు 720 గ్రాములు, ఇప్పుడు బహుశా 700 (గ్రాములు), చిన్న లడ్డు (178 గ్రాములు ఇప్పుడు 174 గ్రాములు)అని రెండు బ్రాహ్మణులు నిర్వహిస్తున్నారు.

ఇది ఇలాఉండగా, శ్రీవారికి సమర్పించిన లడ్డులలో వినియోగించిన నెయ్యిలో జంతు సంబంధ నూనెలు కలిశాయంటూ గత వారం వార్తలు వెలువడ్డాయి. వెంటనే దీనిని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహనరెడ్డి ఖండించారు. అదే సమయంలో ఇటీవల ప్రభుత్వం మారిన తర్వాత టీటీడీ ఈవోగా బాధ్యతలు చేపట్టిన జె.శ్యామలరావు కూడా మీడియా సమావేశంలో తిరుపతి లడ్డూల వివాదానికి సంబంధించిన అంశాలను ప్రపంచానికి వివరించారు. దీనితో ఈ అంశం రాజకీయంగానే కాక, హిందూ ధార్మిక సమస్యగా కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. కల్తీ నెయ్యితో, జంతువుల కొవ్వు పదార్థాలతో లడ్డు తయారయ్యిందన్న విషయం దేశవ్యాప్తంగా భక్తుల మనోభావాలను దెబ్బతీసింది.



వైవీ సుబ్బారెడ్డి

కేంద్ర ప్రభుత్వం మొదలుకొని, అనేకమంది రాజకీయ ప్రముఖులు, స్వాములు, మఠాధిపతులు, సామాన్య ప్రజలు, భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. స్వామివారికి జరిగిన అపచారాన్ని సరిదిద్దాలని, అందుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని దేశవ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు ఆందోళనలు చేశారు.

**వివాదానికి మూలం**

తిరుమల ఆలయంలోనూ, రాష్ట్రంలోని ఆలయాలలో వినియోగించే పదార్థాలను నాణ్యమైన విధానంలో పారదర్శకంగా కొనుగోలు చేయడానికి 2019కి ముందు ప్రభుత్వం జీవో 418 ద్వారా విధి విధానాలను నిర్దేశించింది. 2019లో ప్రభుత్వం మారడంతో తిరుమలలో అమలవుతున్న విధానాలు కూడా రద్దయ్యాయి. రివర్స్ టెండరింగ్ విధానంలో అప్పటి టీటీడీ అధికారులు కొనుగోళ్లకు సంబంధించి అనేక కొత్త విధానాలను ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా అంతవరకు కర్ణాటక సహకార పాడి రైతుల నిర్వహణలోని నందిని మార్కు నెయ్యి వినియోగాన్ని నిలిపివేసి, తమిళనాడుకు చెందిన ఒక కంపెనీకి తక్కువ ధరకు ఆవు నెయ్యి కొనడానికి కొత్తగా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ నేపథ్యంలో గత

## కావాలనే మనోభావాలను దెబ్బతీశారు: వీహెచ్‌పీ



అత్యంత పవిత్రమైనది, అందరికీ ఆదరణీయమైన తీర్థస్థలం తిరుమల తిరుపతి దేవస్థానం. ఈ దేవస్థానంలో భక్తులకు పంచుతున్న లడ్డు ప్రసాదాలలో అపవిత్ర పదార్థాలను కలిపారని నివేదిక రావడంతో పూర్తి హిందూ సమాజం ఆగ్రహంతో, ఆక్రోశంతో ఉంది. హిందువుల మనోభావాలను కావాలనే దెబ్బతీశారు. ఇప్పుడే కాదు, ప్రతీసారి హిందువుల మనోభావాలను గాయపరుస్తూనే ఉన్నారు. ఇక హిందూ సమాజం సహించదు.

తిరుపతి లడ్డు ప్రసాదంలో జంతువుల కొవ్వు కలపడం అత్యంత హేయం. ఈ ఘటనకు బాధ్యులను కఠినంగా శిక్షించాలని, నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని విశ్వహిందూపరిషత్ డిమాండ్ చేస్తున్నది. ఏ వ్యక్తి లేదా అధికారి ఇటువంటి క్రియకు పాల్పడుతున్నాడో లేదా బాధ్యత వహిస్తున్నాడో అటువంటి వ్యక్తి మీద చర్యను తీసుకొని కఠిన శిక్ష విధించాలని వీహెచ్‌పీ కోరుతున్నది.

హిందూ దేవాలయాలు ప్రభుత్వ అజమాయిషీలో ఉండకూడదనీ, సమాజం ద్వారా నడవాలనీ విశ్వహిందూ పరిషత్ చాలాకాలంగా చెబుతున్నది.

మందిరాలపై ప్రభుత్వ ఆధిపత్యం వల్ల రాజకీయం ప్రవేశిస్తుంది, హిందూయేతరులు ఉద్యోగస్థులుగా చేరడం వల్ల ఇటువంటి అపవిత్రత మందిరాలలో చోటు చేసుకుంటుంది. ఈ వాస్తవానికి తిరుపతి ఘటన మరింత బలం చేకూరుస్తున్నది.


హిందూ పుణ్యక్షేత్రాలన్నింటినీ ప్రభుత్వ అజమాయిషీ నుంచి తొలగించి సమాజానికి అప్పజెప్పాలని విశ్వహిందూపరిషత్ ప్రభుత్వాన్ని కోరుతున్నది. హిందువుల మనోభావాలను దెబ్బతీయరాదని, తీర్థస్థలాల పవిత్రతను కాపాడాలని ఆశిస్తున్నది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ఈ విషయంపై చర్య తీసుకోవాలని, దోషులను కఠినంగా శిక్షించాలని, హిందువుల తీర్థస్థలాల పవిత్రతను కాపాడాలని డిమాండ్ చేస్తున్నది.

**– బజ్రంగ్‌లాల్ బాగ్డా, సెక్రెటరీ జనరల్, విశ్వహిందూ పరిషత్, ఢిల్లీ**

రకాలు. వీటి నుంచి వచ్చే వార్షిక ఆదాయమే రూ. 500 కోట్లు. అంటే లడ్డూ ప్రసాదం ఒక సామ్రా జ్యమే. ఈ సామ్రాజ్య నిర్మాత కల్యాణం అయ్యంగార్ అంటారు. లడ్డూ తయారీకోసం ఏటా టీటీడీ ఐదు లక్షల కిలోల నెయ్యి కొనుగోలు చేస్తుంది. ఇందుకు ఆరు మాసాలకు ఒకసారి టెండర్లు పిలుస్తారు. గడచిన ఒకటిన్నర దశాబ్దంపాటు నెయ్యిని సరఫరా చేసిన కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ నుంచి సంవత్సరం క్రితం జగన్మోహనరెడ్డి ప్రభుత్వం కొనుగోలు ఆపేసింది. ప్రసాదాల కోసం వినియోగిస్తున్న ఆవు నెయ్యి నాణ్యమైనది కాదని కొన్నేళ్ల క్రితమే తాను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లానని వేంకటేశ్వర స్వామి అర్చకులు రమణ దీక్షితులు లడ్డూ వివాదం నేపథ్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి చెప్పారు.

ఐదు సంవత్సరాల కాలంలో తిరుమలలో భక్తులకు అందజేస్తున్న ప్రసాదాలలో నాణ్యత లోపించిందని, ముఖ్యంగా లడ్డు నాణ్యత దారుణంగా పడి పోయిందని, ఉచిత మధ్యాహ్న భోజనంలో కూడా లోపం జరుగుతోందని, నాణ్యమైన భోజనం అందజేయడం లేదని పలువురు భక్తులు పలుమార్లు మీడియా ముందు అభిప్రాయపడ్డారు. నందిని నెయ్యిని నిలుపుదల చేసి తక్కువ ధరకు బయట వారినుంచి కొనడానికి టీటీడీ నిర్ణయించిన సమయంలో అంత తక్కువ ధరకు నాణ్యమైన ఆవు నెయ్యిని ఎవరు అందివ్వలేరని, నాణ్యతలేని పదార్థా లను టీటీడీ కొనడానికి నిశ్చయించుకున్నట్లు తెలు స్తోందని అప్పటి నందిని నెయ్యి తయారీదారుల సంఘం అధ్యక్షులు ప్రకటించారు. ఈ అంశాన్ని నాటి పాలకులు పెడచెవిన పెట్టారు.

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి బంధువు ధర్మారెడ్డి టీటీడీ కార్యనిర్వహణాధికారిగా, తిరుపతి శాసనసభ్యుడు కరుణాకర్ రెడ్డి పాలకమండలి అధ్యక్షులుగా ఉండగా గత మార్చి 13వ తేదీన నెయ్యి కొనడానికి దేవస్థానం టెండర్లను పిలిచింది. కిలో ఆవు నెయ్యి రూ. 320లకు కొనడానికి అంగీకరిం చింది. మే 8 వ తేదీన టెండర్లను ఖరారు చేసింది. అప్పటి నుంచి తమిళనాడుకు చెందిన ఏఆర్ డెయిరీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ నెయ్యి సరఫరా చేస్తోంది. ఎన్డీఏ అధికారంలోకి రావడంతో జె. శ్యామలరావు జూన్ మొదటి వారంలో ఈవోగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన పలువురు భక్తులతో ముచ్చటించిన సమయంలో ప్రసాదాలలోనూ, లడ్డు నాణ్యతలోను లోపాలు ఉన్నట్లు ఆయన దృష్టికి వచ్చింది. దీనితో ప్రసాదాలు,



ఈవో శ్యామలరావు

భోజన పదార్థాలలోని ముడి సరుకుల నాణ్యతను క్షుణ్ణంగా తనిఖీ చేయవలసిందిగా అధికారులను ఆదేశించారు. ఇలా ఉండగా జూలై ఆరవ తేదీన రెండు ట్యాంకర్లు, 12వ తేదీన రెండు టాంకర్ల నెయ్యి తిరుమలకు చేరగా, వాటి నాణ్యతను పరీక్షించడం కోసం ఎన్ఏబీఎల్ గుర్తింపు పొందిన ఎన్‌డీబీ



ల్యాబ్‌కు నమూనాలను పంపించారు. నెయ్యిలో కల్తీ పదార్థాలను గుర్తించినట్టు గత జూలై 16 వ తేదీన నివేదిక అందింది. దాంతో టీటీడీ ఆ నాలుగు ట్యాంకర్ల ఆవు నెయ్యిని తిప్పి పంపించే సింది. అంతేకాకుండా 22వ తేదీన ఏఆర్ డెయిరీ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను బ్లాక్ లిస్టులో చేర్చింది. ఈ వివాదం తర్వాత కొన్ని ప్రైవేటు సంస్థల నుంచి నాణ్యమైన నేతిని కొనుగోలు చేస్తున్న టీటీడీ, 2024 –25 సంవత్సరానికి గాను 350 మెట్రిక్ టన్నుల నందిని నెయ్యిని కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకుంది. వీరికి కిలో రూ. 478 చెల్లించడానికి అంగీకారం కుదిరింది.

**లడ్డూలు మాత్రమే కాదు**

తిరుమలలో సాధారణంగా రోజుకు మూడున్నర

## మిగిలిన గుడుల మాటేమిటి?



**తి**రుమల లడ్డును భక్తులు సాక్షాత్తు స్వామివారి వరప్రసాదంగా భావిస్తారు. అటువంటి తిరుమల తిరుపతి స్వామివారి పవిత్ర లడ్డు ప్రసాదం విషయంలో (జంతువుల కొవ్వు కలవడం) ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రకటన హిందువుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచింది.

గత ప్రభుత్వం స్వామివారి లడ్డు ప్రసాదంలో నెయ్యికి బదులుగా జంతువుల కొవ్వుతో చేసిన నూనెలు వాడారని సభాముఖంగా ముఖ్యమంత్రి తెలియజేశారు. ఇది హిందువుల మనసులను కలిచివేస్తోంది. ముఖ్యమంత్రిగారు ఇలాంటి ప్రకటన చేసినారంటే వారివద్ద కచ్చితమైన ఆధారాలు ఉంటాయని విశ్వహిందూపరిషత్ భావిస్తోంది.

ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి వాస్తవ, అవాస్తవాలు హిందూ సమాజం ముందు ఉంచాలి. అలా కాని పక్షంలో తమ రాజకీయ క్రీడలకు హిందువుల పవిత్ర ఆలయాలను ఉపయోగించుకుని అపచారం చేసినట్లే అవుతుందని విశ్వహిందూపరిషత్ హెచ్చరిస్తోంది.

ముఖ్యమంత్రిగారు ప్రకటించినట్లు జంతువుల కొవ్వుతో చేసిన నూనెలు తిరుమల లడ్డులో వాడినది నిజమని తేలితే రాష్ట్రంలోని మిగిలిన ప్రముఖ దేవాలయాల ప్రసాదం విషయంలో కూడా ఏమి జరిగిందో దర్యాప్తుచేయాలని విశ్వహిందూపరిషత్ డిమాండ్ చేస్తున్నది.

ముఖ్యమంత్రి చెప్పినట్లు గత ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇంతటి దుర్మార్గమైన, దైవద్రోహం జరిగి ఉంటే దానికి బాధ్యులు అయినవారు ఎంతటి వారైనా ప్రతీ ఒక్కరు శిక్షార్హులే అని విశ్వహిందూ పరిషత్ తెలియజేస్తున్నది.

ప్రభుత్వం వెంటనే ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటుచేసి అత్యంత వేగంగా దర్యాప్తును పూర్తి చేసి నిందితులు ఎంతటివారైనా వారిని శిక్షించాలని, హిందువుల మనోభావాలను కాపాడాలని విశ్వహిందూపరిషత్ డిమాండ్ చేస్తున్నది.

**– తనికెళ్ల సత్యరవికుమార్,**
**విశ్వహిందూపరిషత్ కార్యదర్శి, ఉత్తరాంధ్ర**

లక్షల లడ్డూలను తయారు చేస్తారు. ఇది కాక అనేక రకాల ప్రసాదాలలోనూ, నైవేద్యాలలోనూ నెయ్యిని విరివిగా వినియోగిస్తారు. ఇందుకు సుమారు రోజుకు 11 వేల కిలోల నెయ్యి అవసరమవుతుంది. స్వామి వారి నివేదనకు రోజూ పదుల సంఖ్యలో ప్రసాదాలు తయారవుతాయి. ఆయా ఆర్జిత సేవలు చేయించు కున్న భక్తులకు దోసెలు, అప్పాలు, జిలేబి, పొంగలి, పులిహోర, దద్ధ్యోజనం వంటి అనేక ప్రసాదాలను అందజేస్తారు. వీటిలో కూడా నెయ్యి విరివిగా వినియోగిస్తారు. అలాగే స్వామివారి గర్భాలయంలో జరిగే దీపారాధనలో కూడా నేతిని వాడుతారు. అఖండ దీపం ఆవునేతితోనే వెలిగిస్తారు.

శ్రీవారికి అత్యంత ప్రీతి పాత్రమైన లడ్డూలలో వినియోగించే నేతిలో జంతు అవశేషాలతో తయారైన నూనెలో కల్తీ జరిగిందన్న వివాదం నేపథ్యంలో టీటీడీ అప్రమత్తమయ్యింది. అనేక జాగ్రత్తలను తీసుకోవడం మొదలుపెట్టింది. ఇందుకు సంబంధించి శ్రీవారి ఆలయంలోని ప్రధాన అర్చకుల బృందం, ఆగమ సలహాదారులతో కూడా దేవస్థానం ఈవో తదితర అధికారులు సమావేశం అయ్యారు. సెప్టెంబరు 23 ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకూ ఆలయంలోని విమానప్రాకారం వద్ద శాంతి హోమం నిర్వహించారు. పంచగవ్య ప్రోక్షణ చేయించారు.

తిరుమల ఆలయంలో వినియోగిస్తున్న కల్తీ నేతికి సంబంధించిన ల్యాబ్ టెస్టింగ్ రిపోర్టులను దేవస్థానం ఈవో శ్యామలరావు పత్రికలకు విడుదల చేశారు. పాత టెండర్ ప్రకారం కొనుగోలు చేసిన నేతిని పరిశీలించినప్పుడు లభించిన సమాచారం, తాజాగా వినియోగిస్తున్న నేతిని పరిశీలించినప్పుడు వెలువడిన వివరాలను ఎక్స్ వేదికగా దేవస్థానం బహిర్గత పరిచింది. జూన్ మాసం తరువాత అత్యంత ప్రామాణికమైన విధానంలో సేకరించిన ఆవు నేతిని మాత్రమే దేవస్థానం వినియోగిస్తున్నందున భక్తులు చింతించవలసిన అవసరం లేదని వివరణ ఇచ్చింది. అలాగే గత పాలకమండలి సేంద్రియ పదార్థాల పేరుతో కొనుగోలు చేసిన ఆహార పదార్థాలను వినియోగించకుండా ఉచిత భోజన పథకంలో కూడా నాణ్యమైన కూరగాయలు, బియ్యం, పాలు వంటివి నిబంధనల మేరకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపింది. ప్రసాదాలు, నైవేద్యాలు ఉచిత భోజనం, లడ్డులలో దేనిలోనూ నాణ్యత విషయంలో రాజీపడడం లేదని దేవస్థానం ప్రకటించింది.

ఈ కల్తీ పదార్థాల వినియోగంపై అటు కేంద్ర ప్రభుత్వం కూడా దృష్టి పెట్టింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఈ అంశంపై స్థానిక నేతలతో మాట్లాడారు. మరో ఇద్దరు కేంద్రమంత్రులు కూడా ఈ అంశంపై ఆవేదన వ్యక్తం చేశారు. కల్తీ పదార్థాల వినియోగానికి సంబంధించిన వ్యక్తులను చట్ట ప్రకారం శిక్షించాలని వాదనకు మద్దతు పలికారు. గత పాలకమండలి అధ్యక్షుడు, కార్యనిర్వహణ అధికారిపై కేసును నమోదు చేయాలని, పైస్థాయి వ్యక్తుల నుంచి సామాన్య భక్తుల వరకు అభిప్రాయ పడుతున్నారు. ఇలాంటి అపచారం మరోసారి జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ప్రతిభక్తుడు ఆశిస్తున్నాడు.

### సిట్‌తో దర్యాప్తు

తిరుమల ఆలయంలో జరిగిన వివాదాస్పద నేయి, ముడిపదార్థాల వినయోగం పై దోషులను గుర్తించడానికి ఐజి స్థాయి అధికారి సారథ్యంలో ప్రత్యేక దర్యాప్త బృందం (సిట్) ఏర్పాటు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. ప్రసాదాల పదార్థాలలో కల్తీ నివారణకు దేవస్థానం తీవ్ర చర్యలకు ఆదేశిం చింది. ఈ ఏడాది కర్ణాటకలోని నందిని సంస్థ నుంచి

## పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష



ఇంతకు ముందు అధికారంలో ఉన్న వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రభుత్వ హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నారని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరోపించారు. శ్రీవారి లడ్డులో కల్తీ నెయ్యి వాడారన్న ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఆయన పదకొండు రోజుల ప్రాయశ్చిత్త దీక్షను సెప్టెంబర్ 22న ఆరంభించారు. ఆఖరికి అయోధ్యకు కూడా కల్తీ పదార్థాలతో చేసిన లడ్డూ ప్రసాదాన్నే నాటి టీటీడీ బోర్డు పంపిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ పాలనలో 219 ఆలయాలు ధ్వంసమైనాయని చెప్పారు. అంతకుముందు ఇలాంటి దుర్ఘటన చర్చిలో లేదా మసీదులో జరిగితే జగన్ ఇదేతీరులో స్పందించ గలరా? అని ప్రశ్నించారు పవన్. జాతీయ స్థాయిలో సనాతన ధర్మ రక్షణ బోర్డ్ ఏర్పాటు చేయవలసిన సమయం వచ్చిందని పవన్ పిలుపునిచ్చారు. లడ్డూ వివాదం నేపథ్యంలో ట్విటర్ (ఎక్స్)లో ఆయన ఈ సూచన చేశారు. ఆ బోర్డు దేశంలోని అన్ని దేవాలయాలకు సంబంధించిన అంశాలను పరిశీలించాలని ఆయన కోరారు. సనాతన ధర్మానికి ఎలాంటి హాని జరిగినా నిరోధించడానికి మనమంతా ఏకం కావలసిన అవసరం ఉందని ఆయన అన్నారు. టీటీడీ జరిగిన అవకతవకలు తనను కలచివేశాయని చెప్పారు.

## కర్ణాటక ప్రసాదాలకు పరీక్ష



శ్రీవారి లడ్డ తయారీలో జంతువుల కొవ్వు వాడారన్న వివాదం నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం విశిష్ట నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలలో పంపిణీ చేస్తున్న ప్రసాదాలను పరీక్ష చేయించనున్నట్టు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డి సెప్టెంబర్ 21న తెలియచేశారు. కర్ణాటకలో 34,000 దేవాలయాలు ప్రభుత్వ అజమాయిషీలో ఉన్నాయి. ఇందులో 205 ఆలయాలు ఏ గ్రేడ్‌గా విభజించారు. వీటి వార్షిక ఆదాయం రూ. 25 లక్షలు. బి తరగతిలో 193 దేవాలయాలు ఉన్నాయి. వీటి వార్షిక ఆదాయం రూ 5లక్షల నుంచి రూ. 25 లక్షలు. మిగిలినవన్నీ సి తరగతిలోకి వస్తాయి. ఇవన్నీ రూ. 5 లక్షల లోపు ఆదాయం వచ్చే గుడులు. ఇందులో ప్రతి దేవాలయం పూజ తరువాత భక్తులకు ప్రసాదం అందిస్తుంది. రాష్ట్రంలోని దేవాలయాల ప్రసాదం మీద ఫిర్యాదు ఏమీ లేకున్నా, భక్తులకు సందేహాలు తలెత్తకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్టు మంత్రి తెలియచేశారు. కర్ణాటక దేవాలయాలలో పంచుతున్న ప్రసాదాలను పరీక్ష చేయించవలసిందిగా కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి సూచించారు కూడా. ప్రసాదాల తయారీలో కర్ణాటక పాల సంఘాల సమాఖ్య నుంచి నందిని నెయ్యినే తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు.







## సమగ్ర విచారణ జరపాలి: ప్రహ్లాద్ జోషి

శ్రీవారి లడ్డులో కల్తీ వాస్తవమని గుజరాత్ సంస్థ వెల్లడించిన దృష్ట్యా దీని మీద దర్యాప్తు చేయించాలని కేంద్ర ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి కోరారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వెల్లడించిన అంశాలు చాలా తీవ్రమైనవని, వాటి మీద దర్యాప్తు జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. జోషి ఈ అంశాన్ని ప్రపంచ ఆహార క్రమబద్ధీకరణ అంశం మీద జరుగుతున్న గోష్ఠి నుంచి వెల్లడించడం విశేషం.



## 'సిట్' దర్యాప్తు అవసరం: బీజేపీ

శ్రీవారి లడ్డు ప్రసాదంలో కల్తీ పదార్థాలు, జంతువుల కొవ్వు ఉన్న పదార్థాలు వాడడం తీవ్ర అపచారమనీ, సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి చేసిన ఈ అంశాల మీద ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ చేయించాలని ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ అధికార ప్రతినిధి జి. భానుప్రకాశ్‌రెడ్డి కోరారు. తిరుపతి పోలీస్ సూపరింటెండెంట్ ఎల్. సుబ్బారాయుడికి ఆయన ఇచ్చిన ఫిర్యాదులో ఈ అంశం పేర్కొన్నారు. తిరుమల పవిత్రకు భంగం కలిగించిన వారందరిపైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

కొనుగోలు చేయవలసిన నేతిని రవాణా చేసే వాహనాలకు అత్యాధునికమైన ఎలక్ట్రానిక్ లాకింగ్ సిస్టం జీపీఎస్ సిస్టం ఏర్పాటు చేయాలని ఆదేశించింది. మార్గమధ్యంలో కల్తీ జరగడానికి వీలు లేకుండా గట్టి చర్యలను చేపట్టింది.

**ఎందుకు ఆందోళన ?**

రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత గత పాలకుల చర్యలపై అనేక వర్గాల నుంచి అసంతృప్తి వ్యక్తం కావడంతోపాటు ఫిర్యాదులు రావడం మొదలయ్యింది. ఈ నేపథ్యంలోనే టీటీడీలో కూడా గత ఐదేళ్లలో అనేక అవకతవకలు జరిగాయని రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. దీనితో దేవస్థానం వ్యవహారాల పైన అధ్యయనం చేయవలసిందిగా ప్రభుత్వం ఈవోని ఆదేశించింది. ఆయన విజిలెన్స్ విచారణ చేపట్టారు. అయితే ఈ విజిలెన్స్ విచారణ జరగకుండా నిలుపుదల చేయాలని గత పాలకమండలి సారథులు విఫల ప్రయత్నం చేశారు. చివరకు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో కేసు వేసి విజిలెన్స్ విచారణను అడ్డుకోవాలని అప్పటి పాలకమండలి అధ్యక్షులు, ఆనాటి ముఖ్యమంత్రి సమీప బంధువు వైవీ సుబ్బారెడ్డి న్యాయస్థానాన్ని అభ్యర్థించిన విషయం తెలిసిందే. వీటన్నిటికంటే అర్హత లేకపోయినప్పటికీ దొడ్డిదారిలో దేవస్థానం ఈవోగా పదవి చేపట్టిన ధర్మారెడ్డి నిర్ణయాలపై గత ఐదేళ్లలో అనేకమంది అనేక సందర్భాలలో అసంతృప్తిని వ్యక్తం చేశారు. ధర్మారెడ్డి తీసుకున్న నిర్ణయాలపై బహిరంగంగానే వ్యతిరేకత వ్యక్తం అయినా నాటి పాలకులు పెడచెవినబెట్టారు. సరిదిద్దే చర్యలేవీ చేపట్టలేదు. ధర్మారెడ్డి కుమారుడు వివాహం జరగడానికి కొన్నిరోజుల ముందు అనుమానాస్పదంగా మరణించారు. ఆ సూతకంలోనే ధర్మారెడ్డి కొండపై విధులకు హాజరయ్యారు. గుడిలోకి వెళ్లారు. దీనిపైనా వ్యతిరేకత వ్యక్తమైనా ఎవరూ పట్టించుకోలేదు.


2019లో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పగ్గాలు చేపట్టినప్పటి నుంచి తిరుమల ఆలయానికి సంబంధించి అనేకమైన వివాదాలు చోటుచేసుకున్నాయి. శ్రీవారి బంగారాన్ని తాకట్టు పెట్టి ప్రభుత్వం రుణంత తీసుకోవాలనుకోవడం, శ్రీవారి నిధులను వారికి ఇష్టమైన ప్రైవేటు బ్యాంకులకు తరలించి అక్కడ వారి నుంచి ప్రభుత్వానికి రణాలు తీసుకోవాలని అనుకోవడం, తిరుమల బస్సు టికెట్లపై ఏసుక్రీస్తుకు సంబంధించిన సమాచారం ముద్రణ, ఏకంగా టీటీడీ వెబ్ సైట్‌లో ఏసయ్య ప్రత్యక్షం కావడం వివాదాలలో కొన్ని. ఈ హిందూ ధర్మ వ్యతిరేక చర్యలు ప్రజలను తీవ్రంగా కలచి వేసాయి.

**ఇంత జరిగినా...!**

తిరుమల ఆలయానికి సంబంధించి ఆచార వ్యవహారాలను రోజువారీ విధానంలో పర్యవేక్షించ డానికి జీయర్ వ్యవస్థ అనాదిగా ఉంది. తిరుమల లోనే ఉండే పెద్ద జీయర్, చిన్నజీయర్ తదితర స్వాములు ఆలయానికి సంబంధించిన అనేక కార్యక్రమాలలో రోజు పాల్గొంటూ ఉంటారు. అలాగే శ్రీవారి అర్చకులకు సంబంధించిన పెద్ద బృందమే తిరుమలలో ఉంటుంది. వీరిలో రమణ దీక్షితులు (పూర్వ ప్రధానార్చకుడు), ప్రస్తుతం ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు తదితరుల పర్యవేక్షణ ఉంటుంది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా ఆలయంలో జరుగుతున్న విపరీత పోకడలను ఈ జీయర్ వ్యవస్థగాని, ఆలయానికి సంబంధించిన ఆగమ సలహామండలిలోని పెద్దలు గాని ప్రశ్నించక పోవడమే విచారకరం. వీరంతా ఎందుకు మౌనం పాటిస్తున్నారు? ఎందుకు అధికారుల మాటలకు మడుగులొత్తుతున్నారు? ఏ కారణంగా తిరుమలలో అర్చకస్వాములు, జీయర్ స్వాములు, వేద పండితులు, ఆగమ సలహాదారులు, పాలక మండలి తీసుకునే తీవ్ర చర్యలను నివారించలేకపోతున్నారో తెలియరావడం లేదు.

**అవినీతి అడ్డాగా టీటీడీ**

– ఆంధ్రప్రదేశ్ శీర్షికలో, పే.16



## క్షమార్హం కాదు: అయోధ్య అర్చకులు దాస్

శ్రీవారి లడ్డు తయారీలో ఇలాంటి అకృత్యాలకు పాల్పడినవారు, 'తీవ్ర నేరం చేశారనీ, దేశద్రోహమని' అయోధ్య ప్రధాన అర్చకుడు అచార్య సత్యేంద్రదాస్ వ్యాఖ్యానించారు. ఇది తీవ్ర నేరపూరిత చర్యగా పరిగణించాలని ఆయన అన్నారు. తిరుపతి లడ్డుకు ఎంతో ప్రశస్తి, పవిత్ర ఉన్నాయని అలాంటి ప్రసాదం విషయంలో ఇంతటి దుశ్చర్యకు పాల్పడడం క్షమార్హం కాదని అన్నారు. ఇది భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచిందని చెప్పారు.




# ఆర్టికల్ 370: పాక్, కాంగ్రె

కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఎ పునరుద్ధరణ విషయంలో తమ దేశ వైఖరి, కాంగ్రెస్-నేషనల్ కాన్ఫరెన్స్ కూటమి వైఖరి ఒకటేనని పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖ్వాజా అసీస్ వ్యాఖ్యానించారు. ఆర్టికల్ 370 రద్దు వ్యతిరేక వైఖరి తీసుకున్నందుకు కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలలో ఆ కూటమికి విజయం తథ్యమేనని కూడా అసీస్ ఆశాభావం వ్యక్తం చేశారు. పాక్ రక్షణ మంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడమంటే తీవ్రమైన అంశమేనని ఇప్పటికే బీజేపీ దుయ్యబట్టింది. కాబట్టి ఆ రెండు పార్టీలు జాతీయతను సమర్ధించే పార్టీలు కావని తేలిపోయిందని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా సెప్టెంబర్ 22న వ్యాఖ్యానించారు. నిజానికి పాక్ మంత్రి ఈ వ్యాఖ్య చేసిన తరువాత కూడా కాంగ్రెస్, లేదా రాహుల్ ఖండించలేదు. ఏమైనా ఆర్టికల్ 370ని మళ్లీ ఆవాహన చేయాలన్న కోరిక కొన్ని పార్టీలలో ఉంది. అదే ఆర్టికల్‌తో ఎన్నికల వైతరిణిని దాటాలనీ, మోదీని మళ్లీ దానితోనే ఎదుర్కొనాలని విఫలయత్నం చేస్తున్నాయి. అందుకే అసెంబ్లీ ఎన్నికలలో దాని మీద కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) ఆధారపడ్డాయి. మా బాటలోకే ఆ రెండు పార్టీలు వచ్చాయని పాకిస్తాన్ ధీమాగా ప్రకటించడం అందుకే.

సెప్టెంబర్ 18న జమ్ముకశ్మీర్ అసెంబ్లీ తొలి విడత పోలింగ్ జరిగింది. 24 శాసనసభ స్థానాలకు పోలింగ్ అంతా ప్రశాంతంగా జరగడం, అందునా 61 శాతం నమోదు కావడం చరిత్ర. పదేళ్ల అనంతరం, ప్రత్యేకించి స్వయం ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దు తర్వాత శాసనసభ ఎన్నికలు జరుగుతుండడంతో దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా రాజకీయ పండితులు అక్కడి రాజకీయాలపై ఆసక్తి కనబరుస్తున్నారు. కిస్త్వాడ్ జిల్లాలో 77 శాతం, పుల్వామా జిల్లాలో తక్కువగా 44 శాతం పోలింగ్ నమోదైంది. పోస్టల్ బ్యాలెట్లు, మారుమూల ప్రదేశాల వివరాలు రావలసి ఉంది. భారీ పోలింగ్ 370 రద్దు తెచ్చిన సానుకూల మార్పునకు తొలి సంకేతంగా భావించాలి.

ఒకే దేశంలో రెండు చట్టాలు, ఇద్దరు ప్రధానులు, రెండు పతాకాలు ఉండడాన్ని వ్యతిరేకించే జాతీయవాదుల కల మోదీ సర్కారు హయాంలో ఆగస్టు 5, 2019న నెరవేరింది. ప్రత్యేక ప్రతిపత్తిని ఇచ్చే అదే ఆర్టికల్ 370ను ఆవాహన చేయాలని మోదీ వ్యతిరేకులు భావిస్తున్నట్టే ఉంది. ఇందుకు నిదర్శనం అసెంబ్లీ ఎన్నికలలో 370 రద్దు అంశాన్ని ఆ శక్తులు సాధనంగా వాడుకోవాలని చూడడమే. ఇందుకు కాంగ్రెస్ తోడ్పడుతున్నది. కశ్మీర్‌లో ముస్లిం జనాభాదే ఆధిపత్యం. రెండు ప్రాంతాల జనాభాను కలిపి చూస్తే ముస్లింలు 70 శాతానికిపైగా, హిందువులు దాదాపు 25 శాతం ఉంటారు. కశ్మీర్ లోయలో ముస్లింలు 90 శాతానికిపైగా, జమ్ము ప్రాంతంలో హిందువులు 65 శాతానికిపైగా ఉంటే, ముస్లింలు 30 శాతానికిపైగా ఉంటారు.

ఆర్టికల్ 370 రద్దు తర్వాత పార్లమెంట్ ఎన్నికలు (2024) జరిగాయి. అప్పుడు రద్దు అంశం వ్యతిరేకులకు ఉపకరించలేదు. అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ అంశాన్ని కీలకంగా చేయడానికి సెక్యులరిస్టులు, మేధావులు, వారిని అనుసరించే మీడియాతో పాటు పలు వర్గాలు ఇప్పటికీ ప్రయత్నించాయి. ఆర్టికల్ రద్దుపై దేశ వ్యాప్తంగా ప్రజలు సానుకూలంగా ఉండడంతోపాటు నరేంద్ర మోదీ నేతృత్వంలో ఎన్డీఏ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని తెలిసిన ఈ వర్గం లోక్‌సభ ఎన్నికల్లో ఆర్టికల్ రద్దు అంశాన్ని ఉద్దేశపూర్వకంగానే ప్రస్తావించలేదు. వారు ఊహించినట్టే ఆ ఎన్నికల్లో జమ్ముకశ్మీర్‌లో ఐదు నియోజకవర్గాలకుగాను బీజేపీ, నేషనల్ కాన్ఫరెన్స్ చెరో రెండు, ఇండిపెం డెంట్ ఒక స్థానంలో గెలవడంతో మోదీ సర్కార్‌కు వ్యతిరేకంగా ఏకపక్ష తీర్పు రాలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ఓడించి మోదీ ఆర్టికల్ 370 రద్దుకు ప్రజామోదం లేదని ఎండగట్టాలని చూశాయి.




**మతప్రాతిపదికన గట్టేందుకు యత్నాలు**

జమ్ముకశ్మీర్‌లో అభివృద్ధి, శాంతిభద్రతల ప్రాతిపదికన కాకుండా మతవిభజనతో గట్టెక్కాలనే ఆశయంతో మతతత్వశక్తులతో, దేశద్రోహులతో పొత్తు పెట్టుకొని బీజేపీని అడ్డుకోవాలని శతవిధాలా కొన్ని సంస్థలు పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. అక్కడ నియోజకవర్గాల పునర్విభజన తర్వాత జమ్మూలో 43, కశ్మీర్‌లో 47 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. కశ్మీర్ లోయలో బలహీనంగా ఉన్న బీజేపీకి ఏ మాత్రం అవకాశం ఇవ్వరాదనే ఆలోచనతో కాంగ్రెస్ 'ఇండి' కూటమి పేరుతో పాకిస్తాన్‌కు వత్తాసు పలికే ఫరూక్ అబ్దుల్లా నేతృత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్‌తో పొత్తు పెట్టుకుంది. అది అభ్యంతరం చెప్పక పోయుంటే పాకిస్తాన్ పాట పాడే మరో పార్టీ పీడీపీతో కూడా జట్టు కట్టడానికి సిద్ధమైంది కాంగ్రెస్. గత లోక్‌సభ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలతో పొత్తు పెట్టుకొని పోటీ చేసిన కాంగ్రెస్‌ను అక్కడి ప్రజలు తిరస్కరించారు. అయినా పాఠం నేర్వని కాంగ్రెస్ ఇప్పుడు దేశ ప్రయోజనాలనే పణంగా పెట్టడానికి సిద్ధమైంది. ముస్లింలు అధికంగా ఉండే కశ్మీర్ లోయలోని 47 స్థానాల్లో కూటమి అత్యధిక స్థానాలు పొందాలని, బీజేపీకి పట్టున్న జమ్ము ప్రాంతంలో హిందూ ఓట్లను చీల్చే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రణాళికలు రూపొందించింది. జమ్ముకశ్మీర్ రాజకీయాల్లో ప్రాంతీయ పార్టీలది ముఖ్య భూమిక కాగా, ప్రభుత్వ ఏర్పాటులో జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ కీలక



# స్, ఎన్‌సీ బాంధవ్యం

పాత్రను పోషిస్తున్నాయి.

రాష్ట్రంలో 1967, 1972 ఎన్నికల్లో వరుసగా మెజార్టీ సాధించి ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది. 2002లో ఎన్నికల్లో హంగ్ ఏర్పడడంతో, సంకీర్ణ ప్రభుత్వం ఒప్పందంలో భాగంగా కాంగ్రెస్ నేత గులాం నబీ అజాద్ రెండో విడతలో రెండున్నర సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్నారు. కాంగ్రెస్ 2008లో 17 శాతం ఓట్లతో 17 స్థానాలు పొందింది. 2014లో 18 శాతం ఓట్లు పొందినా ఐదు సీట్లు కోల్పోయి 12 స్థానాలకు పరిమితమైంది. లోక్‌సభ ఎన్నికలను పరిశీలిస్తే 2004, 2009 ఎంపీ ఎన్నికలలో 2 స్థానాలు గెలిచిన కాంగ్రెస్ 2014, 2019, 2024 ఎన్నికల్లో ఒక్క సీటు కూడా సాధించలేదు. 2024 ఎన్నికల్లో 'ఇండియా' కూటమిలో భాగంగా ఎన్సీ, పీడీపీలతో పొత్తు పెట్టుకుని 19 శాతానికి పైగా ఓట్లు సాధించినా ఒక్క సీటు కూడా గెలవలేదు. ఇప్పుడు ఎన్సీతో పొత్తుపెట్టుకొని కశ్మీర్‌లో ఒకటి రెండు సీట్లు గెలిచి, జమ్ములో మాత్రం పెద్ద ఎత్తున హిందువుల ఓట్లలో చీలిక తెచ్చే కుటిల యత్నాలకు పాల్పడింది.

మరోవైపు మోదీ శకానికి ముందు రాష్ట్రంలో బీజేపీ ప్రభావం నామమాత్రమే. 1972లో జనసంఘ్ 3 స్థానాలు గెలిచిన అనంతరం బీజేపీ 1987లో 2, 1996లో 8 స్థానాల్లో గెలిచి ఉనికిని చాటుకుంది. 2002లో ఒక్క సీటు కూడా గెలవని బీజేపీ 2008లో 12 శాతం ఓట్లతో 11 స్థానాలు గెలిచింది. 2014లో 22 శాతం ఓట్లతో 25 స్థానాల్లో గెలవడంతో బీజేపీ రాష్ట్రంలో కీలక పార్టీగా ఆవిర్భవించింది. పీడీపీతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి జమ్ములో బలపడింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే 2014, 2019లో మూడు స్థానాలు గెలిచిన బీజేపీ, 2019 తర్వాత లద్దాఖ్ వేరుకావడంతో 2024లో జమ్ములో మిగిలిన రెండు ఎంపీ స్థానాల్లో గెలిచి తన పట్టును నిలుపుకుంది. నియోజకవర్గాల పునర్విభజనతో జమ్ములో సీట్లు పెరగడం తమకు సానుకూలమనే భావనలో ఉన్న బీజేపీ, ఎక్కువ స్థానాలు సాధించి ప్రభుత్వ ఏర్పాటులో ప్రధాన పాత్ర పోషించేలా ప్రణాళికలు రూపొందించింది. తన బలహీనత తెలిసిన బీజేపీ జమ్ములో ఒంటరిగా పోటీ చేస్తూ, అదే సమయంలో కశ్మీర్‌లో దాదాపు పదికిపైగా స్థానాల్లో సైద్ధాంతికంగా తమకు అనుకూలమైన స్వతంత్ర అభ్యర్థులతో ఎన్నికల అనంతరం అవగాహన కుదుర్చుకోవాలని చూస్తుంది.


జాతీయ దృక్పథంతో ఆలోచించకుండా సున్నితమైన మత విభజనతో బీజేపీని లక్ష్యంగా చేసుకోవాలని చూస్తున్న వర్గాలు ఆర్టికల్ 370 రద్దును ఆయుధంగా మార్చుకుంటున్నాయి. ముస్లింలు కీలక పాత్ర పోషించే ఈ ఎన్నికల్లో వారు బీజేపీని ఎలాగూ ఓడిస్తారని, దీంతో ఆర్టికల్ రద్దు చేసిన బీజేపీ నిర్ణయాన్ని వారు వ్యతిరేకించారని ప్రపంచానికి చూపాలని వారి ఎత్తుగడ. ప్రాంతీయ పార్టీలు తమకు లేని అధికారంతో ఆర్టికల్ 370 పునరుద్ధరిస్తామని కశ్మీర్ వ్యాలీలో వాగ్దానాలు చేస్తున్నా, కాంగ్రెస్ మాత్రం ఆచితూచి అడుగు లేస్తోంది. రాష్ట్ర హోదా పునరుద్ధరణకు గట్టిగా డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్, ఆర్టికల్ 370 పునరుద్ధరణ అంశాన్ని మాత్రం ప్రస్తావించడం లేదంటేనే దీని ప్రాధాన్యత తెలుస్తుంది.

**పలు ప్రయోజనాల కోసమే ఆర్టికల్ రద్దు**

ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదం తుడిచి పెట్టుకుపోయిందా? అని మేధావులు ప్రశ్నిస్తూ పెడర్థాలు తీస్తూ వక్రభాష్యాలు చెబుతున్నారు. ఆర్టికల్ రద్దు తర్వాత ఉగ్రవాద దాడులు, రాళ్ల దాడులు తగ్గాయని గణాంకాలే చెబుతున్నాయి. 2004 నుంచి యూపీఏ ప్రభుత్వ హయాంలో 7217 ఉగ్రదాడులు జరగ్గా, 2014 తర్వాత అవి 2259కు తగ్గాయి. ఆర్టికల్ 370 రద్దు తర్వాత 900 మంది ఉగ్రవాదులు హతమయ్యారని, రాళ్లురువ్వుడు ఘటనలు తగ్గాయని పార్లమెంట్‌లో హోం శాఖ సహాయ మంత్రి ఒక ప్రశ్నకు జవాబుగా చెప్పారు. మరోవైపు ఉగ్రవాదులు కశ్మీర్‌లో తమ ఆటలు సాగకపోవడంతో తమ పంథాను మార్చుకొని అమాయక ప్రజలను ముఖ్యంగా పండిట్లను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నారు. కశ్మీర్ బదులు జమ్ములో దాడులకు ప్రయత్నిస్తున్నారు. వారి ప్రధాన లక్ష్యం కశ్మీర్‌లోకి తిరిగి రావాలనుకునే పండిట్లను, అక్కడ వ్యాపారాలను ప్రారంభించాలనుకునేవారిని భయభ్రాంతులను చేయడమే. ఇక్కడ మరో ప్రధానాంశం ఉగ్రవాద నిర్మూలన ఒక్కటే ఆర్టికల్ ముఖ్య ఉద్దేశం కాదు. స్వయం ప్రతిపత్తి ఆర్టికల్‌ను అడ్డుపెట్టుకొని అక్కడి రాజకీయ పార్టీలు, నేతలు, వేర్పాటువాదుల అరాచకాలను అడ్డుకోవడం కూడా ఒక లక్ష్యమే. దేశంలో ఇతర రాష్ట్రాల్లో ఉన్నట్టు అక్కడ కూడా అదే రకమైన పాలన, చట్టాలుండాలి. ప్రకృతి అందాలతో మెరిసే అక్కడ పర్యాటకులు పెరగాలి. రాష్ట్రం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందాలి. ఇవేవీ పట్టించుకోకుండా కశ్మీర్ ముస్లింలకు ఏదో అన్యాయం జరిగిపోయిందని చెప్పే మేధావులు జమ్ముతో పాటు దేశం ప్రజల మనోభావాలను పరిగనలోకి తీసుకోకపోడం విచారకరం.

జమ్ము కశ్మీర్‌లో గెలుపు కోసం 'ఇండి' కూటమితో పాటు ఇతర ప్రాంతీయ పార్టీలు బీజేపీని లక్ష్యంగా చేసుకుంటున్నాయి. బీజేపీని బూచిగా చూపి ముస్లింల ఓట్లను గంపగుత్తగా పొందాలని చూస్తున్నాయి. అవామీ ఇత్తేహాద్, అప్నీ వంటి చిన్న చిన్న పార్టీలు బీజేపీకి తోకపార్టీలుగా వ్యవహ రిస్తున్నాయని 'ఇండి' కూటమి, పీడీపీ విమర్శిస్తుంటే, ఎన్సీ, పీడీపీ పార్టీలే బీజేపీతో తెరచాటున ఒప్పందాలు కుదుర్చుకున్నాయని ఆరోపిస్తుండడంతో బీజేపీ కేంద్రంగా ఎన్నికలు జరుగుతున్నాయి.

అసెంబ్లీ ఎన్నికలకు ఆర్టికల్ 370 రద్దుకు లంకె పెడుతున్న కుహనా లౌకికవాదులు దేశంలోనే కాకుండా ప్రపంచం వ్యాప్తంగా సంచలనం రేపిన ఆర్టికల్ రద్దు నిర్ణయాన్ని 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎందుకు ప్రస్తావించలేదు? ఎందుకంటే దేశ ప్రజల వాంఛ వారికి తెలుసు. ప్రజా తీర్పు ఎలా ఉంటుందో వారికి తెలుసు. అప్పుడు మిన్న కుండా ఉన్నవారు ఇప్పుడు ఏదో జరగబోతుందనే ఆశతో 370 ఆర్టికల్ రద్దుపై గొంతెత్తుతున్నారు. ఆ ఆర్టికల్‌ను తిరిగి తీసుకొచ్చి జమ్ముకశ్మీర్‌లో మళ్లీ అగ్నికి ఆజ్యం పోయడమే వీరి లక్ష్యమా? కాలం మారింది. ఆర్టికల్ 370 రద్దు చరిత్రలో కలిసి పోయింది. జమ్ముకశ్మీర్ గతంతో పోలిస్తే ఇప్పుడు రక్తసిక్తం దిశగా కాకుండా అభివృద్ధి వైపు పయని స్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ఎదురు చూస్తున్న జమ్మూ కశ్మీర్ ప్రజాతీర్పు భారతదేశ కీర్తిని మరింత పెంచేలా ఉంటుందని ఆశిద్దాం. తీర్పు ఎలా ఉన్నా ఆర్టికల్ 370కి జీవం పోయడం ఎవరికీ సాధ్యం కాదు.



**డా. ఐ.వి.మురళీ కృష్ణ శర్మ**
సీనియర్ జర్నలిస్ట్



పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో ప్రజాస్వామ్య పోకడలు మరుగున పడి, నియంతృత్వ ధోరణే రాజ్యమేలిందన్న వాదనలు మొదటి నుంచి వినిపిస్తున్నాయి. కాంగ్రెస్‌పార్టీకి అధికార మార్పిడి జరిగిన తర్వాత కూడా ఈ విమర్శలు ఉన్నాయి. బీఆర్ఎస్ హయాంలో నాటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఆలోచన, నిర్ణయాధికారం మేరకే పరిపాలన సాగిందని విపక్షాలే కాదు.. రాజకీయ విశ్లేషకులు కూడా వాదించిన పరిస్థితి ఉంది. కాంగ్రెస్ పార్టీని ముప్పతిప్పలు పెట్టిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చే పనిలో పడ్డారు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.

# ఎందెందు వెతికినా

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పదేళ్ల పాలనలో కొనసాగిన అకృత్యాలు, అరాచకాలు, ఒంటెత్తు పోకడలు, ఖజానాకు చిల్లులు పెట్టిన నిర్ణయాలు వంటివి బయటకు వస్తున్నాయి. అధికారంలో ఉన్నన్నాళ్లు.. కనీసం ఆలోచనకు కూడా రాని రీతిలో ఊహించని అంశాలు, తీసుకున్న అసంబద్ధ నిర్ణయాలు బయటకు వస్తూనే ఉన్నాయి.

ఏ పని అయినా... ఏ అంశం అయినా కాంట్రాక్ట్ ఇచ్చే సమయంలో అతి తక్కువ ధరకే కేటాయింపులు చేసి, తర్వాత భారీగా అంచనాలు పెంచే విధానం బీఆర్ఎస్ హయాంలో కొనసాగింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి అంశాన్నీ సునిశితంగా పరిశీలిస్తూ, లోటుపాట్లు, పొరపాట్లను వెలికి తీస్తోంది. అందులో భాగంగానే బయటపడిన అంశంపై పూర్తిస్థాయిలో విచారణకు సిద్ధమవుతోంది. కాంట్రాక్టర్ల అంచనాలు పెంచే అంశంలోనే రూ. లక్షల కోట్ల అవినీతి జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాదు.. కాంట్రాక్టులు కేటాయించే సమయంలోనూ నిబంధనలకు విరుద్ధంగా తమకు



చెందిన వాళ్లకే అప్పగించినట్లు ప్రస్తుత ప్రభుత్వం గుర్తించింది. కాళేశ్వరం నుంచి.. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కొత్త కలెక్టరేట్ల నిర్మాణం, అతిపెద్ద అంబేద్కర్ విగ్రహం, అమరవీరుల స్మారకజ్యోతి.. చివరకు సెక్రటేరియట్ నిర్మాణం లోనూ కమీషన్ల దందా నడిచినట్లు ఆనవాళ్లు బయటపడుతున్నాయి. పై కాంట్రాక్టుల అంచనాలు అమాంతం పెంచేసినప్పటికీ, దాదాపు అన్నింట్లోనూ నాసిరకం పనులు జరిగినట్లు అధికారులు, అలా రూ. లక్షల కోట్ల ప్రజాధనం వృథా అయిందని, ఎంపిక చేసిన కొన్ని కంపెనీలకు రూ. కోట్లకు కోట్లు ప్రోత్సాహకాలు ఇచ్చినట్లు, అతితక్కువ ధరకే సర్కారు భూములను కట్టబెట్టినట్లు కూడా బయటకు వస్తోంది. వీటన్నింటిపైనా సమగ్ర నివేదిక అందించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వం కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్ల అంశంలో జ్యుడీషియల్ కమిషన్లను ఇప్పటికే ఏర్పాటు చేసింది. మరికొన్నింటిపై విజిలెన్స్, ఏసీబీ విచారణ చేపడుతోంది. ఒక్కో శాఖ ఆధ్వర్యంలో అంచనాల వ్యయం పెంపు తతంగంపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షిస్తున్న కొద్దీ పదేళ్లలోని పనులు, కాంట్రాక్టుల విషయంలో భారీ ఎత్తున అవినీతి, అక్రమాలు బయటపడుతున్నాయి. మొదట్లో టెండర్ దాఖలు చేసే సమయంలో అంచనాలు తక్కువగా చూపించడం, ఆ తర్వాత కొంతకాలానికి వాటిని సవరించడం. పనులు పూర్తయ్యే సరికి ఖర్చు రెండు మూడింతలు కావడం వంటివి కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి వచ్చాయి. అయినవాళ్లకు కాంట్రాక్టులు కట్టబెట్టేందుకు నిబంధనలను గత పాలకులు బేఖాతరు చేసినట్లు ప్రస్తుత ప్రభుత్వం గుర్తించింది.

ఐటీ పరిశ్రమల శాఖపై నిర్వహించిన సమీక్షలోనూ,కొన్ని కంపెనీలకు గత ప్రభుత్వం ప్రత్యేకంగా ఇచ్చిన ప్రోత్సాహకాలు, భూముల కేటాయింపుల్లోనూ అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. రూ. లక్షల కోట్లు పెట్టి పనులు చేయించామని, అప్పులు తెచ్చి క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ చేశామని గొప్పగా చెప్పుకుంటున్న బీఆర్ఎస్ నాయకుల వ్యవహార శైలిని బట్టబయలు చేయాలని సీఎం రేవంత్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వివిధ శాఖల్లోని పనులు, కాంట్రాక్టులు ఎవరెవరికి ఇచ్చారు? ఎంతకు ఇచ్చారు? ముందు అనుకున్న అంచనాలు ఎంత? ఎప్పుడెప్పుడు ఎంత పెరిగింది.. పెంచారు ? నిబంధనల ప్రకారం సవరించారా? లేక ఇంకేదైనా లోగుట్టు ఉందా ? దానికి సంబంధించిన ఆధారాలు ఏమున్నాయి? పనులు చేపట్టిన కంపెనీలు, ఏజెన్సీలు ఎవరివి? వాటికి బ్యాక్ గ్రౌండ్ లింకులు ఏమున్నాయో పూర్తి వివరాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు చెబుతున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా సంభవించిన భారీ వర్షాలు, వరదలకు వందల సంఖ్యలో చెరువులకు గండ్లు పడ్డాయి. మిషన్ భగీరథ పైప్‌లైన్లు ఎక్కడికక్కడ పగిలిపోయాయి. రెండేళ్ల క్రితం వరదలు వచ్చినప్పుడూ ఇదే జరిగింది. రాష్ట్రంలో చిన్న,పెద్ద దాదాపు 46 వేల చెరువులను మిషన్ కాకతీయ పథకం కింద బాగుచేసినట్లు గత ప్రభుత్వం చెప్పుకుంది. కానీ, ఎక్కడా పనులు పూర్తిగా చేయలేదన్న విషయం వరదల నష్టంతో బట్టబయలయ్యింది. మిషన్ కాకతీయ కోసం గత ప్రభుత్వం బడ్జెట్‌లో ఏకంగా రూ.6, 532 కోట్ల

# అందందే అవినీతి

మేర కేటాయింపులు చేసి, 80 శాతం వరకు ఖర్చు చేసింది. మిషన్ కాకతీయ టెండర్ల ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగినట్లు మొదటినుంచీ ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వం దృష్టికి ఈ విషయం వెళ్లినా పట్టించుకోలేదు . గ్రామాల్లో మిషన్ కాకతీయ చెరువుల కాంట్రాక్ట్ పనులు చేస్తున్నది మనోళ్లేనని.. చూసీ చూడనట్లు వదిలేయండని అప్పట్లో బీఆర్ఎస్ పెద్దలు కొందరు అధికారులను ఆదేశించినట్లు ప్రస్తుత సర్కార్ దృష్టికి వచ్చింది. పైగా ఒక్కో చెరువు టెండర్ అప్రూవల్‌కు ఇంత మొత్తం ఇచ్చుకోవాల్సిందేనంటూ పైస్థాయి నుంచి ముందే వ్యవహారం కుదుర్చుకుని అనుమతులు జారీ చేశారని కూడా నివేదికలు వచ్చాయి. ఒక్కో చెరువుకు అవసరమైన దానికంటే ఎక్కువ అంచనా వ్యయానికి



అప్రూవల్స్ తీసుకున్నారని, అయినా పనులు నాణ్యతగా చేయలేదని ప్రభుత్వం గుర్తించింది. ఇలా నాసిరకం పనుల వల్లే చిన్నపాటి వర్షాలు, వరదలకే చెరువుల కట్టలు తెగిపోతున్నాయని, గండ్లు పడుతున్నాయని అంటున్నారు.

ఇటు.. రాష్ట్ర పరిపాలన భవనమైన సెక్రటేరియెట్, జిల్లా పరిపాలన భవనాలైన సమీకృత కలెక్టరేట్ కార్యాలయాల విషయంలోనూ గత ప్రభుత్వం లెక్కాపత్రం లేకుండా అంచనాలు పెంచేసింది. నాసిరకం పనులతో ఇప్పటికీ ఇబ్బందులు ఎదురవుతున్నాయని అంటున్నారు. సెక్రటేరియెట్‌లోని కొన్ని గదుల్లో వర్షపు నీరు లీక్ అవుతోంది. కొన్నిచోట్ల పెచ్చులు ఊడిపోతున్నాయి. మొదట సెక్రటేరియెట్ నిర్మాణ ఖర్చును రూ. 400 కోట్లుగా అంచనా వేసి, బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. టెండర్లు ఖరారైన తర్వాత రూ. 619 కోట్లు ఖర్చవుతుందని, ఆ తర్వాత ధరలు పెరిగాయంటూ నిర్మాణ ఖర్చును రూ. 800 కోట్లకు పెంచేశారు. అది ఆ తర్వాత రూ. వెయ్యి కోట్లకు చేరింది. పనులు పూర్తయినా కూడా లెక్కలపై స్పష్టత లేదు. అసలేం జరిగిందో వివరాలు ఇవ్వాలని అధికారులను సీఎం ఆదేశించారు. సెక్రటేరియెట్ నిర్మాణానికి సంబంధించి 2020 అక్టోబర్‌లో షాపూర్‌జీ పల్లోంజీ సంస్థ టెండర్లు దక్కించుకుంది. కానీ, దీంట్లోనూ కొన్ని సబ్‌కాంట్రాక్టులు బీఆర్ఎస్ ముఖ్య నాయకులకు దక్కినట్లు ఆరోపణలు ఉన్నాయి. కేవలం సెక్రటేరియెట్ నిర్మాణ సమయంలో వీడియో తీసేందుకే దాదాపు రూ. కోటి కేటాయించినట్లు లెక్కలు చూపించారు. వాస్తవానికి ఏడాది కాలంలో పూర్తి కావాల్సిన పనులు ఆలస్యం కావడంతో ఖర్చును అంతకంతకూ పెంచుతూ పోయారు. జిల్లా సమీకృత కలెక్టరేట్లలోనూ ఇదే వ్యవహారం నడిచింది. జిల్లాల్లో అప్పటి జిల్లా ఇన్‌చార్జి మంత్రులు తమకు అయినవారికి సబ్ కాంట్రాక్టులు ఇప్పించుకున్నట్లు ఈ ప్రభుత్వం దృష్టికి వచ్చింది. సమీకృత కలెక్టరేట్లకు రూ. 1500 కోట్లుగా వేసిన అంచనా, రూ.1850 కోట్లు దాటింది.

ఇటు.. రాయదుర్గం నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు 31 కి.మీ మెట్రోకు గత ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. ప్రాజెక్ట్ డీపీఆర్‌లో రూ. 4,650 కోట్లు అవుతుందని అంచనా వేయగా, శంకుస్థాపనకు వచ్చేసరికి అంచనా వ్యయం మరో రూ.1600 కోట్లకు పెరిగింది. అసలు సంబంధం లేని రూట్‌ను ఎంచుకోవడం ఏమిటి? ఆ ప్రతిపాదనలను పెంచడం ఏమిటి? ఎవరికి కమీషన్‌ల కోసం ఇలా చేశారు? అనే విమర్శలు ఉన్నాయి. ఈ పనులను సబ్‌కాంట్రాక్టుల కోసం తనకు నచ్చినవాళ్ల పేర్లను గత ప్రభుత్వంలోని మున్సిపల్ శాఖ మంత్రి ఎల్ అండ్ టీకి సూచించినట్లు ప్రస్తుత ప్రభుత్వం గుర్తించింది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి విమానాశ్రయం మెట్రో రూట్‌ను మార్చారు.

ఇక జీహెచ్ఎంసీతో పాటు మున్సిపాలిటీలు, ఆయా కార్పొరేషన్లలో చేపట్టిన ఫ్లైఓవర్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్ల నిర్మాణం, ఇతర వీధిదీపాలు వంటి కాంట్రాక్టులన్నీ నాటి మున్సిపల్ శాఖ మంత్రి చెప్పినవాళ్లకే దక్కాయని ప్రభుత్వం దృష్టికి వచ్చింది. హైదరాబాదులో ఫ్లైఓవర్ల నిర్మాణానికి టెండర్ల నిబంధనలు మార్చినట్లు తేలింది. పైగా టెండర్‌ను ఓ కంపెనీ దక్కించుకుంటే అందులోని పనులను పూర్తిగా సబ్ కాంట్రాక్టర్లు చేపట్టినట్లు వెల్లడైంది. గత ప్రభుత్వంలోని ఓ మంత్రి బావమరిది బినామీలు, ఆ మంత్రి పీఏ బినామీలు ఈ సబ్ కాంట్రాక్ట్? పనులు చేపట్టినట్లు ప్రస్తుత ప్రభుత్వం గుర్తించింది.

అంతేకాదు..పారిశ్రామిక ప్రోత్సాహకాల విషయంలోనూ అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. గత సర్కార్ ఎంపిక చేసిన కొన్ని పరిశ్రమలకు ప్రోత్సాహాల కింద కూ. 2,250 కోట్లు ఇచ్చినట్లు ప్రస్తుత ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఎంఎస్ఎంఈలకు గల దాదాపు రూ.4,500 కోట్ల బకాయిలు ఇవ్వకుండా, పదుల సంఖ్యలోని పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇవ్వడం ఏమిటనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

హైదరాబాద్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం, అమరవీరుల స్మారక చిహ్నం అంచనా వ్యయాలను రెట్టింపు చేసింది. ఇప్పటికీ అంబేద్కర్ విగ్రహం దగ్గర పనులు పూర్తి కాలేదు. అమరవీరుల స్మారక చిహ్నానికి, ముందు అనుకున్న స్టీల్‌కు బదులు నాసిరకం స్టీల్ వాడినట్లు ప్రస్తుత ప్రభుత్వం గుర్తించింది. పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు రూ. 400 కోట్లు ఖర్చు అవుతుందని తొలుత అంచనా వేశారు. పూర్తయ్యే సమయానికి అది రూ. 600 కోట్లు దాటింది. సచివాలయం వద్ద లుంబినీ పార్కు వద్ద అమరవీరుల స్మారక చిహ్నాన్ని రూ. 80 కోట్ల అంచనాతో చేపట్టగా, దాని ఖర్చు రూ. 177 కోట్లకు పెరిగింది. ఎన్టీఆర్ గార్డెన్ పక్కన రూ.104 కోట్ల అంచనాలతో 2016లో అంబేద్కర్‌విగ్రహ ఏర్పాటుకు గత ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. తర్వాత ఆ ఖర్చు బాగా పెరిగింది. నాలుగు సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్ల అంచనా వ్యయాన్ని కూడా గత సర్కార్ భారీగా పెంచింది. వరంగల్ ఆస్పత్రి నిర్మాణానికి రూ. 1100 కోట్లు అనుకుంటే, మరో రూ. 726 కోట్లు పెరిగింది. రూ.2,679 కోట్లతో ఎల్బీనగర్, సనత్ నగర్, అల్వాల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణానికి అనుమతులు ఇవ్వగా, ఆ అంచనా వ్యయం రూ. 3,562 కోట్లకు చేరింది. పూర్తయ్యేసరికి ఎంత అవుతుందో కూడా తెలియని పరిస్థితి. ఈ నాలుగు ఆస్పత్రుల అంచనా వ్యయంపైనా విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆఖరికి ప్రగతి భవన్ నిర్మాణం కూడా రూ.38 కోట్లతో మొదలుకాగా, గత ప్రభుత్వం రూ. 46 కోట్లకు పెంచేసింది. అటు.. మిషన్ భగీరథ కోసం రూ. 32 వేల కోట్లు ఖర్చు చేశారు. టెండర్ నిబంధనలేవీ పాటించకుండా వ్యవహారం నడపగా, ఇందులో దాదాపు రూ.20 వేల కోట్ల అవినీతి జరిగినట్లు భావిస్తున్నారు. లక్షా 50 వేల కిలోమీటర్ల మేర పైప్‌లైన్లు వేసినట్టు, ఈ పథకం కింద 2.72 కోట్ల జనాభాకు మంచినీళ్లు అందుతున్నట్టు అధికారిక లెక్కల్లో పేర్కొన్నారు. కానీ, క్షేత్రస్థాయి సర్వేలో 53 శాతం ఇళ్లకు నీళ్లే అందడం లేదని తేలింది.

**సుజాత గోపగోని,**
**సీనియర్ జర్నలిస్ట్, 6302164068**

# అవినీతి

**తిరుమల శ్రీవారి ప్రసాదం లడ్డూ తయారీలో కల్తీ జరిగిందని, జంతువుల కొవ్వు కలిపి అపవిత్రం చేశారని వచ్చిన ఆరోపణలతో హిందూ సమాజం ఆగ్రహంతో మండిపోతుంది. శ్రీ వేంకటేశ్వర స్వామిని కలియుగ దైవంగా భావించే భక్తకోటి కన్నీటి పర్యంతం అవుతోంది. లడ్డూ తయారీకి గత ప్రభుత్వ హయాంలో వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసినట్టు నివేదికలతో పాటు నెయ్యిని అతితక్కువ ధరకు కొనుగోలు చేయడం కూడా లడ్డూ తయారీలో కల్తీ జరిగిందనే వాదనకు బలం చేకూర్చినట్లైంది. జగన్మోహనరెడ్డి అయిదేళ్ల పాలన కమీషన్ల చుట్టూనే తిరిగినట్లు భావించిన ప్రజలు, ఇప్పుడు లడ్డూ అంశంలో కూడా కమీషన్ల వ్యవహారం చోటు చేసుకుందని ఆరోపణలు రావడంతో దేశం యావత్తూ ఆగ్రహ జ్వాలలు ఎగసిపడుతున్నాయి.**


వైవీ సుబ్బారెడ్డి

తిరుమలేశుడి ప్రీతిపాత్ర ప్రసాద లడ్డూ తయారీలో కల్తీ జరిగిందన్న విషయం జాతీయ స్థాయిలో గగ్గోలు రేపుతోంది. ఎంతో ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన లడ్డూను కలుషితం చేయడాన్ని కేంద్రప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న వివరాలు పంపిస్తే విచారణకు ఉపయోగకరంగా ఉంటుందని చంద్రబాబుకు తెలిపారు.

హిందూ విశ్వాసాలపట్ల ఇది కుట్ర, ద్రోహం, క్షమించరాని నేరమంటూ కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, గిరిరాజ్ సింగ్, బండి సంజయ్, పలువురు ఎన్డీయే, బీజేపీ జాతీయ నేతలు తీవ్రంగా స్పందించారు. మరోవైపు, 'కలియుగ దైవానికి ఇంత అపచారామా?' అంటూ కోట్లాది మంది భక్తులు, ప్రభుత్వ నేతలు, వివిధ రంగాల ప్రముఖులు చలించి పోతున్నారు. దీనిపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని ఒకవైపు, కేంద్ర దర్యాప్తు సంస్థను రంగంలోకి దింపాలని మరోవైపు ఒత్తిడి పెరిగిపోతోంది. శ్రీవారిని, భక్తులనూ కొల్లగొట్టిన అప్పటి సీఎం జగన్‌ను, అప్పటి కార్యనిర్వహణాధికారి ధర్మారెడ్డిని శిక్షించాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, డీజీపీకి లేఖలు అందుతున్నాయి. తిరుమల పవిత్రతను కాపాడాలంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రూపంలో పిటిషన్ దాఖలైంది.

నాటి ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డిపైనా, కల్తీ నెయ్యిని సరఫరా చేసిన సంస్థలపైనా జాతీయ భద్రతా చట్టం కింద చర్య తీసుకోవాలంటూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు, డీజీపీ ద్వారకా తిరుమలరావుకు మరో న్యాయవాది లేఖలు రాశారు. ఈ అంశంపై అయోధ్య ప్రధాన పూజారి సత్యేంద్ర దాస్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, దీనిని సనాతన ధర్మంపై కుట్ర, దాడిగా పరిగణించాలని వ్యాఖ్యానించారు. ఈ మొత్తం వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలంటూ ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు లేఖ రాశారు. కాగా ఈ వ్యవహారంలో విచారణ చేయడానికి ఐజీ స్థాయి, అంతకంటే ఉన్నత స్థాయి అధికారి ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్నట్లు ప్రకటించింది.

**తేడా తెలియనంతగా కల్తీ చేశారు: టీటీడీ ఈవో**

శ్రీవారి లడ్డూ, అన్నప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యిలో పంది, గొడ్డు వంటి జంతువుల కొవ్వు కలిసినట్టు నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డ్(ఎన్‌డీడీబీ) నివేదికతో పాటు పలు పరీక్షల్లో నిర్ధారణ అయిందని, తేడా తెలియనంతగా కల్తీకి పాల్పడ్డారని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. 'లడ్డూల్లో వినియోగించే నెయ్యి నాణ్యతపై ఫిర్యాదులు వస్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. ఈ క్రమంలో ప్రసాదాల నాణ్యతపై పలువురు నిపుణులతో చర్చించగా, నాణ్యమైన నెయ్యి లేకపోవడంతోనే లడ్డూల రుచి తగ్గిందనే విషయం తెలిసింది. అయితే, టెండర్ల ద్వారా వచ్చే నెయ్యిని వందశాతం పరీక్షించే ల్యాబ్ తిరుమలలో లేదు. దాంతో, టెండరుదారులు పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకున్నారు. నెయ్యి నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షించేందుకు డిసెంబరు నాటికి అత్యాధునిక ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తున్న ఐదు సంస్థల్లో దుండిగల్‌కు చెందిన ఏఆర్ డెయిరీ ఫుడ్స్ నెయ్యిలోనే నాణ్యత లేదు. ఆ సంగతి ఎన్‌డీడీబీ ల్యాబ్ పరీక్షలో నిర్ధారణ అయ్యింది. దీంతో ఏఆర్ సంస్థను నిషేధిత జాబితాలో ఉంచాం' అని ఈవో శ్యామలరావు వివరించారు. ఈ కల్తీ విషయంలో తొలిసారి మీడియాతో మాట్లాడినప్పుడు నెయ్యిలో జంతువుల కొవ్వు ఉన్నట్టు స్పష్టత రాలేదు. తర్వాత అధికారులతో మాట్లాడి నిర్ధారించుకున్నాం.

ఇక మీదట ఎలాంటి నెయ్యి కొనుగోలు చేయాలనే అంశంపై ఇప్పటికే ఐదుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశాం. 'నందిని' నెయ్యిని తిరిగి కొనుగోలు చేస్తున్నాం నాణ్యతను నిర్ధారించే వరకు ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహారపదార్థాలతో శ్రీవారికి నైవేద్యాలు సమర్పిస్తున్నాం. అయితే వీటి నాణ్యత విషయం లోనూ కొన్ని అనుమానాలు ఉండడంతో, దానిని పరిశీలినపై ఓ కమిటీని నియమించాం' అని ఈవో చెప్పారు. .

**కమిషన్ల కోసం కక్కుర్తి**

వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని శాఖల్లోను కమిషన్ల రూపంలో కాసులు పిండేశారని ఆరోపణ లున్నాయి. టీటీడీలో అధికార దుర్వినియోగం దానికి పరాకాష్ట. కమీషన్‌ల యావతోనే తిరుమలలో స్వామివారి లడ్డూ, ఇతర ప్రసాదాల తయారీలో వాడే ఆవునెయ్యిని చౌకధరకు కొనుగోలు చేసినట్లు అన్ని పక్షాలు, ప్రజాసంఘాలు, హిందూభక్తులు ఆరోపిస్తున్నారు. గేదెనెయ్యి రూ. 600లకు పైగా లభిస్తుండగా, స్వచ్ఛమైన ఆవునెయ్యి రిటైల్ ధర రూ. 800–రూ. 1,200 ల వరకు ఉంటుంది. ఈ నేపథ్యంలో కర్ణాటక పాల ఉత్పత్తిదారుల సమాఖ్య నుంచి సేకరిస్తున్న నెయ్యిని ఆపివేసి, కమిషన్ల కోసమే ప్రైవేటు డెయిరీల నుంచి కిలో రూ. 320లకు ఆవునెయ్యిని కొనుగోలుచేశారని ఆరోపణల ఉన్నాయి.

**తిరుమలపై కపటం**

తిరుమల తిరుపతి దేవస్థానం విషయంలో క్రైస్తవమతస్థులైన దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి, తనయుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ప్రవర్తన కపటంగానే ఉండేదని భక్తులు విమర్శిస్తున్నారు. రాజశేఖరరెడ్డి హయాంలో కూడా అన్యమత ప్రచారం, తిరుమలను క్రైస్తవ నిలయంగా మార్చడానికి ప్రయత్నాలు, తిరుమల ఏడుకొండలు కాదు రెండు కొండలే అని పేర్కొంటూ


భూమన కరుణాకర రెడ్డి


ఏవీ ధర్మారెడ్డి

# అడ్డాగా టీటీడీ

భక్తుల మనోభావాలను చిన్నబుచ్చారు. ప్రజాగ్రహాన్నీ చవి చూశారు. తండ్రీకొడుకులు ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు ఎన్నడూ సతీసమేతంగా తిరుమలకు రాలేదు. జగన్ అయితే స్వామివారి ప్రసాదాలనే స్వీకరించలేదు. చివరికి తలపై వేసిన అక్షతలను సైతం అంటరాని వస్తువుగా భావించినట్లు దులిపి వేశారు. తిరుమలను మొదటి నుంచి పవిత్ర ప్రదేశంగా కాక వ్యాపార వ్యవస్థగా భావించినట్లు విమర్శలున్నాయి. టీటీడీ పాలకమండలి ఛైర్మన్‌లుగా అన్యమతస్థుల నియామక వివాదాలు ఎదుర్కొంటున్న, నాటి ముఖ్యమంత్రి బంధువులు సుబ్బారెడ్డి, కరుణాకర రెడ్డిలను నియమించారు. టీటీడీని రాజకీయ, వ్యాపార వ్యవస్థగా మార్చేసిన వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర రెడ్డి, మాజీ ఈవో ధర్మారెడ్డి గత ఐదేళ్లుగా వివాదాలకు కేంద్ర బిందువుగా ఉన్నారు. ప్రభుత్వం పాలక మండలి సభ్యుల సంఖ్యను 50కి పెంచి రాజకీయ పునరావాసంగా మార్చేసింది. వారిలోనూ లిక్కర్ వ్యాపారులు, క్రిమినల్ చరిత్ర గలవారు ఉండడం వివాదాస్పదమైంది. తిరుమలలో అన్యమత ప్రచారం జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, అన్యమతస్తులు ఉద్యోగాలు చేస్తూ బహిరంగంగా తమ మత విశ్వాసాలు పాటించడం కూడా వివాదమైంది. విపక్షాలు అడ్డుకోవడంతో టీటీడీకి చెందిన ఫిక్స్‌డ్ డిపాజిట్లు ప్రభుత్వ ఖజానాకు బదిలీ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. తిరుమలలో భక్తులకు అందించే సేవల రుసుములను పెంచేశారు.

**మొదటి నుంచి మత వివక్షే**

వైసీపీ ప్రభుత్వం మొదటి నుంచి తమ పట్ల వివక్ష, అలసత్వం, నిర్లక్ష్యం, చూపిస్తోందని హిందువులు విమర్శిస్తున్నారు. అంతర్వేదిరథం దగ్ధం, రామతీర్థం రామచంద్రమూర్తి విగ్రహ ధ్వంసం, విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయం విగ్రహాల అపహరణ, పిఠాపురంలో ఆలయాల్లోని విగ్రహాలు ధ్వంసం వంటి సంఘటనలపై ప్రభుత్వం సరిగ్గా స్పందించకపోవడం, నిందితులకు ప్రభుత్వ పరంగా సహకారం ఉందనే ఆరోపణలు రావడం వంటివి హిందూ సమాజంలో ఆగ్రహం తెప్పించాయి.

**ధర్మారెడ్డి కేంద్రంగా....**

వైఎస్ కుటుంబానికి సన్నిహితుడుగా ముద్ర ఉన్న ఏవీ ధర్మారెడ్డి కేంద్ర ప్రభుత్వ సర్వీస్ నుంచి వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీకి డిప్యుటేషన్‌పై వచ్చారు. జూలై 12,2019న తిరుమల ప్రత్యేకాధికారిగా జేఈవో పోస్టులో నియమితులైన కొద్ది రోజులకే ఆయన కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా అదనపు ఈవో పోస్టును సృష్టించింది. 2022 నవంబరులో ఈవో జవహర్‌రెడ్డి బదిలీ కావడంతో ఇన్‌చార్జి ఈవోగా కొనసాగారు.


మూడున్నరేళ్ల పాటు తిరుమలలోనూ, ఎన్నికల ఫలితాల వరకూ టీటీడీపైనా పట్టు తెచ్చుకున్నారు. శ్రీవాణి ట్రస్టు సృష్టించి శ్రీవారి దర్శనానికి రేటు కట్టారని, ధనికులకే మంచిదర్శనం కల్పించి పేదల పట్ల వివక్ష, తారతమ్యం చూపారన్న విమర్శలు వచ్చాయి. ఆ మహా దేవుడిపై విశ్వాసంతో, భక్తితో వ్యయప్రయాసలకు ఓర్చి కొండపైకి చేరుకొనే భక్తులకు సౌకర్యాల కల్పనను గాలికొదిలేసి నాటి ముఖ్యమంత్రి జగన్‌కు ఉపయోగపడతారనుకున్న ప్రముఖుల సేవలో తరించేవారు.

**భూమన: కుమారుడి కోసం నిధుల మళ్లింపు**


జగన్మోహనరెడ్డి హయాంలో భూమన కరుణాకర రెడ్డి టీటీడీ ఛైర్మన్‌గా పనిచేసింది చాలా స్వల్ప కాలమే అయినా పుట్టెడు అవినీతి ఆరోపణలు మూటకట్టుకున్నారు. 2023 సెప్టెంబరులో నియమితులైన ఆయన ఎన్నికల షెడ్యూలు విడుదలయ్యే వరకూ తొమ్మిది నెలలు ఆ పదవిలో ఉన్నారు. ఆ స్వల్ప వ్యవధిలోనే సొంత రాజకీయ ప్రయోజనాల కోసం టీటీడీని వాడుకున్నారన్న ఆరోపణలను ఎదుర్కొన్నారు. ఇంజనీరింగ్ పనులకు భారీగా నిధుల కేటాయింపులు జరపడం వివాదాన్ని సృష్టించింది. టీటీడీ నిధులను తిరుపతి అభివృద్ధికి మళ్లించడం, టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు వంటి నిర్ణయాలు విమర్శలకు దారితీశాయి. తిరుపతి నుంచి అప్పట్లో ఎమ్మెల్యేగా పోటీలో ఉన్న కుమారుడి రాజకీయ ప్రయోజనాల కోసమే ఇలాంటి నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయి.

జగన్మోహనరెడ్డి మే 30, 2019న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన 21 రోజులకు వైవీ సుబ్బారెడ్డి టీటీడీ పాలకమండలి ఛైర్మన్‌గా నియమితులయ్యారు. రెండేళ్ల తరువాత(2021 ఆగస్టు 8న)పదవీ కాలం పొడిగింపుతో రెండవ దఫా కూడా నియమితులై 2023 ఆగస్టు దాకా కొనసాగారు. ఇంత కాలం కొనసాగినవారెవరూ అప్పటివరకు టీటీడీ చరిత్రలోనే లేరు. ఆయన అధికారానికి అడ్డు లేకుండా పోయింది. అనుకున్నదే తడవుగా ఉత్తర్వులు జారీ అయ్యేవి.

ఈ క్రమంలో పలు అడ్డగోలు నియామకాలు జరిగాయని, బంధువులు, సొంత సామాజిక వర్గానికి చెందిన వారిని కీలక పదవుల్లో నియమించారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఉదాహరణకు అత్యంత ప్రాధాన్యత కలిగిన ఐటీ విభాగానికి ఏమాత్రం అర్హత, అనుభవం లేని వ్యక్తిని హెడ్‌గా నియమించడం కలకలం సృష్టించింది. ఈయన హయాంలో చేపట్టిన ఎస్వీబీసీ సలహాదారుల నియామకాలు కూడా వివాదాస్పదమయ్యాయి. తిరుమల పవిత్రతపై హిందూ భక్తుల్లో కలవరం రేగుతున్న నేపథ్యంలో వారి వేళ్లు ఆ ముగ్గురి వైపే చూపుతున్నాయి.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్




42

# రామాయణ కాలం నాటి నీటి ప్రణాళికలు

అమెరికాలోని పురావస్తు పరిశోధన సంస్థ ఈ మధ్య ఒక గ్రంథాన్ని ప్రచురించింది. అందులో శ్రీ.వి.బి.లాల్, కె.యన్.దీక్షిత్‌లు రాసిన ఓ వ్యాసం వేల సంవత్సరాల క్రితం భారత్‌లో పరిణతి చెందిన జలశాస్త్ర విజ్ఞానాన్ని ప్రపంచానికి చాటి చెప్తున్నది. ఉత్తరప్రదేశ్‌లోని శృంగవేరపురలో జరిపిన త్రవ్వకాల్లో కనుక్కున్న విశేషాలు మనం చాలా గర్వించదగ్గవి.

అక్కడి తవ్వకాల్లో ఓ పెద్ద చెరువు బయటపడ్డది. గంగనీటిని మళ్లించి ఈ చెరువును నింపే కాలువలు భద్రంగా ఉన్నవి. చెరువు చిన్నదేం గాదు, 750 అడుగుల పెద్దది.

రామాయణంలో పేర్కొన్న ప్రఖ్యాత ప్రదేశాల్లో జరిపే తవ్వకాలలోని భాగం ఈ పరిశీలన. ఇదో పెద్ద ప్రణాళిక. ఈ ప్రణాళికను మన పవిత్ర గ్రంథాలైన రామాయణ, మహాభారతాలు అసలు నిజంగా జరిగినవా?కాదా? అన్న విషయం నిరూపించటానికి చేపట్టారు.

ఎటువంటి ఆధారం లేకుండానే 'రామాయణం కేవలం కట్టుకథే!' అనే మహాత్ములు, మేధావులు ఎంతోమంది ఉన్నారు. వాల్మీకి రామాయణం యావద్భారతంలో అన్ని మూలల వాళ్లు, అన్ని భాషల వాళ్లు పరమ పవిత్రంగా చూస్తారు. హైందవ జీవన సరళిలో ఇది అంతర్భాగం. రామాయణంలో వివిధ పాత్రలు సజీవాలు. సమాజంలో అందరికీ ఆదర్శంగా నిలుస్తారు రాముడు, లక్ష్మణుడు, భరతుడు, ఆంజనేయుడు ఇలా ఎందరో. రామాయణమే కట్టుకథ అనే మేధావుల మాటల్లో జాతిని ఛిద్రంచేసే కుట్రమాత్రమే కనిపిస్తుంది.

ఈ మేధావులకు మరి ఇతర దేశాల గ్రంథాలు కట్టుకథలుగా కనిపించవు. విదేశీ మతాలు, వాళ్ల రచనలనే కల్పితాలనిగాని, కృత్రిమాలనిగాని అనరు. వీళ్లల్లో ఎక్కువమంది హిందువులే! విదేశీయుల నిగూఢ కుట్రలను అర్థం చేసుకోక వాళ్ల వ్యాఖ్యానాలను చిలకల్లా మాత్రం వల్లిస్తుంటారు. మనం అనాగరికులం, శాస్త్రజ్ఞానం లేదు, ఆంగ్లేయులే అన్నీ నేర్పారని నమ్మేవాళ్లెందరో!!

ప్రస్తుతం కనుక్కున్న చెరువు కట్టటం జలశాస్త్ర విజ్ఞాన పరాకాష్ఠకు ఓ నమూనాగా చెప్పొచ్చు.

"అక్కడ లభించిన కుండలు, నాణాలు చెక్కిన ముద్రికలు, బొమ్మలు లాంటి వాటి ఆధారంతో ఈ చెరువును తవ్విన కాలనిర్ణయం జరిగింది. ఇక్కడి జలయంత్ర శాస్త్రం అనిర్వచనీయమైంది. పురాతన భారతీయ శాస్త్ర జ్ఞాన పరిపూర్ణతను తెలియజేస్తుంది. దీనిని ప్రజలకు నీటి వసతిగానే కాకుండా ధార్మిక కార్యక్రమాలకు కూడా ఉపయోగించేవారని అక్కడ బయటపడ్డ దేవీ విగ్రహాలు తెలుపుతున్నవి" అని రాశారు రచయితలు.

శృంగవేరపురను ప్రయాగకు 35 కిలోమీటర్ల నైరుతి దిక్కులో కనుక్కున్నారు. ఇక్కడ గంగానది గుర్రపునాడాలా వంపు తిరిగి ఉంటుంది. ఈ శృంగవేరపుర క్రీస్తు పూర్వం 1100 సంవత్సరాల ప్రాంతంలోనిదని పరీక్షల వల్ల తేలింది. అంటే అప్పటికి క్రైస్తవంగాని, ఇస్లాంగాని పుట్టలేదు! మొదట నదీ తటాన మొదలై జనాభా పెరిగే కొద్దీ దూరదూర భూభాగానికి వ్యాపించింది ఈ పట్టణం.

ఇలా సుదూర ప్రాంతానికి, నదికి దూరంగా పెరిగిన ఊరి ప్రజలకు నీరు సరఫరా చెయ్యటానికి ఉద్దేశించినదే ఈ చెరువు. కోసలదేశ రాజు ఒకరు దీనికి బాధ్యత వహించి తవ్వించారని తేలింది. 'ఆ రాజు ఎవరు?' అన్న విషయం నిర్ధారణగా చెప్పటానికి పరిశోధనలు జరుగుతున్నవి.

సాధారణ శకం పూర్వపు రోజులకు చెందిన చెరువులు భారత్‌లో చాలానే ఉన్నాయి. మధుర ప్రాంతం ఇలాంటి చెరువులకు ప్రసిద్ధి చెందింది. కాని ఈ శృంగవేరపుర చెరువు చాలా భిన్నమైంది. ఇతర మధుర చెరువులతో పోలిస్తే దీనిలో ఎన్నో రెట్ల నీరు నిలువ చేశారు.

త్రవ్వకాలు ఇంకా జరుగుతూనే ఉన్నవి. అయినంతవరకే 750 అడుగుల పొడుగున చెరువు బయటపడ్డది. త్రవ్వకాలు పూర్తయ్యేసరికి ఇంకా చాలా బయటపడవచ్చని ఆశిస్తున్నారు శాస్త్రజ్ఞులు.


**– స్వాతి**

**జాగృతి 20.05.1985 సంచిక నుంచి**




మన ఋషులు

# దానవగురువైనా స్వార్థరహితుడు శుక్రుడు



దానవ గురువు శుక్రాచార్య మహర్షి (ఉపనశుడు). నవబ్రహ్మలలో ఒకరు భృగువు, పులోమ దంపతులు పుత్రుడు. చిన్నతనంలోనే అన్ని విద్యలు నేర్చాడు. అయినా మహాగర్వంతో కుబేరుని వంచించి సంపదను అపహరించాడు. దేవతల ద్వారా అది తెలిసి ఆగ్రహించిన శివుడు ఉపనశుడిని మింగివేసి, మూత్రద్వారం తప్ప దేహరంధ్రాలన్నీ మూసివేశాడు. పరమేశ్వరుడి ఉదరంలో కొట్టుమిట్టాడుతున్న అతను ఎట్టకేలకు మూత్రద్వారం నుంచి శుక్ల రూపంలో బయటికి వచ్చాడు. అలా వెలువడిన అతడిని శివుడు సంహరించ ప్రయత్నించగా జగన్మాత వారించింది. అతడిని కుమారుడిగా పరిగణించిన ఆదిదంపతులు తేజోవంతునిచేసి శుక్రాచార్యుడిగా నామకరణం చేశారు. కుబేరుడి సంపదను తిరిగి ఇప్పించారు. శుక్రాచార్యుడు దానవగణానికి గురువయ్యాడు. కొంత కాలానికి దేవదానవుల యుద్ధంలో పరాజితులవుతున్న దానవులు గురువుకు తమ గోడును వెళ్లబోసుకున్నారు. దాంతో శివుడి గురించి తలకిందులుగా మహా తపస్సుకు ఉపక్రమించాడు. ఆయన తపస్సు ఫలిస్తే దేవతలకు ముప్పు తప్పదని భావించిన ఇంద్రుడు తన కూతురు జయంతిని ఆయనకు సపర్యల పేరిట నియమించాడు. అయినా శుక్రుడు నిష్ఠతో తపస్సు కొనసాగించి, శివును మెప్పించి 'మృతసంజీవని' విద్యను సాధించాడు. అనంతరం జయంతిని వివాహ మాడాడు. వారి పుత్రిక దేవయాని.

# సంజయ రాయబారం : తిక్కన చమత్కారం

42



ధృతరాష్ట్రుడు అందరి క్షేమం అడిగినట్టు సంజయుడు ధర్మరాజుకు చెప్పాడు. అంటే తద్వారా ధర్మరాజు ఆలోచనా విధానం తెలుసుకోవడానికి ఒక సాధారణ ప్రయోగం చేశాడన్నమాట.

ధర్మరాజు కూడా మొదట్లో వారి క్షేమ సమాచారాను ప్రస్తావించి, ఆ తర్వాత స్వోత్కర్షలో పడిపోయాడు. 'వారలు ఎప్పుడైనా మా సోదరుల బల పరాక్రమాదులు జ్ఞాపకం చేసుకుంటారా?' అని తమవారి గొప్పతనం విషయం జ్ఞాపకం చేసినట్టు మాట్లాడాడు. అంటే ధర్మరాజుకి ఇంకా తమ్ముల శౌర్య ధైర్యాల విషయంలో గొప్ప నమ్మకం అలాగే ఉందన్న మాట సంజయుడు గ్రహించాడు. దానికి తగిన విధంగా సమాధానమూ చెప్పాడు.

ఉపక్రమణ విధానంగా ఒక వంక కౌరవాదుల దుర్ణియాలను తెగనాడుతూనే, వేరొకవంక 'పాండు కుమారుల శాంతాత్ములంద్రు' అందువలన 'వారల యకృత్యములన్నియు 'నీవు సైచిన చెల్లవచ్చు, నీ యజాత శత్రుత్వంబు'..అది అతని పేరు ప్రతిష్ఠలకే దెబ్బ సుమా అన్నట్టు సూచించాడు. అంతటితో ఆగక ధర్మరాజుకి సమాధానం చెప్పే అవకాశం కూడా ఇవ్వక, 'ధృతరాష్ట్రుడు మీతో చెప్పమన్న మాటలు కొన్ని ఉన్నాయి. వినమ'ని వరుసగా తను చెప్ప దలుచుకున్న మాటలన్నీ చెప్పేశాడు. అందులో మొదట ధర్మరాజు చెప్పిన మాటలకి – తన తమ్ముల గొప్పదనానికి తగిన సమాధానంగా, 'అక్కడ కౌరవపక్షంలోనూ గొప్ప గొప్ప వాళ్లు లేకపోలేదయ్యా!' అని ద్రోణుడు, భీష్ముడు, కృపుడు, ద్రోణసుతుండు. ప్రభృతి వీరాధివీరులందరినీ ఏకరువు పెట్టి 'వాళ్లు నీతో సమానమే సుమా!? అన్నట్టు ధ్వనింపజేశాడు. చివరిమాటగా, 'రెండు పక్షములకు ప్రియ ముహితంబును ఆత్మ గోరువారి నడిగి చూడు' అని ముగించాడు. సంజయుని కంటె అట్టి హితం కోరువారు ఇంకెవరు గలరు?కనక తన మాటలు తప్పకుండా వినడం మంచిదని పరోక్షంగా సూచించడానికే ఆ మాటలు అన్నాడేమో? అంతేకాదు తుది అస్త్రంగా 'అందరికీ నమస్కారాలు' అంటూ చేతులెత్తి మొక్కి పేరుపేరునా వాసుదేవాదులనుపిలిచి 'సంధి చేయండి మహాప్రభూ!' అన్నట్టు ముగించాడు తన మాటలని.

ఆతని మాటలతో ధర్మరాజులో అనుకున్న ప్రతిచర్య కనిపించింది. తన మాటలలో సంజయునికి సంధికంటె సంగరమునకే అవకాశం ధ్వనించిందేమోనని ధర్మరాజుకంగారుపడ్డాడు. 'నా మాటల్లో స్నేహం తప్ప మరేమైన వినిపించిందా సంజయా! యుద్ధం వద్దు వద్దు అని అంత గట్టిగా చెప్పుతున్నావ్? నేనూ సంధికోసమే ప్రాకులాడుతున్నాను' అని తన అభిప్రాయం. ఎందుకు కలిసి ఉండడం మంచిదో వగైరా అంతాచెప్పి, చివరమాత్రం కొంచెం విసురుగా భీష్మ–ద్రోణాదుల విషయం ప్రస్తావించిన సంజయునికి తగినట్టు–'వారంతా మా వారి ముందుఎంత? వారందరినీ మావారు సులభంగా నిర్జింతురు, నువ్వే మనుకుంటున్నావో యేమో!' అన్న హెచ్చరిక చేశాడు.

సంజయుని మాటలకు ధర్మరాజు చెప్పిన జవాబు,సమంజసంగాను, సహేతుకంగా ఉంటుంది. ఎదుటివాడు తిరిగి సమాధానం చెప్ప లేనంత గట్టిగా చెప్పాడు ఆయన. తన జవాబుకు మరొకడైతే మారు మాటలాడక వెనక్కు రావలసిందే! కాని రాజనీతి విశారదుడు, సమయస్ఫూర్తి గలవాడు అయిన సంజయుడు మాత్రం అంతటితో ఆగలేదు. ధర్మరాజు వ్యక్తిగత పేరు ప్రతిష్ఠలని, అభిలాషని ఆధారం చేసుకుని మరొక అస్త్రం వదిలాడు. "ప్రజ లంతా నిన్ను అహింసామూర్తివని, సహనశీలుడవని తెగ పొగుడుతున్నారు. ఇప్పుడు యుద్ధానికి పూనుకొని ఆ మంచిపేరు పాడుచేసుకుంటావా? నీ మీద చనువుతో చెబుతున్నాను. నీబోటి శాంతమూర్తికి రక్తాన్నంకంటే భిక్షాన్నం మేలు సుమా!" అని పరోక్షంగానే సూచించాడు. ఆఖరికి 'కోపంబు ద్రింగి కొనడంలో అలనాడు హాలాహలం మ్రింగిన నీలకంఠుని ఎన్నాలి. తరువాత నిన్ను చెప్పుకోవాలి' అని ఒక పొగడ్త లాంటిది కూడా వేసి, ధర్మరాజు మానసిక దౌర్బల్యానికి చలనం చూపించాడు. దానితో ధర్మరాజు నిజంగా కొంత తగ్గి పోయాడనే చెప్పాలి. తనేం చెప్పినా ఈ సంజయుడు తిరిగి సమాధానం చెప్పుతాడని తోచిందో యేమో. ఘటనాఘటన సమర్థుండగు వాసుదేవుని అడ్డువేసుకొని "ఆయన ఏం చెబితే అది అందరికీ ధర్మంఅవుతుంది. కదా! ఆయన మాటల ప్రకారంచేద్దాం" అని తప్పుకున్నాడు.

– ర్యాలి సూర్యనారాయణ

జాగృతి 18.11.1968 సంచిక నుంచి

శుక్రాచార్యుడు గురువుగా హిరణ్యకశిపుడు, ఆయన మునిమనవడు బలి చక్రవర్తి ఏకచ్ఛత్రాధిపత్యంగా రాజ్యమేలారు. శుక్రుడు బలితో అనేక యజ్ఞ యాగాదులు చేయించాడు. దానాలు ఇప్పించాడు. ఒకనాడు వామన రూపంలో వచ్చిన వటుడు బలిని మూడు అడుగులు దానంఅడుగగా, బలి హృదయం పూర్వకంగా అంగీకరించాడు. అయితే ఆ వటుడు సాక్షాత్తు శ్రీహరిగా భావించిన శుక్రాచార్యుడు బలి ఆమోదాన్ని అడ్డుకోజూచాడు. 'ఇది దేవతల పన్నాగం. ఈ దానంవల్ల దానవజాతి అంతరిస్తుంది. అలాంటి స్థితిలో ఆడిన మాట తప్పినా పర్వాలేదు. దానంఇవ్వవద్దు' అని వారించినా, బలి గురుహితాన్ని మన్నించలేదు. పైగా 'సత్యం, త్యాగం, ధర్మం, దయ, యోగం అనే వాటిని తనకు పంచ ప్రాణాలుగా చేసి ఉత్తమ గురువు అనిపించుకున్న మీరే ఇలా వారిస్తే ఎలా?' అని ఆయన సూచనను మృదువుగా తిరస్కరించాడు. వటువుకు మూడు అడుగుల భూమిని ధారపోస్తున్న సందర్భంగా ఆఖరి ప్రయత్నంగా శుక్రాచార్యుడు సూక్ష్మరూపంలో కలశంలోని జలధారకు అడ్డుగా ఉన్నాడు. అది గమనించిన వటువేషధారి శ్రీహరి దర్భపుల్లతో కలశ కొమ్మును కెలకడంతో అది గుచ్చుకుని శుక్రుడి కన్ను చితికింది. తన చర్యలన్నీ దానవ కులసంరక్షణేకేనని, ఐనా తాను తీర్చి దిద్దిన శిష్యుడు బలి అంతటి ధర్మాత్ముడిగా మన్నన అందుకోవడంపట్ల గర్వించిన శుక్రాచార్యుడు,తనకు ఇష్టమైనట్లే చేయవలసినది చెప్పాడు. శుక్రుడు గొప్ప విజ్ఞాని, దానవ గురువైనా, స్వార్థరహితుడు. భేద భావాలకు అతీతుడు. ప్రత్యర్థి బృహస్పతి పుత్రుడు కచుడికి విద్యాదానం పాటు మృత సంజీవని విద్యను బోధించి, 'విద్యను అర్థించేవారిని నిరాకరించడం ధర్మంకాదని, గురువుకు తరతమ భేదాలు ఉండవని' చాటి చెప్పాడు. – రామచంద్ర రామానుజ

## వివేకానంద సూక్తిశతి

**We want that education by which character is formed, strength of mind is increased, the intellect is expanded and by which one can stand on one's own feet.**

విద్యయన్న బతుకు విద్యతోపాటుగా
బుద్ధిపెంచవలయు వృద్ధికలుగు
శీలమిచ్చు విద్య శీఘ్రమ్ముగావలె
వినుడి స్వామి సద్వివేకవాణి!!





కథ

# మళ్లీ మైదానం

"నీకు మన శంకరం మాస్టారు గుర్తున్నారా?" చలమేశ్వర్ లోపలకు దూసుకుంటూ వచ్చాడు నవయువకుడి ఉత్సాహంతో. నాకు ఆశ్చర్యమేసింది. వీడిలో ఇంత చురుకుదనం ఈ మధ్య చూడలేదు.

మేమిద్దరం చిన్నప్పటి నుంచి కాలేజీ వరకు కలిసే ఉన్నాం. తరవాత నేను సంపాదనే పరమార్థంగా దూరదేశాలకు వెళ్లి, కావలసినంత సంపాదించుకుని ఈ మధ్యే పుట్టి పెరిగిన ఊరు చేరుకున్నాను. చలమేశ్వర్ ఉన్న ఊళ్లోనే ఉద్యోగాన్ని పూర్తి చేసుకున్నాడు కదుపులో చల్ల కదలకుండా.

ఒక్కసారిగా శంకరం మాస్టారు నా కళ్ల ముందు మెదిలారు. పంచె, షర్ట్, పైన కండువా... పిలక కూడా మామూలే! తెలుగు పండితుడు. మహా చాదస్తుడు. ఒక్క అక్షరం తప్పు రాసినా తాట తీసేవారు. ఈ రోజు మాతృభాష మీద మా అందరికీ ఈ గౌరవాభిమానాలు ఉండటానికి ఆయనే కారణం. భాషావ్యాప్తికి కృషి చేస్తున్న వాడిగా నాకు ప్రముఖ స్థానం లభించిందంటే మా గురువుగారి దయే !

"వారు గుర్తుండకపోవటమేంటీ? జీవితాను భవాల పుటల మొదట్లో దాక్కున్నారు. ఎలా ఉన్నారు?"

" నీకు గురువు గారి ఇల్లు తెలుసు కదా... రేపు అక్కడికి వచ్చెయ్యి. చూద్దూ గానివి ఎలా ఉన్నారో. వస్తా, ఇంకా మన స్నేహితులందరికీ చెప్పాలి, గురువు గారు చెప్పమన్నారు' హడావిడిగా వెళ్లి పోయాడు చలమేశ్వర్. అందరి చిరునామాలు, ఫోన్ నంబర్లు వాడి దగ్గరే ఉన్నాయి, మరి వాడు స్థానికుడు కదా! మా ఊరిలో శివాలయం, చెరువు, రఘురామ కళానిలయం తెలియని వారు ఎలా ఉండరో చలమేశ్వర్ తెలియని వారు కూడా అలాగే ఉండరు.


* * *

వాతావరణం ఆహ్లాదంగా ఉంది. మా ఇంటికి గురువు గారిల్లు దగ్గరే! అలా నడుచుకుంటూ శివాలయం దాకా వచ్చాను. ఒక్కసారి బాల్యస్మృతులు చుట్టుముట్టాయి. పున్నాగ పూలను ఏరుకుని సన్నాయి ఊదటాలు, పోటాపోటీగా పరుగులు తీస్తూ ఆంజనేయ స్వామి చుట్టూ పదకొండు ప్రదక్షిణలు చేయటాలు! వినాయకుడి ముందు తీసిన గుంజిళ్లు, వీరభద్రుడి ముందు ఆడిన వీరంగం! పూజారిగారు ఆశీర్వదిస్తూ ఇచ్చిన తీర్థ ప్రసాదాలు!! మంచి గంధం పరిమళాల్లా చుట్టేసిన జ్ఞాపకాలను ఆస్వాదిస్తూ స్వామి దర్శనం కోసం లోపలకు అడుగు పెట్టాను.

ఆశ్చర్యం! శివుడితో పాటు, జ్ఞానసంపన్నుడైన గురువు గారి దర్శనం కూడా అయ్యింది. తొంభయ్యో ఏటికి దగ్గర పడుతున్నా ఆయన ఒంట్లో దృఢత్వం తగ్గలేదు. కాళ్లకు వంగి నమస్కరించిన నన్ను లేపి గుండెలకు హత్తుకున్నారాయన వాత్సల్యంగా.

"ఏరా, బాగున్నావా?"

వెంటనే చనిపోయిన మానాన్న గుర్తొచ్చి కళ్లు నీళ్లతో నిండాయి నాకు. 'ఏరా' అని మా నాన్నే, నాన్నలాంటి మాష్టారి రూపంలో పలకరించినట్లు అనిపించింది. గొంతు మూసుకుపోయి మాటరాక, ఆయన చెయ్యి పట్టుకు నడిపిస్తూ తల ఊపాను బాగున్నానన్నట్లు. నా జీవితానికి చక్కని బాట చూపించిన ఆయనను చేయిపట్టుకు నడిపిస్తుంటే



'ఇదీ' అని చెప్పలేని భావంతో మనసు నిండి పోయింది.

గురువు గారి ఇల్లు ఐదు వందల గజాల్లో నాలుగు వైపులా ఖాళీ స్థలం వదిలి మధ్యలో ఉంది. ఆ ఇంట్లోకి ఆరేళ్ల పిల్లాడిగా పరిగెత్తుతూ వెళ్లిన స్మృతులు మదిలో ఇంకా తాజాగా ఉన్నాయి. ఇప్పుడు అరవై ఏళ్ల వాడిగా వెళ్తున్నాను.

గేటు తీసి లోపలకి వెళ్లి తాళం తీస్తున్న గురువు గారిని ఆశ్చర్యంగా చూసాను. నా మొహంలో ప్రశ్నను గమనించి,

"ఆవిడ వెళ్లిపోయిందిరా! పదేళ్లయింది. పిల్లల కాపురాలు వాళ్లవి. ఇద్దరబ్బాయిలూ విదేశాలకి, సరే, ఆడపిల్ల అత్తారింటికి. ఈ ఇంట్లో ఇప్పుడు నేనే." వాకిట్లో ఆయన కూర్చునే పడక కుర్చీ అలాగే ఉంది.



సరస్వతి కరవది

లోపలకు వెళ్తే చెక్క కుర్చీలూ అవే!"

"ఏమీ మారలేదు మాస్టారూ"అన్నా.

"నేను మారాను కనకనా? కానీ ప్రపంచమంతా మారిపోయిందిరా. మన ఊరు కూడా! ఈ వాడ కూడానూ. మారనిది ఇదిగో నేనూ, మన ఇల్లే." ఆయన మాటల్లో ధ్వనించిన భావం మనసుని కుదిపింది. పడకకుర్చీలో వాలారు మాస్టారు గారు. వారి పాదాల దగ్గర కూర్చున్నాను నేను. "ఎందుకో మీ మాటలలో ఏదో దుఃఖం వినబడుతోంది మాస్టారు."

నా చేయి గట్టిగా పట్టుకుని కళ్లు మూసుకున్నారు ఆయన. ఆయన చేయి వృద్ధాప్యంతో ముడతలు పడి, వడలి ఉంది.

"కృష్ణా! అపకారికి ఉపకారము కాదురా, ఉపకారికి, ఉపకారం చేసేవాళ్ళు కూడా కనపడట్లే దురా! నీ గురించి విన్నానురా. పెద్ద చదువులు చదివి, పెద్ద ఉద్యోగాలు చేసి, బాగా సంపాయించుకున్నావుట కదా! పిల్లలు కూడా స్థిరపడ్డారుట కదా!" అవునన్నట్లు తల ఊపాను నేను. వాత్సల్యంగా నా తల నిమిరారు మాస్టారు.

"చాలా సంతోషంరా. మీ బ్యాచ్ వాళ్లు అందరూ చక్కగా రాణించారు. ఇక ఇప్పుడు ఏం చేద్దామను కుంటున్నావు?"

నవ్వేసాను నేను.

"ఇంకా ఏముంది చెయ్యటానికి? నాది సంతృప్తికరమైన జీవితం. ఏలోటూ లేదు. ఈ స్థితికి రావటానికి ఎంతో కష్టపడ్డాను. తరతరాలకు సరిపడా సంపాదించాను. ఇక విశ్రాంతి తీసుకోవటమే." గురువు గారి పెదాలమీద తాత్వికమైన నవ్వు కదలాడింది.

"సాధించేశానంటావ్! ఇక సాధించాల్సింది ఏమీ లేదంటావ్"

నా వెనకాల అయిన అలికిడికి తల తిప్పి చూసాను. ఒక పదిహేను మంది దాకా ... నా బాల్య మిత్రులు. అందరి మొహాల్లో ఆనందోద్వేగాలు. వాళ్లందరినీ చూసిన గురువుగారి మొహం పున్నమినాటి సంద్రమే అయ్యింది. "వచ్చార్రా? ఒరే చలమాయ్! నువ్వు, వీడు వెళ్లి చాపలు తేండిరా లోపల్నించి." ఇద్దరం చిన్నప్పటిలానే లోపలకు పరిగెత్తి చాపలు తెచ్చాము. వయసును మరచిపోయి గోలగోల చేస్తూ ఒకరినొకరం పలకరించుకుంటూ, పెరిగిన పొట్టలు, వంగని మోకాళ్లతో నానా అవస్థలు పడుతూ ఆ చాపల మీద కూర్చుంటుంటే, పాఠం కోసం ఆనాడు మాష్టారి ముందు కూర్చుని పాట్లు పడ్డ రోజులు గుర్తొచ్చాయి. తప్పు చేసి ఆయన చేత దెబ్బలు తినని వారెవ్వరు మాలో? చదువుతో పాటు జీవిత పాఠాలు కూడా నేర్పిన గొప్ప గురువాయన.

అందరం కూర్చున్నాక నవ్వుతూ మా వైపుచూసి అన్నారు మాస్టారు.

"ఎలా ఉన్నార్రా? ఒకే ఊళ్లో ఉన్నా మిమ్మల్ని చూసి చాలా రోజులైంది. ఇవాళ మీకో కొత్తపాఠం చెప్పాలనిపించి అందరినీ రమ్మన్నాన్రా. ముందుగా మీ జీవితానుభవాలను తెలుసుకోవాలనుంది. మీ అనుభవాలు చెప్పండి. ఏం చేస్తున్నారు? జీవితం ఎలా ఉంది? అందరి ఉద్యోగాలూ పూర్తి అయ్యాయి కదా?"

అందరూ ఇంచుమించు నాలాగానే జవాబులు ఇచ్చారు. ఇన్నాళ్లు కష్టపడ్డాం, ఇప్పుడు ఉద్యోగ బాధ్యతలు తీరాయి కనుక విశ్రాంతి తీసుకుంటున్నాం అని.

మా అందరినీ కలయచూసి చిరునవ్వుతో అన్నారు.

"ఏరా, మీ అందరినీ నేను అడిగాను కదా ఏం చేస్తున్నారని. నన్ను మీరడగరా?"

"మీరు ఇంకా ఏమి చేస్తారు గురువుగారు? ఆ అవసరమేముంది? పిల్లలందరి బాధ్యతలు తీరిపోయాయి. మీ గుప్పెడు పొట్టకి ఆ వచ్చే పెన్షన్ డబ్బులు చాలవా?"

"నిక్షేపంలా సరిపోతాయి. నా తిండికీ, పిండికీ ఎంత కావాలిరా?"ఉల్లాసంగా అన్నారు గురువుగారు. "నాకు వచ్చిన పింఛన్‌లో పావువంతు నాకు సరిపోతుంది. అయినా ఏమన్నా చెయ్యటం అంటే డబ్బు సంపాదించటమా? అదే నా ప్రశ్న అయితే ఇప్పుడు ఎంత సంపాదిస్తున్నార్రా అని అడిగేవాణ్ణిగా!"

విజయసారథి పైకే నవ్వాడు. "గురువుగారూ! మీ ఆశీర్వాదం వలన మాకే కాదు..మా తరవాత మూడు తరాలవరకు కూడా మేము సంపాదించింది సరిపోతుంది. ఇంకా సంపాదించాలా?" కొద్దిపాటి గర్వం వినిపించింది వాడి గొంతులో. వందల కోట్లకు పడగెత్తిన వాడికి ఆ మాత్రం గర్వం ఉండటంలో ఆశ్చర్యమేముంది?

"మాష్టారూ, నాకు సొంత ఇల్లుంది. వందెకరాల సుక్షేత్రమైన మాగాణీ పొలం ఉంది గోదావరి జిల్లాలో. నా పిల్లల్లో ఒకడు అమెరికాలో ఉంటే ఇంకొకడు తన కొడుకు చదువుకోసం ఇక్కడే ఉన్నాడు. ఐదేళ్ల క్రితం నేనూ వ్యవసాయం కౌలుకిచ్చి, వీడు గొడవపెడుతున్నాడని ఇక్కడికి వచ్చేసాను మా ఆవిడతో కలిసి." శేషాచలం అన్నాడు.

"ఏమని గొడవ పెట్టాడేంటీ?"

"నువ్వు కష్టపడ్డది చాలు. ఇంక నా దగ్గరకొచ్చి హాయిగా విశ్రాంతి తీసుకో. ఇక్కడ నీ కోడలు కమ్మగా వండిపెడుతుంది. టీవిలో నచ్చిన సినిమాలు, ప్రోగ్రాంలు చూసుకుంటూ కాలక్షేపం చెయ్యి అని."

"మరి హాయిగా ఉన్నావా?"

"ఎక్కడ గురువుగారూ? వ్యవసాయం చేసేప్పుడు నిజంగానే నేనూ, ఆవిడ ఎంత కష్టపడ్డామో. వీడి దగ్గరకొచ్చాము... గట్టిగా ఏడాది కూడా సుఖపడ లేదు. మా ఆవిడకి కదిలితే, మెదిలితే ఒళ్లునొప్పులు. నాకు చక్కర వ్యాధి ఇక సుఖపడేదేముందీ?నెలకి నేను పెట్టె ఖర్చులో ఎక్కువ శాతం మందుల మీదే!"

గలగలా నవ్వారు గురువుగారు. "సరిపోయింది. ఒరే గోవిందూ నీ మాటేంటీ ?"

తరగతి గదిలో అడిగినప్పుడు లేచి నిలిచినట్లే నిలబడ్డాడు గోవిందు.

"గురువుగారూ, మా ఆవిడ రెండేళ్ల క్రితం

దాటిపోయిందండీ. అవిడున్నంత వరకు రాజ భోగంగా జరిగిన నా బ్రతుకు, ఇప్పుడు దిక్కులేనిదయ్యింది. ఏం చెప్పమంటారు? ఇద్దరం కలిసి గుడికి వెళ్లేవాళ్లం. చుట్టాల ఇళ్లకు ప్రతి వేడుకకు వెళ్లేవాళ్లం. అందరూ గౌరీశంకరులనేవారు. ఇప్పుడు నేను ఒంటరినై పోయానండీ" గాద్గదికమైంది వాడి గొంతు.

"అయ్యో, ఏంటిరా అలా బాధపడతావు? నీభార్య లేని లోటు తీరేది కాదనుకో. పోనీ నీ కొడుకుల దగ్గరకి వెళ్లాల్సింది"

"ఎక్కడ గురువుగారూ, కోడల్లిద్దరికీ ఉద్యోగాలు. ఏదో అతిథిగా వెళ్తే నాలుగు రోజులు చూసుకుంటారే గానీ, నేను వాళ్ల దగ్గర శాశ్వతంగా ఉంటే ఇబ్బందని మాటల్లో, చేతల్లో తెలియజేస్తుంటారు. ఒంటరితనాన్ని భరించలేకపోతున్నాను. వంట చేసుకోవటం రాక ఏ స్విగ్గీ లోనో ఆర్డర్ పెట్టుకోవటం, నచ్చితే తినటం లేకపోతే పడెయ్యటం. ఇంట్లోంచి కదలట్లేదు. ఎక్కడికీ వెళ్లట్లేదు. వీటికి తోడు కొంచెం నడిచినా ఆయాసం. కూర్చుంటే లేవలేను. మందుల మీదే బ్రతుకుతున్నానండీ."

అందరం వాడివంక జాలిగా చూసాం. "నా ఆలోచన చెప్పమంటారా? మీరందరు జీవితంలో ఎంతో సాధించేశామని తృప్తిపడి ఊరుకుంటున్నారు. ఏంటి మీరు సాధించింది? ఆలుబిడ్డలకి అన్నం పెట్టటం ఊరికి ఉపకారమా? ఊరికి ఏమి చేశారురా మీరు? చెట్లు మనకి నీడనిస్తాయి, పూలు పండ్లు ఇస్తాయి, కట్టెలనిస్తాయి, ఇంకా ఎన్నో చేస్తాయి. గాలి కేవలం ఆకాశంలోనే వీస్తుందా? వెన్నెల కేవలం చంద్రుని కోసమే కాస్తుందా? పువ్వులు తమ పరిమళాలను చెట్టుకే వెదజల్లుతాయా? సెలయేరు తన నీరు మనందరికీ ఇవ్వట్లేదా? భూమికీ ఆకాశానికి మధ్యనున్న ప్రకృతి ఇంత నిస్వార్థంగా అందరికీ మేలు చేస్తుంటే మనం వివేచనాశక్తి ఉన్న మనుషులుగా ఇంకెంత చెయ్యాలి? ప్రకృతి నుండి ఏం నేర్చుకుంటున్నాం?" మాస్టారి గొంతులో ఆవేదన, ఆవేశం కలిసి ధ్వనించాయి.

"మీ అందరూ ఉద్యోగాల నుంచి పదవీ విరమణ చేశారు. డబ్బులకు కొదవలేదు. ఇప్పటివరకు ఎంతో ఉత్సాహంగా పనిచేసి ఒక్కసారిగా నిర్వ్యాపారంగా తయారవటంతో మీ ఆరోగ్యాలూ దెబ్బతింటున్నాయి. ఇంత వయసొచ్చింది. కళ్లు మూసుకుంటే ఏదోనాడు అవి శాశ్వతంగా మూతపడతాయని మీ అందరికీ తెలుసు. కానీ ఈ వయసులో కూడా మనకింత ఇచ్చిన దేశానికి, సమాజానికీ మనం ఏం చేస్తున్నాం అనే ఆలోచన మీలో రాకపోవటం సిగ్గుచేటు! నేను అలా కళ్లు మూసుకుని పడుకోలేనే...? సాటివారి సమస్యలను చూస్తే మనసు ఊరుకోదు. స్పందిస్తుంది. పరిష్కారాన్ని చూడమని వెంటపడుతుంది. తొంభయ్యో పడిలో పడిన నేనే ఇలా ఉంటే, నాకంటే ఇంచుమించు మూడు దశాబ్దాలు చిన్న అయిన మీరెలా ఉండాలి?"

మా అందరి మనసులనూ గురువుగారి మాటలు తట్టి లేపుతున్నాయి.

"మొన్న ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యున్ని కలవటానికి వెళ్లాను నాకూడా మన చలమేశ్వర్‌ని రమ్మన్నాను. అక్కడ ఎంతమంది నిరక్షరాస్యులు ఎన్ని తిప్పలు పడుతున్నారో! వైద్య సలహా కోసం పడిగాపులు పడుతున్నారు. అక్కడి పద్ధతులు తెలీక ఎంతమందిని అడుగుతున్నారో! అంతకు ముందు రోజు మునిసిపల్ ఆఫీస్‌లో మన పక్కింటి హనుమాయమ్మగారికి ఏదో పని ఉంటే సాయం వెళ్లాను. అక్కడా అంతే! ఇలా చాలా చోట్ల ... ఎంతో మంది! అందరికీ మరొకరి అవసరం ఉంది.

అటువంటి వాళ్లను చూసి నా మనసు ద్రవించి పోయిందిరా. వాళ్లకి సహాయం కావాలి. కానీ అది నా ఒక్కడి వల్ల కాదు. సమూహం కావాలి. సంఘటిత శక్తీ కావాలి. చలమేశ్వర్ ఇంచుమించు ప్రతిరోజూ నా దగ్గరకు వస్తుంటాడు. వాడి ద్వారా మీ విషయాలు తెలుస్తూ ఉంటాయి. అందుకే మీతో కలిసి ముందు కెళదామని కబురు చేసాను. మీ బ్యాచ్ నాకెంతో ఇష్టమైనది. ఎందుకంటే మీరందరూ రత్నాల్రా. విజయవంతమైన వ్యాపారస్తులు, రైతులు, పండితులు, వైద్యులు, వకీళ్లు, సంగీత కళాకారులు, ఉపాధ్యాయులు... మీలో లేనిదెవరు? మీరు ఏళ్ల తరబడి సాధించిన నైపుణ్యాలన్నీ రిటైరైపోయి ఇంట్లో కూర్చుంటే ఏమైపోతాయిరా? మీ పడకకుర్చీలు అలసిపోవూ?"

అందరం మనస్ఫూర్తిగా నవ్వాము.

మాస్టారు నా వైపు తిరిగారు. "కృష్ణా, మన పాఠశాలలో విద్యార్థులకి నువ్వు నాయకుడివి గుర్తుందా? నీ నాయకత్వంలో మీ మిత్రులంతా కలిసి ఎన్నో మంచి పనులు చేశారు. ఆ వయసులోనే ఎన్నో అద్భుతాలను సాధించారు. అందుకే నీ సహాయాన్ని అర్థిస్తున్నానురా. మీరంతా రెండోసారి మైదానంలోకి దిగాల్రా. రెండో ఆట ఆడాలి"

నా మనసుకి అర్థమౌతోందిగురువుగారు చెప్పేది.

"పదవీ విరమణ అవగానే ఏదో సాధించేసినట్లు పడకకుర్చీని ఆశ్రయించటం ఏమిటి? అందరూ కలిసి ప్రణాళికాబద్ధంగా నలుగురికీ ఉపయోగపడేలా ఏమన్నా చేయండి. సాటి మనిషి కోసం, సమాజం కోసం. మానసిక, శారీరక ఆరోగ్యం కలుగుతుందీ, ఊరి సమస్యలూ తీరతాయి. ఊరికే కూర్చుని కునికిపాట్లు పడేబదులు, ఆ సమయాన్ని మన చుట్టూ ఉన్న వాళ్ల కోసం కేటాయిద్దాం. సమాజ సేవరా! ఇన్నాళ్లు కుటుంబం కోసం రెక్కలు ముక్కలు చేసుకోలేదా? ఇప్పుడు మన సమాజం కోసం, మన ఊరికోసం ఎవరి చేతనయ్యిందివారు చేద్దాం. మన బ్రతుకులకు విలువుంటుంది, మనకూ తృప్తి ఉంటుంది. ఏమంటారు? కృష్ణ నాయకత్వం మీకు సమ్మతమేనా? "

నా మిత్రులందరూ కరతాళధ్వనులతో తమ హర్షాన్ని వెలిబుచ్చారు.

"చెట్లు నాటండి. మురికివాడల్లో పరిశుభ్రత పెంచండి. బడులు, గుడులు బాగు చెయ్యండి. పదిమందికీ ఉపయోగపడే పనులు చేయండి, చేయించండి. డబ్బున్న వాళ్లు అవసరంలో ఉన్న పేదవాళ్లకు సహాయం చేయండి. డబ్బివ్వలేనివాళ్లు నిస్సహాయులకు మీ సమయాన్ని వెచ్చించి సాయం చెయ్యటం ఎలాగో ఆలోచించండి. మీ నైపుణ్యాలను అవసరమైనవారికి అందుబాటులోకి తీసుకురండి." గురువుగారు చెప్పున్నారు. అందరం ఇలాంటి ఆలోచన మాకెందుకు రాలేదా అని మనసుల్లో శోధించు కుంటున్నాం.

"సొంత లాభం కొంత మానుకుపరుల మేల్ తలపెట్టవోయ్! అన్నాడు కదా గురజాడ. ఆచరిద్దాం మనం. మనతో పాటు ఊరిలో వారినీ కదిలించామంటే ఊరు మొత్తం బాగుపడుతుంది. జననీ, జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి అన్నారు కదా! ఏమంటారు? మీకూడా నేనున్నాను. మరోసారి గోదాలోకి దిగి మీరేంటో నిరూపించుకోండి. జయోస్తు!"

తొంభయ్యేళ్ల ఆ యువకుడి నిర్దేశకత్వంలో అరవయ్యేళ్లు పైబడిన బాల బాలికలందరం ముందుకి కదిలాం,

జీవిత మైదానంలో కొత్త ఆటలు ఆడి గెలవటానికి. ★



"చెట్లు నాటండి. మురికివాడల్లో పరిశుభ్రత పెంచండి. బడులు, గుడులు బాగు చెయ్యండి. పదిమందికీ ఉపయోగ పడే పనులు చేయండి, చేయించండి. డబ్బున్న వాళ్లు అవసరంలో ఉన్న పేదవాళ్లకు సహాయం చేయండి. డబ్బివ్వ లేనివాళ్లు నిస్సహాయులకు మీ సమయాన్ని వెచ్చించి సాయం చెయ్యటం ఎలాగో ఆలోచించండి. మీ నైపుణ్యాలను అవసర మైనవారికి అందుబాటులోకి తీసుకురండి." గురువుగారు చెప్పున్నారు. అందరం ఇలాంటి ఆలోచన మాకెందుకు రాలేదా అని మనసుల్లో శోధించు కుంటున్నాం.




# జమిలికి జై!

**జమిలి ఎన్నికలకు మార్గం సుగమం అయింది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆధ్వర్యంలోని ఉన్నత స్థాయి కమిటీ అందించిన సిఫార్సులను కేంద్ర కేబినెట్ ఆమోదించింది. డిసెంబరు 4న ప్రారంభమయ్యే శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. దానితో పాటు దాదాపు కొన్ని రాజ్యాంగ సవరణలు, ప్రజాప్రాతినిధ్య చట్టంలో మార్పులు చేయవలసి ఉంటుంది. ఈ ప్రక్రియ అంతా పూర్తికావటానికి సుదీర్ఘ సమయం పడుతుంది. 2029 నాటికి గాని జమిలి ఎన్నికలు (లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకసారి, ఆ తర్వాత 100 రోజుల వ్యవధిలో స్థానిక సంస్థల ఎన్నికలు) కార్యరూపం దాల్చే అవకాశం లేదు.**

జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తాయని, ప్రజల భాగస్వామ్యానికి, వాళ్లు మరింత చైతన్యవంతం కావటానికి ఇదో ముందడుగు అని ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. మాజీ రాష్ట్రపతి కోవింద్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సులను కేంద్ర కేబినెట్ ఆమోదించిన సందర్భంగా ఆయన స్పందించారు. ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీన ఎర్రకోట నుంచి చేసిన ప్రసంగంలో ఒకే దేశం ఒకే ఎన్నిక ప్రాధాన్యతను మోదీ వివరించారు. తరచూ ఎన్నికలు నిర్వహిస్తూ ఉండటం వల్ల దేశ అభివృద్ధికి విఘాతం ఏర్పడుతోందని చెప్పటమే కాదు. దేశంలోని రాజకీయ పక్షాలతో పాటు, భాగస్వామ్యపక్షాలన్నీ ఈ ప్రక్రియను ముందుకు తీసికెళ్లటానికి చొరవ తీసుకోవాలని కోరారు. ఒకే దేశం-ఒకే ఎన్నికకు దేశవ్యాప్తంగా ఏకగ్రీవ మద్దతు లభించిందని కోవింద్ స్వయంగా పేర్కొన్నారు. దీనివల్ల సమయం, డబ్బు ఆదా అవుతాయని బీజేపీ హర్షం ప్రకటిస్తే, కాంగ్రెస్ నాయకత్వంలోని దాదాపు రెండు డజన్‌ల రాజకీయ పార్టీలు అది ఆచరణ సాధ్యం కాదని, అనవసరమని వాదిస్తున్నాయి.

అసలు జమిలి ఎన్నికలు ఈ దేశానికి కొత్త కాదు. 1957లో-బిహార్, బాంబే, మద్రాస్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్- మొత్తం ఏడు రాష్ట్రాల ఎన్నికలను ఒకేసారి నిర్వహించారు. 1967లో నిర్వహించిన 4వ సార్వత్రిక ఎన్నికల వరకూ ఏకకాలంలో ఎన్నికల నిర్వహణ అనేది అమలులో ఉంది. ఆ తర్వాత కేంద్రంలో ప్రభుత్వం రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వాలను తమ పదవీకాలం పూర్తి కాకుండానే రద్దు చేయటం ప్రారంభించాయి. దానికి తోడు సంకీర్ణ ప్రభుత్వాల శకం ప్రారంభమైంది. కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ ఏర్పాటయిన సంకీర్ణ ప్రభుత్వాలు అర్థాంతరంగా కుప్పకూలటంవల్ల వేర్వేరు సమయాల్లో ఎన్నికలు నిర్వహించటం అనివార్యంగా మారింది. 1968, 1969లలో కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ముందుగా రద్దయ్యాయి. 1970లో ఏకంగా లోక్‌సభే రద్దయ్యింది. దానివల్ల ఒకే సారి ఎన్నికలు నిర్వహించే వలయం దెబ్బతింది.

**ఈ ఆలోచనకు ఎలా బీజం పడింది?**

2017లో రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేసిన ప్రసంగంలో తొలిసారిగా జమిలి ఎన్నికల అంశం ప్రస్తావనకు వచ్చింది. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తరపున చేసిన ప్రసంగంలో, ఎన్నికల సంస్కరణపైన నిర్మాణాత్మకమైన చర్చ చేయవలసిందిగా సూచించారు. స్వాతంత్ర్యం తొలిరోజుల్లో అనుసరించిన మాదిరిగా లోక్‌సభ, ఆయా రాష్ట్రాల అసెంబ్లీలు ఒకేసారి ఎన్నికలకు వెళ్లే విధానాన్ని అనుసరించాలని ప్రతిపాదించారు. అన్ని రాజకీయ పార్టీలతో సంప్రదించి ఎన్నికల కమిషన్ కార్యాచరణను ముందుకు తీసికెళ్లాలని సూచించారు.

దాంతో కేంద్ర ప్రభుత్వం సెప్టెంబరు 2, 2023న మాజీ రాష్ట్రపతి కోవింద్ ఛైర్మన్‌గా, మరో ఎనిమిది మంది సభ్యులతో ఉన్నత స్థాయి కమిటీని నియమించింది. రాజకీయ ప్రముఖులు అమిత్ షా, అర్జున్ రామ్ మేఘవాల్, మాజీ సెక్రటరీ జనరల్ ఆఫ్ లోక్ సభ డాక్టర్ సుభాష్ సి కాశ్యప్, 15వ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ ఎన్.కె. సింగ్, సుప్రీంకోర్టు సీనియర్ అడ్వొకేట్ హరీష్ సాల్వే, మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషనర్ సంజయ్ కొఠారి ప్రభృతులు ఇందులో ఉన్నారు. కాంగ్రెస్ నాయకుడు అధీర్ రంజన్ చౌదరి సభ్యునిగా ఉండటానికి తిరస్కరించారు. ఇదంతా కంటితుడుపు చర్యగా అని ఆయన పేర్కొన్నారు.

ఈ ఏడాది మార్చి 14వ తేదీన కోవింద్ కమిటీ 18వేల పేజీలతో తన నివేదికను రాష్ట్రపతి ముర్ముకు అందించింది. జమిలి ఎన్నికలలో భాగంగా రెండు దశల ఎన్నికలకు కమిటీ సిఫార్సు చేసింది. లోక్‌సభకు, అన్ని రాష్ట్రాల లెజిస్లేటివ్ అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని, అనంతరం 100 రోజులలోగా పంచాయతీ, మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికలు నిర్వహించాలని ప్రతిపాదించింది. అన్ని ఎన్నికలకు ఒకే ఓటర్ల జాబితా ఉపయోగించాలి. దేశవ్యాప్తంగా ఈ అంశంపైన లోతుగా చర్చించాలి. అలాగే ఆచరణలోకి తేవటానికి ఒక కమిటీని కూడా నియమించాలని సూచించింది.

ఒకే దఫా ఎన్నికలు నిర్వహించటం అనేది ఎన్నికల ప్రక్రియను సమూలంగా మార్చి వేస్తుందని కమిటీ అభిప్రాయపడింది. 32 రాజకీయ పార్టీలు, సమాజంలో ఉన్నతోద్యోగాల్లోఉన్నవారు, పదవీ విరమణ చేసిన వాళ్లు, న్యాయకోవిదులు ఈ ప్రతిపాదనను స్వాగతించారని, దాదాపు 21వేల మంది తమ అభిప్రాయాలను ప్రకటిస్తే సలహాలు ఇచ్చిన వారిలో 80 శాతం మంది దీనికి సుముఖంగా ఉన్నారని ప్రకటించారు.

**జమిలి ఎన్నికలు ఎందుకు?**

జమిలి ఎన్నికలను సమర్థిస్తున్నవారి వాదనలు చూస్తే.. తరచూ ఎన్నికలు నిర్వహించటం వల్ల ప్రభుత్వ ఖజానాపైన భారం పడుతోంది. దానికితోడు రాజకీయ పార్టీల ఖర్చులను కూడా కలిపితే ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. దేశవ్యాప్తంగా ఏడాదిలో కనీసం ఐదుసార్లు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను కూడా చేరిస్తే వాటి సంఖ్య పెరుగుతుంది.

- అకాల ఎన్నికలు అస్థిరతకు, అనిశ్చితికి కారణమవుతాయి. సప్లై చెయిన్స్ పైన, ఆర్థికాభివృద్ధి పైన, వ్యాపార పెట్టుబడులపైన ప్రభావం

చూపుతోంది.

- ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వయంత్రాంగాన్ని తరచూ అటూ ఇటూ మార్చటం వల్ల పౌరులకు ఇబ్బంది కలుగుతోంది.
- ప్రభుత్వ అధికారులను, సెక్యూరిటీ సిబ్బందిని తరచూ ఎన్నికల్లో వినియోగించటం వల్ల వాళ్ల విధులపైన ప్రభావం పడుతోంది.
- ఎన్నికల వల్ల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్) అమలులోకి రావటం వల్ల 45 నుంచి 60 రోజుల పాటు విధాన నిర్ణయాలు తీసుకోవటం ఆగిపోతోంది. దానికి తోడు అభివృద్ధి కార్యక్రమాల వేగం మందగిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ ప్రకటనలూ చేయలేని పరిస్థితి ఎదురవుతోంది.
- ఎన్నికల పట్ల ఓటర్లలో నిరాసక్తత పెరిగి వారి భాగస్వామ్యానికి సవాలు ఎదురవుతోంది.

**ప్రతిపక్షాల అభిప్రాయం**

ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని రాజ్యాంగంలో ఎక్కడా లేదని కొందరు వాదిస్తున్నారు. ఎన్నికయిన రాష్ట్రప్రభుత్వాలను రద్దు చేయటానికి రాజ్యాంగపరంగా రాష్ట్రపతికి సంక్రమించే అత్యవసర అధికారాల గురించి చర్చించినప్పుడు కూడా రాజ్యాంగ సభ జమిలి ఎన్నికల ప్రస్తావన చేయలేదు. దీన్ని బట్టి ఒకేసారి ఎన్నికలు నిర్వహించటం అనేది సహేతుకమైన, వివేకవంతమైన, ప్రజాస్వామ్య నిర్మాణానికి అనుకూలమైన నిర్ణయం కాదు అని అభిప్రాయపడుతున్నారు. రాజ్యాంగం ప్రధాన లక్ష్యమైన సమాఖ్య వ్యవస్థను దెబ్బతీస్తుందని చెప్పారు.

జమిలి ఎన్నికల నిర్వహణకు నియమించిన కమిటీలో భారతదేశం భిన్నత్వం ప్రతిబింబించలేదని, కమిటీ ప్రజా బాహుళ్యంలో అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదని విమర్శిస్తున్నారు. ఏ ఒక్క ముఖ్యమంత్రిని, ప్రాంతీయ పార్టీనేతను కమిటీలో తీసుకోకపోవటాన్ని తప్పు పడుతున్నారు. కోవింద్ ప్యానల్ సిఫార్సులను కేబినెట్ఆమోదించగానే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే స్పందించారు. "హర్యానా ఎన్నికలకు ముందు ప్రజల దృష్టిని మళ్లించేందుకు చేసే ప్రయత్నం'' అని వ్యాఖ్యానించారు. ఇండీ బ్లాక్ సభ్యులు బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ స్పందించారు. ఇది రాజ్యాంగ నిర్మాణాన్ని దెబ్బతీయటమే అని మమత అంటే, ఆచరణ సాధ్యం కాని ఆలోచన అని స్టాలిన్ అంటారు. ఆప్, సమాజ్ వాదీ పార్టీలు ఈ ప్రతిపాదనను తిరస్కరించాయి. జమ్ము కశ్మీర్‌లోని నేషనల్ కాన్ఫరెన్స్,పీపుల్స్ డెమాక్రటిక్ పార్టీలు సానుకూలంగా ఉన్నాయి.

**సవాళ్లు, అవరోధాలు**

జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే మొత్తం 6 రాజ్యాంగ సవరణలు చేపట్టవలసి ఉంటుంది. ఈ సవరణలు చేపట్టటం అనేది ప్రభుత్వానికి సవాలుగా నిలుస్తుంది. రాజ్యాంగ సవరణలను పార్లమెంటు 2/3 మెజార్టీతో ఆమోదించాలి. లోక్ సభలో బీజేపీ ఆ మార్కు దాటాలంటే సొంత బలగంతో పాటు అదనంగా ఎంపీల మద్దతు కూడగట్టవలసి ఉంటుంది. రాజ్యసభలో మరింత కష్టపడాలి.

లోక్‌సభలో ప్రస్తుతం ఎన్డీయే బలం 293, జమిలి ఆమోదానికి అవసరమైనది 362 మంది. రాజ్యసభలో ఎన్డీయేబలం 121, జమిలి ఆమోదానికి అవసరమైనది 164. మనది పార్లమెంటరీ ప్రజాస్వామ్యమే కాకుండా సమాఖ్య వ్యవస్థ కూడా. అంటే రాష్ట్ర ప్రభుత్వాల మాటకు విలువ ఉంటుంది. వాటిని ఒప్పించాలి. అందుకు పార్లమెంటుతో పాటు దేశంలోని సగం రాష్ట్రాల అసెంబ్లీలు సరేననాలి. అంటే 14 రాష్ట్రాలకు పైగా జమిలిని అంగీకరించాలి. ప్రస్తుతం బీజేపీ (దాని మిత్రులు) 19 రాష్ట్రాలతోపాటు ఒక కేంద్రపాలిత ప్రాంతంలో అధికారంలో ఉంది. దాని వల్ల రాష్ట్రాల ఆమోదం పొందటం పెద్ద సమస్య కాకపోవచ్చు. ఇక చేపట్టవలసిన రాజ్యాంగ సవరణలేమిటో ఇప్పుడు చూద్దాం.

**1. ప్రజాప్రాతినిధ్య చట్టం**

హౌస్ తన ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్నా లేదా రద్దయినా ఆరు నెలల వ్యవధిలో తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహించాలని ఈ చట్టం చెబుతోంది. అసెంబ్లీకి ఐదేళ్ల పదవీ కాలం, ఎన్నికల నిర్వహణకు తేదీలు ఖరారు అన్న అంశాల్లో మార్పులు చేయవలసి వస్తుంది. ఇలా మార్పు చేయటం రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీయటమని ఒకే దఫా ఎన్నికలను వ్యతిరేకిస్తున్న పార్టీలు చెబుతున్నాయి.

రాజ్యాంగంలోని 368వ అధికరణం గురించి ప్రస్తావిస్తున్నాయి. రాజ్యాంగ సవరణకు అనుసరించవలసిన విధివిధానాలను అది చెబుతుంది. దాంతో పాటు రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణాన్ని మార్చే శక్తి పార్లమెంటుకు లేదని చెబుతుంది. ఇకపోతే ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని 141, 152 సెక్షన్లు సార్వత్రిక ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌కు సంబంధించిన అంశాలను చర్చిస్తాయి. అలాగే 147, 151ఏ సెక్షన్లు ఉపఎన్నికల అంశాలను చర్చిస్తాయి.

**2. రాజ్యాంగ అధికరణ 83(2), అధికరణ 172(1)**

ఆర్టికల్ 83 (లోక్‌సభ, రాజ్యసభల కాలపరిమితికి సంబంధించినది), ఆర్టికల్ 172 (1) (రాష్ట్రాల అసెంబ్లీకు ఐదేళ్ల గడవుకు నిర్దేశించేది, ఆర్టికల్ 83 (2), 172(1) లోక్‌సభ, అసెంబ్లీల కాలపరిమితికి సంబంధించినవి. దీని ప్రకారం తాము మొదటిసారి సమావేశం అయిన నాటి నుంచి ఐదేళ్ల పాటు కొనసాగుతాయి. (మధ్యలో రద్దు కాపోతే). ఇంతకు ముందే అవి రద్దు కావచ్చు. ఏ రాజకీయ పార్టీకి తగినంత మెజార్టీ లేనప్పుడు, అవిశ్వాస తీర్మానంలో తమ మెజార్టీని నిరూపించుకోలేనప్పుడు, పార్టీ ఫిరాయింపులు చోటుచేసుకున్నప్పుడు లేదా అలాంటి అనుకోని పరిణామాలు ఉత్పన్నమై హంగ్ అసెంబ్లీ ఏర్పడినప్పుడు ఇలాంటి పరిస్థితి ఉత్పన్నం అవుతుంది.

ఏకకాల ఎన్నికలు నిర్వహించటానికి ఐదేళ్లకు ముందుగా ఆయా అసెంబ్లీలను రద్దు చేయవలసి ఉంటుంది. అవి పూర్తి కాలం పనిచేయవు. లేదా ముందు ప్రభుత్వం ఐదేళ్లలో కొంత కాలం పనిచేసి ఉంటే మిగిలిన కాలపరిమితి వరకే అవి అధికారంలో ఉంటాయి. అందుకు రాజ్యాంగంలో ఈ అధికరణలను సవరించాలి.



ఆర్టికల్83 (పార్లమెంట్ హౌసెస్ కాలపరిమితి), ఆర్టికల్ 172(రాష్ట్ర అసెంబ్లీల కాలపరిమితి)లను సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని ప్యానల్ ప్రతిపాదించింది. దీనికి రాష్ట్రాల ధృవీకరణతో పనిలేదు.

**3. కేంద్రపాలిత ప్రాంతాలకు నిబంధనలు**

జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే కేంద్రపాలిత ప్రాంతాల్లో అమలులో ఉన్న చట్టాలకు కూడా సవరణలు చేయాలి. నేషనల్ కేపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ యాక్ట్, 1991లోని సెక్షన్ 5 (అసెంబ్లీల కాలపరిమితి), గవర్నమెంట్ ఆఫ్ యూనియన్ టెరిటరీస్ యాక్ట్, 1963 లోని సెక్షన్ 5 (అసెంబ్లీల కాలపరిమితి)ను సవరించవలసి ఉంటుంది. అలాగే జమ్ము కశ్మీర్ రీ ఆర్గనైజేషన్ యాక్ట్, 2019లో సెక్షన్ 17 (అసెంబ్లీల కాలపరిమితి)ని కూడా సవరించవలసి ఉంటుంది.

#### 4. ఆర్టికల్ 356, ఆర్టికల్ 85, ఆర్టికల్ 174

రాజ్యాంగ నిబంధనలో ఆర్టికల్ 356 అనుసరించి రాష్ట్రంలో ఎన్నికలయి ప్రజా ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించే అధికారం కేంద్రానికి ఉంటుంది. ఈ అధికరణకు సవరణ చేస్తే గానీ పార్లమెంటు హౌస్‌లను గానీ, అసెంబ్లీలను గానీ నిర్ణీత వ్యవధికి ముందుగా రద్దు చేయటం సాధ్యం కాదు. ఆర్టికల్ 356లోని అత్యవసర నిబంధనలు ప్రభుత్వం పూర్తికాలం పనిచేయకుండా అసెంబ్లీలను దెబ్బతీస్తున్నాయి. దానితో పాటు హంగ్ హౌస్ ఏర్పడటం, అవిశ్వాస తీర్మానం తదితర సంఘటనలు హౌస్ ముందుగా రద్దు కావటానికి దోహదం చేస్తున్నాయి.

ఒక దేశం ఒక ఎన్నికలకు సంబంధించిన



నివేదికలో ముంబయ్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రదీప్ నంద్రాజోగ్ కీలకమైన సూచనలు చేశారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహించ టానికి ఆర్టికల్ 85(1), 174(2), 83 (2) లకు సవరణలు చేయాలని ప్రతిపాదించారు.

#### 5. ఆర్టికల్ 325

జమిలి ఎన్నికలకు సంబంధించి ఉన్నత స్థాయి కమిటీ ఒకే ఓటరు జాబితా, ఒకే ఫోటో ఐడెంటీ కార్డు ఉండాలని ప్రతిపాదించింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్‌లను సంప్రదించి కేంద్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల జాబితాను రూపొందించవలసి ఉంటుంది. ప్రస్తుతం ప్రతి రాష్ట్రానికి తమవైన పంచాయతీ, మున్సిపల్ చట్టాలు ఉన్నాయి. దాని ప్రకారం అవి ఓటరు జాబితాలను రూపొందించుకుంటాయి. ఇప్పుడు ఒకే ఓటరు జాబితా అమలు చేయాలంటే రాజ్యాంగ సవరణ అవసరం అవుతుంది. తప్పనిసరిగా ఆర్టికల్ 325 ని సవరించాలి. ఇలా చేయటం వల్ల దాని ప్రభావం ఆర్టికల్ 234కె, 243 జడ్ఏ పైన పడుతుంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ రూపొందించిన జాబితా ఈ చట్టానికి లోబడి ఉంటుంది.

#### 6. ఆర్టికల్ 324ఏ

ఆర్టికల్ 83, ఆర్టికల్ 172లను సవరించటంతో పాటు మున్సిపాలిటీలకు, పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించటానికి కొత్తగా రాజ్యాంగంలో 324ఏ ఆర్టికల్ ని జోడించాలని కమిటీ ప్రతిపాదించింది. ఈ కొత్త 324ఏ చట్టం లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలతో పాటే, పంచాయతీ, మున్సిపాలిటీలకు ఒకే దఫా ఎన్నికలకు మార్గాన్ని సులభతరం చేస్తుంది.

#### ఒక దేశం-ఒక ఎన్నిక ఎలా పనిచేస్తుంది?

2029కు ముందు ఎన్నికలు నిర్వహించి, ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేయని రాష్ట్ర ప్రభుత్వాల పరిస్థితి ఏమిటనే చర్చ సాగుతోంది. వచ్చే ఏడాది నుంచి చూస్తే ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, తమిళ నాడు సహా మొత్తం 23 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఎన్నికలు సాగుతాయి. కోవింద్ ప్యానల్ సూచన ఏమిటంటే ప్రతి అసెంబ్లీ కాల వ్యవధి 2029 సాధారణ ఎన్నికలకు అనుగుణంగా ఉండే విధంగా సర్దుబాటు చేయాలని ప్రతిపాదించింది. అంటే దీనర్థం 2025 ఢిల్లీ ఎన్నికల్లో గెలిచిన పార్టీ నాలుగేళ్లు మాత్రమే అధికారంలో ఉంటే, 2028లో కర్ణాటక ఎన్నికల్లో గెలిచే పార్టీ 12 నెలలు మాత్రమే అధికారంలో ఉంటుంది. ఒక దేశం ఒక ఎన్నికకు అనుగుణంగా అన్నింటిని సర్దుబాటు చేయాలని ప్రతిపాదించింది.

#### జమిలి ఎన్నికల వల్ల ఎవరికి లాభం?


జమిలి ఎన్నికల వల్ల రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు నష్టపోతాయనే వాదన వినిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా రాష్ట్రాల ప్రాధాన్యతలు ముందుకొస్తాయి. అదే సార్వత్రిక ఎన్నికల విషయానికొచ్చే సరికి ఓటరు చూసే అంశాలు వేరు. భారతదేశంలో ప్రధానమైన సమాఖ్య వ్యవస్థ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతలు వేరుగా ఉంటాయి. లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించటం వల్ల రాష్ట్ర, ప్రాంతీయ అంశాలు మరుగున పడతాయి. ఈ విధానం వల్ల ప్రాంతీయ పార్టీలతో పోలిస్తే జాతీయ పార్టీలు ఎక్కువ ప్రయోజనం పొందుతాయి. ఇది రాజ్యాంగ నిర్మాణా నికి కీలకమైన సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తుందని అంటున్నారు.

#### జమిలిపైన మరికొన్ని ప్రతిపాదనలు

లా కమిషన్ 170వ నివేదిక (1999)లో లోక్‌సభకు, అసెంబ్లీలకు ప్రతి ఐదేళ్లకు ఒకేసారి ఎన్నికలకు సిఫార్సు చేసింది. పార్లమెంటరీ కమిటీ 79వ నివేదిక (2015)లో ఒకేసారి ఎన్నికలను రెండు దఫాల్లో నిర్వహించాలని సూచించింది. లా కమిషన్ తన ముసాయిదా నివేదికను 2018లో సమర్పించింది. దీని ప్రకారం లోక్‌సభతో పాటు సగం రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఒకసారి నిర్వహిం చాలి. ఆ తర్వాత రెండున్నరేళ్ల తర్వాత మిగిలిన అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలి. దీనికి అనుగు ణంగా అసెంబ్లీల కాలపరిమితిని పెంచటం గానీ కుదించటం గానీ చేయాలి. ఇందుకు రాజ్యాంగ పరంగా, ప్రజాప్రాతినిధ్య చట్టం 1951కి సవరణలు చేపట్టాలి. దక్షిణాఫ్రికా, స్వీడన్, జర్మనీ,బెల్జియం తదితర పార్లమెంటరీ డెమోక్రసీలు తమ లెజిస్లేచర్లకు నిర్ణీతమైన కాలపరిమితి విధించాయి. దక్షిణాఫ్రికాలో ప్రతి ఐదేళ్లకు నేషనల్ అసెంబ్లీలకు,ప్రొవిన్షియల్ లెజిస్లేచర్లకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తారు. దేశ అధ్యక్షుడిని నేషనల్ అసెంబ్లీ ఎన్నుకుంటుంది. స్వీడన్ ప్రధాని, జర్మనీ ఛాన్సలర్‌లను ప్రతి నాలుగేళ్లకో మారు లెజిస్లేచర్లు ఎన్నుకుంటారు. జర్మనీ ఛాన్సలర్ పైన అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టా లంటే ముందుగా వారసుడిని ఎంపిక చేసుకుని తీరాలి. 2017లో నేపాల్ కొత్త రాజ్యాం గాన్ని స్వీకరించి అన్ని స్థాయిల్లోనూ ఒకే ఎన్నికను నిర్వహించవచ్చు.

#### మధ్యే మార్గంగా...

ఒకేసారి ఎన్నికలకు రాజకీయపార్టీలకు సుముఖంగా లేని నేపథ్యంలో మధ్యే మార్గాన్ని అనుసరించవచ్చని కొందరు నిపుణులు ప్రతిపాదిస్తు న్నారు. దేశవ్యాప్తంగా ఒకే సారి లోక్‌సభ ఎన్నికలను నిర్వహించటం, అనంతరం రెండున్నర సంవత్సరాల తర్వాత అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించటం గురించి ఆలోచించవచ్చని అంటున్నారు. ప్రభుత్వం తన పూర్తి కాలం పనిచేయకుండా అర్ధంతరంగా కుప్పకూలితే ముందు చెప్పినట్టు, కొత్త ప్రభుత్వం మిగిలిన కాలపరిమితి వరకే పనిచేయాలి. అలాగే దేశంలో ఉపఎన్నికలను అన్నింటిని కలిపి ఏడాదికి ఒక్కసారి నిర్వహించవచ్చు. ఇలా చేయటం వల్ల ప్రజాస్వామ్య, ఫెడరల్ అంశాల్లో రాజీ పడకుండా సాధించవచ్చని వాదిస్తున్నారు. అన్ని రాజకీయ పక్షాలు ఈ అంశాలను విశ్వాసంలోకి తీసుకుంటే వచ్చే దశాబ్దంలో దీన్ని సాధించవచ్చు తర్వాత రోజుల్లో దానిని కొనసాగించవచ్చు.




**డాక్టర్ పార్థసారథి చిరువోలు**

**సీనియర్ జర్నలిస్ట్, 9908892065**

# నూతన యుద్ధరీతికి తెరలేపిన ఇజ్రాయెల్

**కాలంతో పాటు యుద్ధ రీతులు కూడా మారుతున్నాయి. ఇటీవలే ఇజ్రాయెల్, మొస్సాద్ కలిసి చేసిన ప్రయోగాత్మక సైబర్ యుద్ధం ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి లోను చేసింది. తీవ్రవాద గ్రూపుగా యుఎస్ గుర్తించిన హిజ్బుల్లాకు చెందిన అనేకమంది కీలక వ్యక్తులను ఒక్క బుల్లెటును వాడకుండా హతం చేసి, వేల మందిని తీవ్రగాయాలకు లోను చేసిన తీరు చూసిన ప్రపంచం ఉలిక్కిపడింది. హిజ్బుల్లాకు కంచుకోటలని భావించే దక్షిణ లెబనాన్, బీరూట్‌లో పేజర్లు, వాకీ టాకీలు, హ్యాం రేడియో, సోలార్ ప్యానెళ్లు సహా పలు ఎలక్ట్రానిక్ పరికరాలు పేలిపోవడంతో వేలమంది గాయాల పాలయ్యారు. తమ రహస్య కార్యకలాపాలకు సెల్ ఫోన్ల కన్నా పేజర్లు, వాకీటాకీలే మేలని భావించి వాడుతున్న హిజ్బుల్లాను తన సైబర్ యుద్ధరీతితో ఇజ్రాయెల్ దెబ్బతీసింది. అంతేనా, ఈ ఘటన అనంతరం ఇజ్రాయెల్‌పై ప్రయోగించేందుకు సిద్ధం చేసిన వేలాది రాకెట్లను, మిస్సైళ్లను ధ్వంసం చేసింది. సైబర్ యుద్ధమంటే సహజంగా కంప్యూటర్లను హ్యాక్ చేయడం అని ఉన్న సాధారణ భావనను ఇజ్రాయెల్ తుడిచిపెట్టేసింది. ఈ ఘటనలలో అనేకమంది హిజ్బుల్లా కీలక నేతలు తీవ్రంగా గాయపడడమో, మరణించడమో జరగడం ఇజ్రాయెల్ నిఘా సామర్థ్యానికి, పట్టుదలకు చిహ్నం.**

హమాస్, ఇజ్రాయెల్ మధ్య దాడి, ప్రతిదాడులు ప్రారంభమై ఈ అక్టోబర్ 7వ తేదీకి రెండేళ్లు కావస్తున్నాయి. ఈ క్రమంలో, గాజాలో దాదాపు హమాస్ స్థావరాలన్నింటినీ ధ్వంసం చేసిన ఇజ్రాయెల్, ప్రస్తుతం హమాస్‌కు మిత్రపక్షంగా, ఇరాన్ మద్దతుతో తనకు వ్యతిరేకంగా చెలరేగిపోతున్న హిజ్బుల్లాపై దృష్టి పెట్టింది. ఏకకాలంలో జరిపిన తన పేలుళ్లలో హిజ్బుల్లా సమాచార నెట్‌వర్క్‌ను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకుంది. చిత్రమేమిటంటే, ఇంతకాలమూ హిజ్బుల్లా వాడుతున్న ఎలక్ట్రానిక్ పరికరాలన్నింటినీ ఇజ్రాయెల్ సానుభూతిపరుల యజమాన్యంలోని ఒక షెల్ కంపెనీ నుంచి కొనుగోలు చేయడం. ఈ వ్యూహాన్ని చేపట్టడం ద్వారా ఆధునిక యుద్ధతంత్రంలో సైబర్ విధ్వంసాన్ని భౌతిక స్థాయికి ఎలా తేవచ్చో ఇజ్రాయెల్ ప్రదర్శించింది. కాగా, ఈ తంత్రం అటు దేశాలను, తీవ్రవాద గ్రూపులను ఎలా నిర్వీర్యం చేయవచ్చో ప్రత్యక్షంగా చూపడంతో ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తం అవుతోంది.

**వరుసగా రెండు రోజులు పేలుళ్లు**

సమాచారం కోసం ఉపయోగించే పరికరాలు పేలిపోవడాన్ని లెబనాన్ వరుసగా రెండు రోజులు చవిచూసింది. మొదట దేశవ్యాప్తంగా, ఏకకాలంలో పేజర్లు పేలిపోవడంతో (వాస్తవ గణాంకాలు బయటకు రానప్పటికీ), పలువురు మరణించగా, వేలమంది గాయపడ్డారు. 'బిలో ది బెల్ట్' అపరేషన్‌గా దీన్ని విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. అసలు ఏం జరిగింది, ఎలా జరిగిందని హిజ్బుల్లా మల్లగుల్లాలు పడుతుండగా, 24 గంటలు తిరక్కుండానే హిజ్బుల్లా కంచుకోటలని భావించే ప్రాంతాలలో వాకీ టాకీలను పేలిపోయాయి. దీనితో, దేశంలో ఏక కాలంలో సామూహిక విధ్వంసానికి, హననానికి ఇజ్రాయెల్ శ్రీకారం చుట్టింది. నిజానికి, పేజర్ దాడిలో మరణించిన హిజ్బుల్లా నాయకుడి కుమారుడి అంత్యక్రియలకు కార్యకర్తలు హాజరైన సమయంలో వాకీ టాకీలు పేలిపోవడంతో అక్కడ పలువురు గాయపడ్డారు. ఈ ఆపరేషన్‌ను అభివర్ణిస్తూ, 'ఇజ్రాయెలీలు ఘర్ మే ఘుస్‌కర్ మారా' అన్న మాటలకు అర్థాన్నే మార్చేశారంటూ ప్రముఖ యాంకర్ రాహుల్ శివశంకర్ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'పై వ్యాఖ్యానించడం గమనార్హం. అంతేకాదు, 'ఇజ్రాయెల్ కూడా భారత్‌లాగా అత్యంత ప్రతికూల వాతావరణంలో ఉంది. మారణహోమానికి, విదేశీ వైముఖ్యానికి మాత్రమే విధేయత చూపే ఇస్లామిస్టులు వారి చుట్టూ ఉన్నారు. కానీ భారత్‌లోలా కాకుండా ఇజ్రాయెల్‌లో మెజారిటీ యూదులు (73శాతం) రాజకీయ ఇస్లామ్‌కు వ్యతిరేకంగా సమైక్యతను ప్రదర్శిస్తున్నార'ని ఆయన అభిప్రాయపడ్డారు.

**హిజ్బుల్ ఏజెంట్లను బహిర్గతం చేసిన దాడి**

ఈ దాడి కేవలం లెబనాన్‌లోనే కాకుండా మధ్య ప్రాచ్యంలో హిజ్బుల్లా ఏజెంట్లు లేక సభ్యుల నెట్‌వర్క్‌ను బహిర్గతం చేసింది. ఎందుకంటే, వారంతా కూడా సమాచార మార్పిడికి తమ గ్రూపు జారీ చేసిన పేజర్లనే వాడుతున్నారు! ఈ దాడులతో ఆగ్రహంతో ఊగిపోతూ, ఇజ్రాయెల్‌కు బుద్ధి చెప్పి తీరతామంటూ హిజ్బుల్లా నేత హస్సన్ నస్రల్లా దీనిని జన హననంగా అభివర్ణిస్తూ, దీనికి తీవ్ర మైన ప్రతీకారం తీర్చుకుంటామంటూ ప్రకటన చేశారు. ఇజ్రాయెల్‌ను ఊహించిన చోట, ఊహించని చోట కూడా దెబ్బతీస్తామని ఆయన గర్జించాడు. అతడు బహిరంగ సభలో ప్రసంగిస్తున్న సమయంలోనే ఇజ్రాయెలీ ఫైటర్ జెట్లు బీరూట్‌లో విహారం చేసాయి. ఈ క్రమంలోనే ఇజ్రాయెల్ రక్షణ దళాలు (ఐడిఎఫ్) తమపై ప్రయోగించడానికి సిద్ధం చేసిన వంద రాకెట్ లాంచర్లను తాము లెబనాన్‌లో ధ్వంసం చేసినట్టు ప్రకటించింది. దక్షిణ



లెబనాన్‌లో హిజ్బుల్లా స్థావరాలలో సంసిద్ధం చేసిన ఈ లాంచర్లలో వేల రాకెట్ బ్యారెళ్లు దగ్ధం అయ్యాయని చెప్తున్నారు. ఇందుకు అదనంగా, పలు హిజ్బుల్లా భవనాలు, ఒక ఆయుధాల డిపో కూడా ఇందులో ధ్వంసం అయినట్టు తెలుస్తోంది. కాగా, సైబర్ దాడులతో హిజ్బుల్లా మొబైళ్లు, కంప్యూటర్లు సహా కమ్యూనికేషన్ పరికరాలను ముట్టుకోవడానికి కూడా భయపడుతున్నట్టు తెలుస్తోంది.

**యుద్ధ రీతులు మారుతున్నాయన్న ఇజ్రాయెల్**

యుద్ధం నూతన దశలోకి ప్రవేశిస్తోందని, సరిహద్దులు, యుద్ధక్షేత్రాలు ఆధునిక యుద్ధరీతులను నిర్వచించలేవని, వాటిని కేవలం సాంకేతికత, నిఘా మాత్రమే వివరించగలవని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి గాలెంట్ వివరించారు. దీనితో పాటుగా ఇజ్రాయెల్ పూర్తి సామర్థ్యాలను లెబనాన్‌లో

క్రియాశీలకం చేయలేదంటూ హెచ్చరించారు. మధ్య ప్రాచ్యంలో మారుతున్న యుద్ధ స్వభావానికి ఆయన ప్రకటన అద్దం పడుతోంది. దీనితోపాటుగా, గాజా నుంచి యుద్ధక్షేత్రం మారిందనే సంకేతాన్ని ఇస్తోంది. సాంకేతిక పురోగమనంతో దాడి చేసే పద్ధతులు కూడా మారుతున్నాయి. ప్రస్తుతం సైనిక వ్యూహాలను మలచడంలో సైబర్ యుద్ధ రీతులు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఇజ్రాయెల్ రుజువు చేసింది.

ఇరాన్ మద్దతుతో కార్యకలాపాలు సాగిస్తున్న హిజ్బుల్లా, ఇజ్రాయెల్‌లో దాడులకు పాల్పడిన హమాస్‌కు బలమైన మిత్రపక్షం. అనునిత్యం హిజ్బుల్లా ఉత్తర సరిహద్దుల నుంచి ఇజ్రాయిలీలపై దాడులకు పాల్పడడంతో ఈ యుద్ధం ప్రాంతీయ పోరుగా మారి, ఐడిఎఫ్ తిరుగబడడానికి కారణమైంది. యుద్ధంలోని ఈ నూతన దశలో, గణనీయమైన అవకాశాలే కాదు గణనీయమైన ప్రమాదాలు కూడా ఇమిడి ఉన్నాయంటూ, హిజ్బుల్లా హింసకు లోనైనట్టు



భావిస్తుందని, తమ ఆక్రామతకు గ్రూపు భారీ మూల్యం చెల్లిస్తుందని తన మనసులో మాట, తమ భవిష్యత్ కార్యకలాపాలను గాలెంట్ బయటపెట్టారు.

**ప్రత్యక్షంగా మారిన పరోక్ష యుద్ధం**

ఈ ప్రాంతంలో హిజ్బుల్లా ముసుగులో ఇరాన్ పరోక్షంగా చేస్తున్న యుద్ధం ఇదనే విషయం బహిరంగమైంది. హిజ్బుల్లా కమ్యూనికేషన్ పరికరాలపై దాడి ఇజ్రాయెల్‌కు కేవలం వ్యూహాత్మక విజయాన్ని ఇవ్వడమే కాదు, ఎంతో సురక్షితమైన నెట్‌వర్క్‌లలోకి కూడా మొస్సాద్ ప్రవేశించి భారీ విధ్వంసాన్ని సృష్టించగలదని ఇరాన్‌కు, దాని ప్రతినిధులకు ఒక భారీ సందేశం కూడా. సంప్రదాయ సైనిక పోరు కాకుండా అత్యాధునిక సైబర్ తంత్రాల ద్వారా తన శత్రువులను నిర్వీర్యం చేయాలన్న ఇజ్రాయెల్ విస్తృతమైన వ్యూహానికి ఇది అద్దం పడుతుంది. ఇరాన్ ప్రస్తుతానికి అయితే ఖండనల మినహా రంగంలోకి రాలేదు. బహుశ, ఈ హఠాత్ దాడితో వారు తమ భవిష్యత్ వ్యూహాలను మార్చుకుంటున్నారేమో!

**లెబనాన్, ఇరాన్ ఖండన, అమెరికా విజ్ఞప్తి**

తమ భూభాగంలో దాడుల పట్ల లెబనాన్ విదేశాంగ మంత్రి అబ్దల్లా బౌ హబీబ్ మండిపడ్డారు. ఇజ్రాయెలీ వైమానిక దాడులు, లెబనాన్ సార్వభౌమత్వం, భద్రతపై బహిరంగ దాడులంటూ అభివర్ణించారు. ఇవి పెరిగితే అది విస్తృతమైన ప్రాంతీయ ఘర్షణకు దారి తీసే అవకాశ ముందని హెచ్చరించారు. కాగా, ఇరాన్‌కు చెందిన రెవల్యూషనరీ గార్డ్స్ మాత్రం ఇజ్రాయెలీ చర్యలకు వారిని తుడిచిపెట్టే ప్రతిస్పందన ఉంటుందంటూ ప్రతిజ్ఞ చేశారు.

ఇదిలా ఉండగా, అందరూ సంయమనం పాటించాలని పిలుపిస్తూ, అటు ఇజ్రాయెల్, ఇటు హిజ్బుల్లా కూడా యుద్ధం తీవ్రమయ్యే చర్యలకు పాల్పడవద్దంటూ అమెరికా విదేశాంగమంత్రి ఆంటోనీ బ్లింకన్ విజ్ఞప్తి చేశారు. ఇజ్రాయెల్, హమాస్‌కు మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదిర్చేందుకు బైడెన్ ప్రభుత్వం ముప్ప తిప్పలు పడుతోంది. ఈ పరిణామలతో, యుద్ధం మధ్య ప్రాచ్యానికి పాకకుండా నిలువరించే సవాలుతో కూడిన బాధ్యత ఇప్పుడు దానిపై పడింది.

**ఐరాస ఆందోళనలను తిప్పికొట్టిన ఇజ్రాయెల్ మాజీ నిఘా అధికారి**

ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ ఈ దాడులను ఖండించడమే కాదు, ఈ ఆపరేషన్ లెబనాన్‌పై భారీ దాడికి నాందీ వాచకంగా ఇజ్రాయెల్ చేసిన పని అంటూ అన్న మాటలతో ఇజ్రాయెల్ మాజీ ఇంటెలిజెన్స్ అధికారి అవీ మెలామెద్ విబేధిచారు. ఇది హిజ్బుల్లాకు కేవలం ఒక హెచ్చరిక మాత్రమేనని తన అభిప్రాయ మన్నారు. ఇప్పుడు బంతి హిజ్బుల్లా, ఇరాన్ కోర్టులో ఉందని, వారి స్పందనను బట్టే ఇజ్రాయెల్– లెబనాన్ సరిహద్దుల వద్ద భారీ సైనిక ఆపరేషన్ ప్రారంభ మవుతుందా కాదా అన్న విషయం నిర్ధారితమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. హిజ్బుల్లా రోజూ చేసే దాడుల నుంచి తన వారిని కాపాడుకునేందుకు ఉత్తర ఇజ్రాయెల్ ప్రాంతం నుంచి వేలాదిమంది పౌరులను ఖాళీ చేయించిన విషయాన్ని పట్టిచూపారు. ఈ ఎలక్ట్రానిక్ పరికరాల దాడి అనేది హిజ్బుల్లా సామర్థ్యాలను ధ్వంసం చేసి, ఉత్తర ఇజ్రాయెల్‌పై దాడులను నిలిపివేసేలా వారిపై అదనపు ఒత్తిడి పెట్టేందుకేనని ఆయన అన్నారు. ఈ సమస్యను దౌత్యపరంగా పరిష్కరించకపోతే, అప్పుడు భారీ సైనిక ఆపరేషన్లు సహా పలు మార్గాలను గురించి ఇజ్రాయెల్ యోచిస్తుందని స్పష్టం చేయడం గమనార్హం.

**ప్రపంచంపై దీని ప్రభావం**

మొస్సాద్ చేపట్టిన ఈ విజయవంతమైన ఆపరేషన్ ప్రభావం, పరిణామాలు మధ్య ప్రాచ్యం ఆవల కూడా పడనున్నాయి. నానాటికీ అనుసంధాన మవుతున్న ప్రపంచంలో ఎలక్ట్రానిక్ పరికరాల భద్రత అన్నది భారీ ఆందోళనగా మారనుంది. పేజర్లు, వాకీ టాకీలు, ల్యాండ్‌లైన్ ఫోన్లను కూడా అక్రమంగా ట్యాంపరింగ్ చేయడ మన్నది ప్రపంచ సమాచార నెట్‌వర్క్‌లలో పెరిగిపోతున్న బలహీనతను పట్టిచూపుతోంది. ఇది ప్రపంచవ్యాప్తంగా దేశాలలో పలు ప్రశ్నలను లెవనెత్తుతోంది. పరికరాలను సవరించి, వాటిని మారుమూల నుంచే మొస్సాద్ ఆయుధీకరించగలిగినప్పుడు, ఇతర దేశాలు ఇతర ప్రాంతాలలో ఇటువంటి కార్యకలాపాలను సాగించేందుకు ఏది నిరోధిస్తుందనే ప్రశ్న తలెత్తుతోంది. అంతేకాదు, మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, గృహోపకరణ ఎలక్ట్రానిక్ వస్తువులు ఆయుధాలుగా మారితే? లెబనాన్‌లో దాడి అటువంటి పరిస్థితి సాధ్యం కావడమే కాదు, ప్రమాదకరం కూడా అనే విషయాన్ని ఇప్పటికే స్పష్టం చేసింది.

దేశాలన్నీ కూడా ఇప్పుడు తమ ఎలక్ట్రానిక్ సరఫరా లంకెలను తక్షణమే సురక్షితం చేసుకోవలసిన అవసరం ఏర్పడింది. తమ పరికరాలు సవరించడానికి వీలులేనివిగా, విదేశీ తంత్రానికి లోబడనివిగా చూసుకోవాలి. అంతేకాదు, ఇది ప్రపంచ సైబర్ ఆయుధాల రేసుకు దారి తీసేందుకు కారణం కావచ్చు. ఇటువంటి విధ్వంసాలను తట్టుకునే సాంకేతికతలను అభివృద్ధి చేసి, మోహరించేందుకు దేశాలు ఇప్పుడు పోటీపడతాయి. అదే సమయంలో, శత్రువుల కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లను ధ్వంసం చేసేందుకు సాంకేతికతలను ఆయుధీకరించే మార్గాలను కూడా అన్వేషిస్తాయి. ఈ క్రమంలో టెలికమ్యూనికేషన్లు, విమాన, రక్షణ రంగాలకు చిక్కులు అనంతంగా ఉండనున్నాయి.

ఈ ఘటన యుద్ధరీతులలో నూతన శకానికి తెరలేపింది. ఇక్కడ సమాచార సాంకేతికతే యుద్ధ క్షేత్రం. నిన్నటి వరకూ దునియా ముఠ్ఠీ మే అనుకున్న ప్రపంచం, తన అరచేతిలోని ఆ పరికరాన్ని ఎవరైనా ఆయుధీకరించవచ్చన్న వాస్తవంతో కుస్తీపడాలి. అంతేకాదు, ఇప్పుడు ప్రపంచ భద్రత అన్నది సురక్షితమైన సరఫరా లంకెలు, నెట్‌వర్క్‌లు, సమాచార మౌలిక సదుపాయాలపై ఆధారపడి ఉంటుంది. సైబర్ యుద్ధం పరిణామం చెందుతున్న కొద్దీ గతంలో కన్నా ఎక్కువగా నష్టాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. భవిష్యత్ యుద్ధాలను యుద్ధక్షేత్రంలో కాక మనందరినీ అనుసంధానం చేసే వైర్లు, పరికరాలు, సర్క్యూట్‌లపై జరుగుతాయని లెబనాన్‌లో పేలుళ్లు మనను హెచ్చరిస్తున్నాయి.

**– డి. అరుణ**



సమాజం, సామరస్యం.. ఈ రెండింటికీ తన జీవితాన్నే వేదిక చేసుకున్నారు తులసమ్మ. ఆమెకు ఆదర్శం చంద్రమౌళి. ఇంతకీ ఎవరీ ఇద్దరూ?

ఇంటి పేరు ఒకటే.. కల్లూరి. గురుశిష్య అనుబంధం. ఇరువురి స్వస్థలం గుంటూరు ప్రాంతం. కేవలం ఉపన్యాసాలను నమ్ముకున్నవారు కారు. పది మాటల కంటే ఒక చేత (పని) మిన్న అని భావించి ఆచరించినవారు.

వందేమాతరం, జైహింద్.... ఇవే ఉభయుల నినాదాలు, విధానాలు, లక్ష్యాలు. అంతరాలకు అతీతం కావాలి జనత. ఉత్తమ ఆశయాల సాధనకు ఉదాత్త మార్గాల్లో పయనించాలి. 'ఐక్యత' అనే మూడే జాతికి మంత్రాక్షరాలు!

ముందుగా కల్లూరి తులసమ్మ గురించి...

ఆమె కన్ను తెరిచింది 1910 డిసెంబరు 25న. కన్ను మూసింది 2001 అక్టోబరు 5వ తేదీన. అంటే తొమ్మిది దశాబ్దాలకు పైగా జీవితకాలం.

బడి చదువు మాత్రమే. సర్వసామాన్య రైతు కుటుంబికులు.

# సమరస వనాన

*కడగొట్టు తమ్ముడని, గారాబు సోదరుడని*
*కనికరమ్మే లేని కఠిన మానసులార!*
*ఏ తప్పు చేశాడురా, మీ సొమ్ము ఏమి కాజేశాడురా!*
*అందకుండా మీరు ముందు పరుగెడుతుంటే*
*విడలేక తమ్ముడూ వెనకాల వస్తుంటే*
*ధుమధుమ లాడారుటే!*
*వడగాడ్పులో శోషవచ్చి నాలుక ఎండి*
*చెరువులో నీళ్లు తానుగా తాగెనని కన్నెర్ర చేశారుటే!*
*జట్టులో రానీక నెట్టివేశారంటూ*
*మరిగిపోయెను మనసు, తిరిగి పోయెను బుద్ధి*
*కరిగిపోతున్నాడురా! నానాడు తరిగిపోతున్నాడురా!*

(నాటి స్థితినీ, గతినీ 'తప్పులేని తమ్ముడు' గేయకర్త వెల్లడించారు. ఇప్పటికీ అటువంటి వాతావరణమే కనిపిస్తుండటం నిజంగా దయనీయం.)

ఆనాడు తెలుగు ప్రాంతాల్లో దళిత యాత్రలయ్యాయి. ఆలయాల్లోకి వారి ప్రవేశాలు జరిగాయి. కార్యాచరణ దిశగా కల్లూరి చంద్రమౌళి నేతృత్వం వహించడాన్ని అప్పటి యువనేత్రి హర్షించి అనుసరించారు. ఆ యువ నాయకురాలు తులసమ్మే! దళితజన సముద్ధరణ, విదేశీ వస్త్రబహిష్కరణ, శాసన ఉల్లంఘన వంటి అన్నింటిలోనూ ముందు వరసన నిలిచారు.

ఆమె దినచర్య ప్రత్యేకంగా ఉండేది. రాట్నం వడికితే వచ్చే ప్రతిఫలంతో అన్నం, మజ్జిగ, పచ్చడి. అంతే, అంతవరకే.

సామాజిక ఐక్యతకు ఉపకరించే కార్యక్రమాలు ఎన్నెన్నో చేపట్టారు. గ్రామీణ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇచ్చేవారు. సేవా కార్యకలాపాల్లో చురుకుగా ఉంటూ సమరసతను ప్రత్యక్షం చేసేవారామె.

స్వతంత్ర ఉద్యమ కార్యకర్తగా ఆసాంతం క్రియాశీలత. కాలిపట్టాలు, వెండి మట్టెలు సహా తన మహోద్యమ నిర్వహణకు ఇచ్చేశారు. ఖద్దరు విస్తృతికీ పరిశ్రమించారు.

తన ఇంటిని ఖాదీ సంస్థకు ఇవ్వడంతో, అక్కడే నూలు, ఖద్దరు వస్త్రాలు తయారయ్యేవి. ఎంతోమంది వనితలకు ఉపాధి కలుగుతుండేది. తులసమ్మ జీవితంలో మరో ప్రధాన స్థానం 'సర్వోదయ'. దానినొక ఉద్యమంగా, నిత్య బాధ్యతగా నిర్వర్తించారు. సర్వోదయ అనేది అందరి పురోగతికీ సూచిక. మరో మాటలో సార్వత్రిక ఉద్ధరణ. దేశ సామాజిక, ఆర్థిక, ధార్మిక సంస్కృతిని పురోగమింప చేయడమే లక్ష్యం.

***సహకారానికే ప్రాధాన్యం. అధికారానికి కాదు.***

*తమ్ముల నిద్రలేపి, చిరదాస్య తమస్తులు వాపి, వెలుగులన్*
*జిమ్ము పథమ్ము జూపి నిలసిల్లెదు దివ్య సువర్ణ సుప్రభా*
*తమ్మువు నీవు; నీ జయపతాకము నీడల నిలిచినారు భా*
*వమ్ముల జాతి వర్ణ మత వర్గ విభేదము మాని, ఎల్లరున్!*
*నీ తేజో మహిమంబు మా హృదయమందే కాదు, విశ్వ ప్రజా*
*చేతో వీధుల కాంతిరేఖలు వెలార్చెన్, ఖండ ఖండాంతర*
*ఖ్యాతంబుల్ భవదీయ పౌరుష యశోగాథల్ లిఖింపంబడున్*
*స్వాతంత్ర్యోజ్వల వీరభారత కృతిన్ సౌవర్ణ వర్ణాలతో!*



అన్నట్లు సాగిందామె జీవనయానం. అది సర్వోదయ అన్వితం.

ఆ ఉద్యమమూ ప్రజలందరి సంక్షేమంవైపే చూపు సారించింది.

మనదైన భారతీయ సమాజంలోని అన్ని వర్గాలకూ అధికార నిర్ణయం ఉండాలంది. సమానతకే

బయట కంటే ఇంట్లో చదువుకున్నదే ఎక్కువ. ఆ రోజుల్లోనే స్వాతంత్ర్య ఉద్యమయోధ తత్వం.

*‘రండీ యువతీ యువకులారా! రారండీ మునుముందర!*
*ఆ మహాత్ము మధురవాణి ఆత్మబలము నందించెను*
*నరనారీ సౌహార్ద ఆనందగీతి వినిపించెను*
*జాతినేత సత్యాగ్రహ సమరభేరి మారుమోగెను*
*శాంతియుత స్వాతంత్ర్య ఉజ్వల స్ఫూర్తి కనిపించెను*
*భారతీయ భావి భాగ్య భాను దీప్తినైతి నేను*
*లలిత నవోషస్సువోలె విలసిల్లిన నవబాలను!’*

అనేలా ఆమె కృషి కొనసాగింది. ఆమె 30 ఏట ‘వ్యక్తి సత్యాగ్రహ’ దీక్ష చేపట్టారు.బ్రిటిష్ పోలీసులు నిర్బంధించి నేరుగా తమిళనాడు కారాగారానికి తరలించారు.ఏడాదిన్నర పైగా జైల్లోనే! అక్కడ శిక్ష అనుభవించిన ఐదుగురు మహిళాయోధుల్లో ఆమె ఒకరు. పట్టుదలలో తనకు స్ఫూర్తి చంద్రమౌళి ఎందుకంటే.... పలు పర్యాయాలు చెరసాలల పాలైనా, సంకల్పశక్తి చెక్కు చెదరలేదు కాబట్టి –

# ‘తులసి’

సమధిక ప్రాధాన్యమిచ్చింది.

శాంతి, శ్రేయస్సు, ఆనందం – ఈ మూడు ఆశయాలు. వీటి ప్రాథమికత ఆధారంగా కీలక అంశాలు మూడు.

మొదటిది: ఒకరికి మేలు మిగిలిన అందరికీ మేలు.

రెండోది: ఏ పనికి తగిన విలువ, గౌరవం ఆ పనికే.

మూడోది: శ్రమిస్తేనే జీవన సమున్నతి. అది నిత్య సత్యం.

ఈ అన్నింటి ప్రాతిపదికతోనే సర్వోదయం ముందుకు సాగింది. నవ్య సామాజికతకు మూలకారకంగా ఏర్పడింది.

ఉద్యమ దశకు చేర్చింది వినోబా భావే. క్షేత్రస్థాయిలో ఆచారణకు మనసా వాచా కర్మణా నడుంకట్టింది తులసమ్మ.

ఎక్కడ అభ్యున్నతి అయినా రెండు రూపాల్లో ఉంటుంది. ఒకటి భౌతికంగా, మరొకటి నైతిక రూపంగా. వీటినే ప్రముఖంగా బోధించిన తులసమ్మ సమాచరణలోనూ అగ్రేసరురాలు.

అందరి మంచికీ సంకల్పం. ఆ సంకల్ప శక్తియుక్తులనే క్రియా రూపానికి తెచ్చిన వనితామణి ఆమె.

సర్వోదయం అంటే సామాజికమే. ఆ ఉద్యమ భావాన్ని స్థాపిత సంస్థగా తెచ్చినవారు వినోబా. ఆయనతోపాటు ముగ్గురు సోదరులూ కఠోర సాధన చేశారు. నియబద్ధ జీవితం గడిపారు. సంఘంలోనే ఉండి, సాటివారి మేలుకు బాధ్యత వహించడమే ధ్యేయంగా నడిచారు.

ప్రత్యేకించి వినోబాజీ జీవితమంతా దీనజన ఉద్ధరణతోనే నిండి ఉంది. ఆయన ఆధ్యాత్మిక, నైతిక, తాత్విక భావనల ప్రభావం తులసమ్మపై ఎంతగానో ఉంటూ వచ్చింది.

*వాణీ విలాస చతురా ప్రథితా ప్రసన్నా*
*భావే మహర్షి చరిత ప్రమితి ప్రపూర్ణా!*
*వాణీ మదీయ రసనోద్గతరమ్య వర్ణా*
*భూయాత్యమాజ పునరుద్ధరణ ప్రకీర్ణా*

అని ఆచార్య స్తుతి అందించారు జోశ్యులవారు. ఆ పుస్తకం ప్రచురితమై ఇప్పటికి సరిగ్గా నాలుగు దశాబ్దాలు.

కలవారు, లేనివారు అంటుంటారు. కొందరికి ఐశ్వర్యం ఉంటుంది. ఇంకొంత మందిది పనిచేయగలిగిన శక్తి. అలా ప్రతీ వ్యక్తికీ ఏదో ఒకటి సొంతం. దాన్ని ఇంటి నాలుగు గోడలకే పరిమితం. చేసుకోకుండా, నలుగురికీ అందించాలన్నదే వినోబా ఉపదేశం. సేవ ఉండాల్సింది ఇంట్లో బందీగా కాదు. ఇంటి బయట సాధనంగా ఉండాలన్నది సారాంశం.

ఇటువంటి ఈ భావాలన్నీ తులసమ్మను ఆకట్టుకున్నాయి. ప్రచార ప్రక్రియను తానే స్వీకరించారు. ఊరూరా ఇంటింటికీ కాలినడకన వెళ్లారు. సర్వోదయోద్యమ అంతరార్థాన్ని విశదపరిచారు అందరికీ. ఆమె అంతరంగంలో వినోబా అయినా, చంద్రమౌళి అయినా....

***శాంతికి క్రాంతి నేరిపి, ప్రజా హృదయాబ్జములన్ సువర్ణ సం***
***క్రాంతులు జాలువారిచి, జగత్తుకు వేడి వెలుంగొసంగు భా***
***స్వంతుడవు నీవు; తానక యశస్సులు భారతమాత మౌళిపై***
***దొంతర మల్లెలైనవి గదా.... ప్రఫుల్ల పరిమళమ్ముతో!***

వీరితోపాటు ఆమె ఆత్మీయురాలు తుమ్మల దుర్గాంబ. గుంటూరు ప్రాంతం లోనే జాతి పునర్నిర్మాణ రూప చిత్రణగా ‘వినయాశ్రమం’ స్థాపకురాలు. ప్రజలం దరి సామాజిక, ఆర్థిక ప్రగతికి దోహదకారి. దుర్గాంబ దంపతులూ సమాజ సమరసతకు అంకితమైనవారే.

ఆ రోజుల్లో గాంధీజీ భారత స్వతంత్ర సమరంలో భాగంగా దళితయాత్ర నిర్వహించారు. గుంటూరు ప్రాంతంలో పర్యటిస్తూ వినయాశ్రమంలో కొన్నాళ్లు ఉన్నారు. దళితులతో ఆలయ ప్రవేశాలు చేయించారు. మరో పర్యాయం కూడా ఆయన వచ్చి వెళ్లారు.

1960 ప్రాంతంలో ఆశ్రమ రజత ఉత్సవాలు జరిగాయి. ఆ వేడుకలకు తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ ప్రధాన అతిథి.

స్వతంత్ర భారతావనిలో సైతం ఆశ్రమ ప్రత్యేకతలు ఇనుమడించాయి. ఇందులో కల్లూరి తులసమ్మదీ కీలక పాత్ర. ఆమె చరఖాను వినియోగించారు. స్వదేశీ వస్త్ర ప్రాధాన్యాన్ని అంతటా ప్రచారానికి తెచ్చారు.

ప్రభుత్వం నుంచి ఎటువంటి రాయితీలను పొందలేరు. పింఛను సైతం స్వీకరించలేదామె.ఎవరి నుంచి ఎటువంటి సాయాన్ని అర్థించలేదు. అంతటి ఆత్మాభిమాని. దృఢదీక్షకు ఉదాహరణ.

ఆ సేవానిరతి కారణంగానే ఆమె స్వగ్రామం పెదరావూరుకు జాతీయ ప్రాముఖ్యం లభించింది. లభిస్తోంది ఇంకా.

నిరాడంబరంగా ఉండటం స్వయంశక్తితో జీవించడం అనే వాటిని ఆమెను చూసే నేర్చుకోవాలి ఎవరైనా!

ఊరు అనగానే రాజకీయాలు ఉంటాయి. ఆ గ్రామంలో ఉన్నవన్నీ అభివృద్ధి దాయక పాలన పనులే! అభివృద్ధికి అక్కడ అర్థమంటూ గోచరిస్తుంది. ఆ ఊళ్లోని రామాలయానికి ఆధునికీకరణ పనులు జరిపారు.



**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్

శివాలయానికి జీర్ణోద్ధరణ పనులనేకం నిర్వహించారు. గ్రామవాసులు ఈనాటికీ కల్లూరి తులసమ్మనే గుర్తు చేసుకొంటూ ఉంటారు.

అందుకు కారణం ఆమె నియమబద్ధ జీవనం. అవిశ్రాంత సేవా స్వభావం. మనకు స్వాతంత్ర్యం రావడానికి ముందు, అటు తర్వాత కూడా ఎప్పుడూ తాను కలవరించింది సమానత్వం, సామరస్యం గురించే! అందుకే ఆ జీవితం నిరంతర సమరసతకు వేదికగా భాసించింది. ముందే అన్నట్లు – ఆమెది ఆసాంత నియమశీలత. ★



# ఐడబ్ల్యూటీపై పట్టుబడుతూ

**భారత్, పాకిస్థాన్‌లు రెండూ వ్యవసాయాధారిత దేశాలే. విభజన కాకపోతే దేశాన్ని ముక్కలు చేసినట్టుగా, నదీ జలాలను కూడా పంచుకోవలసిన అవసరం ఉండేది కాదు. కానీ, విభజన జరిగింది, నదీ జలాల పంపిణీ జరిగింది. కొత్తగా ఉనికిలోకి వచ్చిన దేశమంటూ భారత్ పెద్ద మనసుతో సింధు జలాలలో అత్యధిక నీటిని పాకిస్థాన్‌కే కట్టబెట్టింది. అయినప్పటికీ, పాక్‌కు మాత్రం కృతజ్ఞత మాట పక్కన పెట్టింది, కనీస సుహృద్భావం లేకుండా పోయింది. అన్ని రకాలుగా లబ్ధి పొందుతూనే భారత్‌లోకి ఉగ్రవాదులను పంపి అరాచకాన్ని సృష్టిస్తున్న పాక్ ఆటలకు ఇక ఫుల్‌స్టాప్ పెట్టాల్సిందేనంటూ భారత్ భావించింది. అందుకే, 1960, సెప్టెంబర్ 19న చేసుకున్న సింధు నదీ జలాల ఒప్పందంలో (ఇండస్ వాటర్ ట్రీటీ –ఐడబ్ల్యూటీ) సవరణలు చేయాలంటూ పాక్‌కు అధికారికంగా నోటీసులు ఇచ్చింది. ఒకవైపు ఉగ్రవాదం, మరోవైపు కృష్ణగంగ, రత్లే జలవిద్యుత్ ప్రాజెక్టులకు సంబంధించి సుదీర్ఘకాలికంగా కొనసాగుతున్న వివాదం నేపథ్యంలో ప్రభుత్వం ఈ చర్య తీసుకోవడం గమనార్హం.**

వాస్తవానికి, భారత్, పాక్‌ల మధ్య తొమ్మిదేళ్ల చర్చల అనంతరం ప్రపంచ బ్యాంకు సహాయంతో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఇందులో ప్రపంచ బ్యాంకు కూడా సిగ్నటరీనే. నాటి ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు యుజీన్ బ్లాక్ చొరవతో ఈ సంప్రదింపులు జరిగాయి. అత్యంత విజయవంతమైన అంతర్జాతీయ ఒప్పందంగా దీనిని చూడటానికి కారణం భారత్ సహనమే. అది పాక్ చేసిన యుద్ధాలను, తీవ్రవాదం సహా పలు దుష్కర్మలను సహించి కొనసాగించింది.

ప్రస్తుతం తీసుకుంటున్న ఈ చర్య కేవలం వనరుల కేటాయింపులకే కాదు, జాతీయ భద్రతకు కూడా అవసరమైనదే. భారత్‌లో అల్లర్లను సృష్టించేందుకు పాక్ తీవ్రవాదులను పంపినప్పటికీ భారత్ ఎంతో సంయమనం పాటిస్తూ వ్యవహరించింది. కానీ, ఇప్పుడు ఆ సహనం కూడా హద్దులు దాటడంతో శత్రుత్వం కలిగిన పొరుగు దేశపు అవసరాల కంటే స్వదేశపు అవసరాలకు ప్రాధాన్యతనివ్వాలని మన ప్రభుత్వం నిర్ణయించి పాక్‌కు నోటీసులు జారీ చేసింది.

**ఇంతకీ నోటీసు సారాంశం ఏమిటి?**

భారతదేశం ఆగస్టు 30, 2024న పాకిస్థాన్‌కు పంపిన నోటీసులో, 1960లో దానిని ప్రారంభించినప్పటి నుంచీ ఏకపక్ష జల ఒప్పందంగా ఉంటూ వస్తోందని, వాస్తవ ఒప్పందంలో అనేక ఆర్టికల్స్‌ను వాస్తవంగా అంచనావేసి, సమీక్షించవలసి ఉందని పేర్కొంది. సింధు జలాల వినియోగం, జనాభా గణాంకాలు మారిపోతున్నాయి కనుక, భారత్ స్వచ్ఛ ఇంధనం దిశగా పురోగమిస్తున్నందున ఈ ఒప్పందాన్ని పునఃపరిశీలించి, మార్చాలి అని వివరించింది. దీనితో పాటుగా, పాకిస్థాన్ వైపు నుంచి నిరంతరం సాగుతున్న తీవ్రవాద కార్యకలాపాలను ప్రస్తావించి, భారతీయ ఉదారత నుంచి అనుచితంగా లాభం పొందిన, పొందుతున్న పాకిస్థాన్ గుర్తించాలని, ఒప్పందాన్ని పునఃపరిశీలించి, సమీక్షించాల్సిందేనని పేర్కొంది.

**అసమంజసమైన ఒప్పందం**

ఉమ్మడి సింధు నదీ వ్యవస్థ నుంచి పాకిస్థాన్‌కు 80శాతం జలాలను ఇస్తూ భారత్ సింధు జలాల ఒప్పందంపై సంతకాలు చేసింది. పాక్ కన్నా వైశాల్యం లోనూ, జనాభాలోనూ కూడా పెద్ద దేశమైన భారత్‌కు నీటి అవసరాలు కూడా ఎక్కువే ఉంటాయి. కానీ కేవలం 20శాతం జలాలు మిగిలాయి. ఈ జలాల్లో కూడా భారత్ కేవలం 4శాతం మాత్రమే ఉపయోగించుకుంటోందని తెలుస్తోంది. అందుకు కారణం, పాక్ సృష్టించే ఆటంకాలేనన్నది నిర్వివాదం. ఈ కేటాయింపు భిన్నమైన భౌగోళిక రాజకీయ పరిస్థితుల మధ్య జరిగింది. ముఖ్యంగా, భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఇంత సుదీర్ఘకాలం శత్రుత్వం కొనసాగుతుందని కానీ, భారత్‌లో తీవ్రవాదానికి పాక్ మద్దతునిస్తుందని కానీ ఊహించని సమయంలో చేసుకున్న ఒప్పందమిది. తర్వాత నుంచీ పాకిస్థాన్ పరోక్ష యుద్ధాలను ప్రోత్సహిస్తూ, భారత్‌లో చిచ్చు పెడుతున్నప్పటికీ ఈ అసమానమైన వాటాలు కొనసాగాయి. యుద్ధం, తీవ్రవాద సమయంలో కూడా భారత్ ఈ ఒప్పందాన్ని కఠినంగా అనుసరించింది. కానీ, భారత్‌కు హాని చేయాలనే లక్ష్యంతో ఉన్న దేశానికి లబ్ధి చేకూర్చేలా ఒప్పందానికి కట్టుబడి ఉండమనడం అసమంజసం.

**ఒప్పందం కింద ఏ నదుల జలాలు ఎవరికి?**

ఈ ఒప్పందం కింద సింధు, ఝీలం, చీనాబ్ నదీ జలాలను పాకిస్తాన్‌కు కేటాయించగా, భారత్‌కు తూర్పు నదులైన రావి, బియాస్, సత్లజ్‌లపై హక్కులు ఉన్నాయి. ఈ నదీ జలాల సహజ ప్రవాహం నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు భారత్‌కు అనుమతి ఉంది. ఈ ప్రాజెక్టుల పట్ల పాకిస్థాన్ పదే పదే అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ అడ్డుకోవడంతో, అది భారత్‌కు జల ప్రవాహాన్ని ప్రభావితం చేసింది. సుదీర్ఘకాలంగా కృష్ణగంగ, రత్లే ప్రాజెక్టుల చుట్టూ అల్లుకున్న వివాదాల అనంతరం ఈ నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందుకు స్పందనగా, ప్రపంచ బ్యాంకు ఈ సమస్యల పరిష్కారానికి సమాంతర ప్రక్రియలను చేసింది. తత్ఫలితంగా, భారత ప్రభుత్వం ఈ ఒప్పందపు వివాదాల పరిష్కార యంత్రాంగాన్ని కూడా పునఃపరిగణించమని కోరుతోంది. సింధు నదీ జలాల ఒప్పందంలోని ఆర్టికల్ 12 (3)కు అనుగుణంగా ఒప్పందాన్ని సమీక్షించేందుకు ఇరు ప్రభుత్వాల మధ్య చర్చలు నిర్వహించేందుకు పాక్‌ను భారత్ ఆహ్వానించింది. ఈ ఆర్టికల్ ప్రకారం రెండు ప్రభుత్వాల మధ్య జరిగిన ఈ ఒప్పందాన్ని కాలానుగుణంగా అప్పుడప్పుడు సవరించి, ఆమోదించవచ్చునని ఆర్టికల్ 12(3) స్పష్టంగా చెబుతోంది.

**ప్రపంచ బ్యాంకు జోక్యం పట్ల అసంతృప్తి**

అమెరికా ఆధిపత్యంలో ఉండే ప్రపంచ బ్యాంకు సహజంగానే పాక్ వైపు మొగ్గు చూపుతూ వస్తోంది. పైగా మధ్యవర్తిననే సాకు చూపి, సింధు నదీ జలాల ఒప్పందంలో గతంలో జోక్యం చేసుకోవడం పట్ల భారత్‌లో అసంతృప్తి చెలరేగుతున్నది. ఇరు దేశాల మధ్య జలవిద్యుత్ ప్రాజెక్టులకు సంబంధించి నడుస్తున్న వివాదాన్ని పరిష్కారం చేస్తామన్న సాకుతో సమాంతర ప్రక్రియలను ఏకకాలంలో అమలులోకి తేవడం పట్ల భారత్ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తోంది. ఇది సింధు జలాల ఒప్పందంలోని నిబంధనలకు అనుగుణంగా లేదని భారత్ స్పష్టం చేసింది. వివాదాల పరిష్కారంలో పాక్ చూపుతున్న వైఖరి



# పునఃసమీక్షకు
# ...న్న భారత్

కారణంగా ఒప్పందాన్ని పునః సమీక్షించాలని భారత్ నిర్ణయించుకొని, పాక్‌కు నోటీసు పంపింది. ఈ వ్యవహారంపై పాకిస్థాన్ తనదైన శైలిలో స్పందించింది. భారత్ ఒక తటస్త నిపుణుడిని ఈ వ్యవహారంపై నియమించాలని కోరుతుండగా, పాక్ మాత్రం హేగ్‌లో గల కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ద్వారానే దీనిని పరిష్కరించాలని పట్టుబడుతోంది. దీనితో భారత్ హేగ్ కోర్టులో ప్రక్రియలను బాయ్‌కాట్ చేసింది.

**జగడాలమారి పొరుగు**

భారత్‌కు తనవైపు చేపడుతున్న అభివృద్ధి పనులకు, ప్రాజెక్టులకు వ్యతిరేకంగా పాక్ తన నిరసన వ్యక్తం చేస్తూ వస్తోంది. వాస్తవానికి, ఒప్పందంలో అంతర్గతంగా ఉన్న సహకార స్ఫూర్తి పదాల్లో కనిపిస్తోందే తప్ప చర్యల్లో కనిపించడం లేదు. ఒక దశాబ్దకాలం కిందట జమ్ము నగరంలో తావి నది నుంచి ఒక కాలువను కట్టడానికి సంబంధించి పాకిస్తాన్ తన అభ్యంతరాలను వ్యక్తం చేసింది. ఒప్పందం ప్రకారం వారివైపు నుంచి వచ్చిన నిపుణులు నిర్మాణాన్ని చూసిన తర్వాత తమ అభ్యంతరాలను ఉపసంహరించుకున్నారు. ఈ ఒప్పందంలోని ఆర్టికల్స్‌లోని అంశాలను పాక్ ఉపయోగించుకున్నంత తరచుగా భారత్ ఉపయోగించలేదు. దానివల్ల భారత్‌కు ప్రాజెక్టులను పూర్తి చేయడంలో జాప్యం, నిర్మాణ ఖర్చు పెరగడం వంటి అనేకానేక సమస్యలు వస్తున్నాయి. ఈ క్లాజును ఉపయోగించి అభ్యంతరపెడుతున్నామంటూ ప్రాజెక్టును తాత్కాలికంగా నిలుపుదల చేయడానికి పాక్‌కు ఒక కాగితం ముక్క ఖర్చైతే, భారత్ అప్పటికే దానిని ప్రారంభించి ఉన్నందున కోట్ల రూపాయలు నష్టపోతోంది.

**తీవ్రవాదంతో విసిగిపోయిన భారత్**

వీటన్నింటికీ తోడుగా భారత్‌కు వ్యతిరేకంగా తీవ్రవాద కార్యకలాపాలకు పాకిస్థాన్ ఇస్తున్న మద్దతు సుస్పష్టంగా కనిపిస్తున్నప్పుడు దాని పట్ల ఉదారత చూపడం కూడా తప్పే. వారు భారత్‌ను అస్థిరం చేసేందుకు చురుకుగా పని చేస్తున్నప్పుడు మెజారిటీ సింధు నదీ జలాలపై నియంత్రణను వారికి ఉండనివ్వడం వ్యూహాత్మకంగా విధ్వంసకరం. కొన్ని దశాబ్దాలుగా, ఏం జరిగినా పట్టించుకోకుండా భారత్ ఒప్పందానికి కట్టుబడి ఉంది కనుకనే, తన భారత వ్యతిరేక విధానాలు, చర్యలతో పాకిస్థాన్ పురోగమించగలిగింది. తీవ్రవాద దాడులు, తిరుగుబాట్లకు మద్దతు, చొరబాట్లను ప్రోత్సహిస్తూ భారత్‌ను లోకువ చేసింది. ఈ ఒప్పందాన్ని సమీక్షించాలన్న భారత్ నిర్ణయం కేవలం జలాలకు సంబంధించిన వ్యవహారం కాదు, అది ఒక సందేశాన్ని పంపడం. ఈ ఒప్పందాన్ని పట్టుకువేళ్లడం ద్వారా మనం ఒక శత్రురాజ్యాన్ని పోషిస్తుంటే, అందుకు బదులుగా అది తీవ్రవాదానికి మద్దతునిచ్చి, నిధులు సమకూరుస్తోంది.

> సింధు జలాల ఒప్పందంలో మార్పులు చేయడం అన్నది న్యాయమే కాదు భారతదేశ భద్రతకు కీలకం కూడా. అందుకే సింధు నదీ జలాల సమీక్ష సమావేశంలో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ, రక్తం, నీరు కలిసి సాగలేవంటూ స్పష్టం చేశారు. పెరుగుతున్న జనాభా, స్వచ్ఛమైన ఇంధన అవసరాల కోసం మరింత జల వనరులు కావాలి. భారత భూభాగమైన పీఓకే నుంచి ప్రవహించే జలాలపై తీవ్రవాదులకు నిధులను, ఆయుధాలను ఇచ్చి ప్రోత్సహించే దేశానికి అంత వాటా అందుబాటులో ఉండడం సమంజసం కాదు. అది తన లబ్ధి కోసం తన జలాలను ఉపయో గించేలా

**భారత్ చర్య తీసుకోవలసిన సమయం**

సింధు జలాల ఒప్పందంలో మార్పులు చేయడం అన్నది న్యాయమే కాదు భారతదేశ భద్రతకు కీలకం కూడా. అందుకే సింధు నదీ జలాల సమీక్ష సమావేశంలో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ, రక్తం, నీరు కలిసి సాగలేవంటూ స్పష్టం చేశారు. పెరుగుతున్న జనాభా, స్వచ్ఛమైన ఇంధన అవసరాల కోసం మరిన్ని జల వనరులు కావాలి. భారత భూభాగమైన పీఓకే నుంచి ప్రవహించే జలాలపై తీవ్రవాదులకు నిధులను, ఆయుధాలను ఇచ్చి ప్రోత్సహించే దేశానికి అంత వాటా అందుబాటులో ఉండడం సమంజసం కాదు. అది తన లబ్ధి కోసం తన జలాలను ఉపయోగించేలా చేయాల్సిన సమయం ఆసన్నమైంది.

భారత్ కనుక ఈ ఒప్పందాన్ని పునః సమీక్షించగలిగితే దేశ నీటి సమస్య తీరిపోతుంది. మరొక హరిత విప్లవం దేశంలో సాధ్యమవుతుంది. బారాముల్లాకు భారీగా విద్యుత్ అందచేయవచ్చు. అంతేకాదు, భారత్ క్లిష్టమైన భూభాగాలను చేరుకునేందుకు జలమార్గాలను సృష్టించుకునేందుకు తోడ్పడుతుంది. దీనితో పాటుగా, వరదలు, కరువు, నీటిపారుదల సమస్యలు తీరిపోతాయి. భారత్ వాటాగా వచ్చిన నదులను ఉత్తర–మధ్య భారత దేశంతో అనుసంధానం చేస్తే పూర్తిగా ఉత్తర భారతదేశానికి నిరంతర జల ప్రవాహం ఉండేలా తోడ్పడుతుందని నిపుణులు అంటున్నారు. అంటే, సింధు నదిని గంగతో (సింధు–ఝీలం–చినాబ్, సత్లజ్–రావి–బియాస్–యమున–గంగ)లను అనుసంధానం చేయడం ఎంతో మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ప్రయాగరాజ్ వద్ద యమున, గంగతో కలుస్తుందన్న విషయం తెలిసిందే. మంచి పంపిణీ వ్యవస్థను ఉపయోగించి, ఈ కాలువల వ్యవస్థ జమ్ము, కశ్మీర్, హిమాచల్, డెహ్రాడూన్, పంజాబ్, చండీగఢ్, హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్, ఉత్తరాఖండ్, యుపి, ఎంపీలకు ప్రత్యక్షంగానూ, గుజరాత్, మహారాష్ట్ర, బీహార్, పశ్చిమ బెంగాల్, చత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఒరిస్సాకు పరోక్షంగానూ తోడ్పడవచ్చన్నది వారి అంచనా. భారత్ ఈ ప్రాజెక్టును తలపెడితే, దేశంలో దాదాపు 36.47శాతం జనాభాకు తోడ్పడుతుందన్నది వారి భావన. ఇది భారీ ఆర్థిక, పర్యాటక కారిడార్‌ను సృష్టిస్తుందని వారి భావన.

నిత్యం శాంతిని తిరస్కరించే శత్రువు పట్ల సానుభూతి చూపడాన్ని కొనసాగించడం అమాయకత్వమే కాదు ప్రమాదకరం కూడా. ఒకవైపు భారతదేశ స్థిరత్వాన్ని దెబ్బతీస్తూనే మరోవైపు ఒప్పందపు లాభాలను పాకిస్థాన్ ఉపయోగించుకుంది. సింధు జలాల ఒప్పందాన్ని సవరించాలన్న భారత్ డిమాండ్ న్యాయమైన, అవసరమైన అడుగు. భారతదేశపు గుండెలపై తీవ్రవాదాన్ని ఉపయోగించే శత్రురాజ్యపు మౌలికసదుపాయాల కోసం రాయితీలివ్వడాన్ని నిలిపివేయలన్న దేశం పట్టుదలకు అది ప్రతిబింబం. తన వనరులను తన పౌరుల లబ్ధికి ఉపయోగపడేలా చూడడమే కాక, తీవ్రవాద బెదిరింపుల నుంచి తన సరిహద్దులను భారత్ సురక్షితం చేసుకోవాలి. తన ప్రయోజనాలను మరచి, శత్రువైన పొరుగుకు మేలు చేయాలనే వైఖరిని కొనసాగించడం ఇకపై ప్రత్యామ్నాయం కాబోదు.

**– నీల**

# నవంబర్‌లో భాగ్యనగరంలో హిందూ ఆధ్యాత్మిక, సేవా

"ఆత్మానో మోక్షార్థం జగత్ హితాయచ" అంటే మోక్ష సాధనకు మార్గంగా మానవ సేవ అన్న రుగ్వేద సూక్తిని, ఈశావాస్య ఉపనిషద్ తాత్వికత అయిన "ఈశావాస్యమిదం సర్వం" – "అత్యంత అల్పమైన అణువు నుంచి సర్వజీవుల్లో వ్యాపితమై ఉన్న భగవంతుడు", మహాత్మా గాంధీ సూక్తులను పొందుపరిచి "కలిసి, జీవిద్దాం" అన్న సూత్రాల ఆధారంగా నెట్‌వర్క్ చేసిన హిందూ ఆధ్యాత్మిక సంస్థల సేవా కార్యకలాపాలను వివరించేందుకు ఒక నవీన మేళానే 'హిందూ ఆధ్యాత్మిక, సేవా మేళా.' దేశంలో వివిధ ప్రాంతాలలో నిర్వహిస్తున్న ఈ మేళాను తొలిసారి హైదరాబాద్‌లో 8 నవంబర్ 2024 నుంచి 10 నవంబర్ 2024 వరకు నిర్వహిస్తున్నారు.



హెచ్‌ఎఫ్‌ఎస్‌ఎస్ ఫెయిర్–2019

**హిందూ ఆధ్యాత్మిక, సేవా మేళాల పరిణామ క్రమం**

హిందూ ఆధ్యాత్మిక, సామాజిక సంస్థలు చేస్తున్న సేవా కార్యకలాపాలను ప్రదర్శించేందుకు గ్లోబల్ ఫౌండేషన్ ఫర్ సివిలైజేషనల్ హార్మొనీ – ఇండియా (జిఎఫ్‌సిహెచ్–ఇండియా), హిందూ స్పిరిచ్యువల్ అండ్ సర్వీస్ ఫెయిర్ (హెచ్ ఎస్ఎస్/ఫెయిర్) అన్న భావనకు రూపకల్పన చేసి, ప్రదర్శన మేళాను నిర్వహించింది. హిందూ నాగరికత, ఒక జాతిగా భారత్ పట్ల ఉన్న దురభిప్రాయాలను తొలగించడమే లక్ష్యంగా ఈ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

పూజనీయ దలైలామా, మాజీ రాష్ట్రపతి డా॥ అబ్దుల్ కలామ్, పూజ్య స్వామి దయానంద సరస్వతి (ఆర్ష విద్యా రీసెర్చ్ సెంటర్), స్వామీ బాబా రామ్‌దేవ్ (దివ్య యోగమందిర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు), శ్రీశ్రీ రవిశంకర్ గురూజీ (ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు), జతేదార్ జోగీందర్ సింగ్ వేదాంతి (అకాల్ తఖ్త్ మాజీ అధిపతి), కార్డినల్ ఆస్వాల్డ్ గ్రేషియస్ (భారత్‌లో రోమన్ కేథలిక్ చర్చి అధిపతి, ముంబై ఆర్చ్‌బిషప్), డా॥ మౌలానా మహ్మూద్ అలీ మదనీ (దారుల్ ఉలూం దేవబంద్ అధిపతి, జమైత్ నాయకుడు, ఇస్లామిక్ పండితుడు), ఆచార్య మహా ప్రజ్ఞ (ప్రముఖ జైన్ గురువు,సైన్స్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు), రబ్బీ ఇజెకీల్ ఐసాక్ మాలేకర్ (భారత్‌లోనే అత్యంత ప్రముఖుడైన యూదు నాయకుడు) సహా ప్రముఖ ఆధ్యాత్మిక గురువులు, మేధావులు, ప్రముఖ వ్యక్తులు 2008 జనవరిలో జిఎఫ్‌సిహెచ్ ఇండియాను అధికారికంగా ప్రారంభించారు.


హెచ్‌ఎఫ్‌ఎస్‌ఎస్ తిరువనంతపురం – 2017

ఢిల్లీలో అత్యంత గౌరవాన్ని అందుకునే వ్యక్తులు ప్రేక్షకులుగా అన్ని మతాలకు చెందిన ప్రాతినిధ్యం ఈ కార్యక్రమంలో ప్రతిబింబించింది. మతాంతరీకరణలకు ఒక సాధనంగా కాక, ఆదర్శవంతమైన కార్యాలు జీవితాన్ని అధిగమిస్తాయని, మంచితనానికి సహకరిస్తాయనే విశ్వాసం ఆధారంగా ప్రజా సేవలో నిమగ్నం కావలసిందిగా సంస్థలను హెచ్‌ఎస్ఎస్ఎఫ్ కార్యక్రమాలు, మేళాలు ప్రోత్సహిస్తాయి.

**2011లో హిందూ స్పిరిచ్యువల్ అండ్ సర్వీస్ ఫౌండేషన్ ఆవిర్భావం**

ఆధ్యాత్మిక సంస్థలు, మీడియా, ప్రజల నుంచి హెచ్‌ఎస్ఎస్ఎఫ్ కార్యక్రమాలు, మేళాలు విస్తృతమైన ఆమోదాన్ని పొందిన తర్వాత ఈ కార్యక్రమాలను నిర్వహించేందుకు ఒక ప్రత్యేక ట్రస్టును ఏర్పాటు చేయాలని జిఎఫ్‌సిహెచ్ ఇండియా నిర్ణయించింది. తత్ఫలితంగా, చెన్నైలో కార్యక్రమాలు నిర్వహించేందుకు సిఎఫ్ సిహెచ్ ఇండియా చెన్నై చాప్టర్ కింద ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. సేవలను అందిస్తూ అంకిత భావాన్ని ప్రదర్శించిన వారిని హిందూ స్పిరిచ్యువల్ అండ్ సర్వీస్ ఫౌండేషన్ (హెచ్‌ఎస్ఎస్ఎఫ్) ధర్మకర్తలుగా నియమించడం జరిగింది. హెచ్‌ఎస్ఎస్ఎఫ్‌ను 2011లో ధర్మసంస్థగా (పబ్లిక్ చారిటబుల్ ట్రస్టుగా) ఏర్పాటు చేసి, ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 12ఎఎ కింద 2013లో నమోదు చేశారు. బహుళంగా ఉన్న హిందూ ఆధ్యాత్మిక సంస్థలలో ఉన్నతమైన స్ఫూర్తితో ప్రజాసేవ చేసేందుకు ప్రేరణ కలిగించి, ప్రోత్సహించి, కొనసాగించేందుకు, భారతదేశ వ్యాప్తంగా హెచ్‌ఎస్ఎస్ఎఫ్ మేళాలను, కార్యక్రమాలను నిర్వహించడం సంస్థ ప్రాథమిక లక్ష్యం. అదనంగా, హెచ్‌ఎస్ఎస్ఎఫ్ విలువలను, నాగరికతా ధర్మాలను ప్రోత్సహించేందుకు భారత దేశవ్యాప్తంగా సెమినార్లు, సదస్సులు, సమావేశాలు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తుంది. గౌరవనీయ సుప్రీంకోర్టు డా॥ రమేష్ ప్రభు వర్సెస్ ప్రభాకర్ కాశీనాథ్ కుంతే (1995) కేసులో 'హిందుత్వం' అన్న పదానికి ఆపాదించిన అర్థానికి అనుగుణంగా, 1996లో ఎఐఆర్ 113 వివరించినట్టుగా 'హిందూ' అన్న పదాన్ని నిర్వచించాలని హెచ్‌ఎస్ఎస్ఎఫ్ ట్రస్ట్ డీడ్ స్పష్టంగా పేర్కొంటుంది. 'హిందుత్వ'ను సంకుచిత మతపరమైన భావనగా కాక భారత ప్రజల సంస్కృతీ, ఆచార వ్యవహారాలను ఆవరిస్తూ, వారి జీవన విధానాన్ని వర్ణించేలా ఉండాలని హెచ్‌ఎస్ఎస్ఎఫ్ ట్రస్ట్ డీడ్ స్పష్టంగా పేర్కొంటుంది. నాలుగవ ఫెయిర్/ మేళా నుంచి, ఫెయిర్స్/ మేళాలు అన్నింటినీ హెచ్‌ఎస్ఎస్ఎఫ్ నిర్వహిస్తోంది.

**పాలుపంచుకోవడం/ భాగస్వాములు**

ఫెయిర్/ మేళా జరిగే ప్రాంగణంలో నిర్వహించే ఇతివృత్త ప్రధానమైన పోటీలు, సంప్రదాయ క్రీడలు, ఆటలలో వందలాది స్కూళ్లు పాలుపంచుకుంటాయి. ఆ ప్రదేశంలో నిర్వహించే వివిధ పోటీలలో పలు పాఠశాలల చురుకైన

ప్రమేయం ఉండడమే ఈ మేళాల కీలక అంశం. ఆరవ మేళా/ ఫెయిర్‌లో, ఆరు ప్రధాన ఇతివృత్తాలకు అనుగుణంగా ఉండేలా ఈ పోటీలను పునఃరూపకల్పన చేయడమే కాక, దేశీయ క్రీడలను పునరుద్ధరించారు. ఏడవ మేళాలో పురాణాలు, సాహితీ గ్రంథాలు, కళ, సంస్కృతి నుంచి తీసుకున్న ఆరు ఐఎంసిటిఎఫ్ ఇతివృత్తాల ఆధారంగా 376 పోటీలు నిర్వహించారు. మొత్తం 13 కార్పొరేషన్, ప్రభుత్వ పాఠశాలలు సహా 267 పాఠశాలలకు చెందిన 7,350 మంది విద్యార్థులు ఫైనల్స్‌లో పాల్గొన్నారు. క్రమం తప్పకుండా ఆ కార్యక్రమానికి ప్రాయోజకునిగా ఉన్న 'శాస్త్ర యూనివర్సిటీ' మొత్తం 1,355మంది విజేతలకు రూ. 13 లక్షల విలువైన ప్రైజ్ కూపన్లను ప్రదానం చేశారు.

**కార్యక్రమాలు**

అక్కడ ప్రాంగణంలో ఉదయం 9.30 నుంచి రాత్రి 9.30 వరకూ జరిగే సాంస్కృత కార్యక్రమాలు ఈ మేళాల్లో/ ఫెయిర్స్‌లో అత్యంత ఆకర్షణీయమైన అంశం. అందులో పాలుపంచుకుంటున్న ఆధ్యాత్మిక సంస్థలు, ఐఎంసిటిఎఫ్ అనుబంధ పాఠశాలలు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తాయి. ఇందులో

## ఫౌండేషన్ ప్రదర్శన




వైవిధ్యభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. ఈ సాంస్కృతిక కార్యక్రమాలు భారీ సంఖ్యలు ప్రజలు ఆకర్షిస్తాయి.

**దేశం, దైవం, ధర్మం**

దేశం, దైవం, ధర్మం (హిందూ విలువల వ్యవస్థ) నడుమ ఉన్న విడదీయలేని అనుబంధంలో 'హిందూ స్పిరిచ్యువల్ అండ్ సర్వీస్ ఫెయిర్' (హిందూ ఆధ్యాత్మిక, సేవా మేళా) పొతుకుపోయిందనేదే దాని కీలక సందేశం. మన దైవం లేకుండా మన దేశం వృద్ధి చెందలేదు. మన దేశం లేకుండా దైవం అసంపూర్ణం. ఈ రెండిటినీ కూడా హిందూ విలువల వ్యవస్థ – ధర్మం నిలుపుతుంది. ఈ మేళాకు సంబంధించిన ఆరు ఇతివృత్తాలనూ విలువల వ్యవస్థ (ధర్మం)లో అల్లి, ఈ ప్రాచీన భూమైన మన దేశంలో ఆచరిస్తుండగా, వాటికి దైవం దారి చూపింది.

**హైదరాబాదులో తొలిసారి**

తొలిసారి హైదరాబాద్‌లో 8 నవంబర్ 2024 నుంచి 10 నవంబర్ 2024 వరకు ఈ మేళాను నిర్వహిస్తున్నారు. ఈ మూడు రోజులూ కార్యక్రమాలు ఉదయం 10 గంటలకు ప్రారంభమై రాత్రి 9 గంటలకు ముగుస్తాయి.

ఈ ఉదాత్తమైన కార్యక్రమానికి సమయం, ఆర్థిక సాయం లేదా మరే ఇతర మార్గాలలోనైనా దోహదం చేస్తూ ప్రతి సేవలోనూ పాల్గొనవలసిందిగా ప్రోత్సహిస్తున్నామంటూ నిర్వాహకులు తెలిపారు.

– జాగృతి డెస్క్

## సోషల్ మీడియా ఔత్సాహికుల సమావేశం



**కర్నూలు:** ఆర్‌ఎస్‌ఎస్ ప్రచార విభాగం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 22న కర్నూలులోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర కళ్యాణ మండపంలో సోషల్ మీడియా ఔత్సాహికుల కార్యశాల జరిగింది. ఆర్‌ఎస్‌ఎస్‌పై వస్తున్న అసత్య వార్తలను ఖండించి వాస్తవాలు తెలియ జేయడం, సంఘ సిద్ధాంతాన్ని ప్రచారం చేయడం, సోషల్ మీడియాను ఎలా ఉపయోగించుకోవాలన్న విషయంపై కార్యశాల జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రధానవక్తగా పాల్గొన్న ప్రాంత సోషల్ మీడియాప్రముఖ్, ప్రచార ప్రాంతటోలి సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచంలో ఏ నిర్ణయం తీసుకోవాలన్నా సమాచారం ముఖ్యం. వ్యక్తులు కూడా సమాచారం మీదనే ఆధారపడి నిర్ణయం తీసుకుంటారు. కానీ ప్రపంచంలో మీడియాను ఎవరైతే సమర్థవంతంగా వాడుకుంటారో వారు మాత్రమే ప్రపంచాన్ని ఏలుతారని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కర్నూలు విభాగ్ ప్రచార ప్రముఖ్ రఘునాథ్, జిల్లా ప్రచార ప్రముఖ్ అక్కెం విశ్వనాథ్, జిల్లా సహప్రచార ప్రముఖ్ చిత్తారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రద్ధాంజలి



**సూర్యాపేట :** ఆర్‌ఎస్‌ఎస్ జేష్ట కార్యకర్త యర్రంశెట్టి లక్ష్మీ నరసయ్య, సెప్టెంబర్ 11న మరణించారు. వీరి వయసు 66 సంవత్సరాలు. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేసి పదవీ విరమణ చేశారు. సూర్యాపేట జిల్లా బౌద్ధిక్‌ప్రముఖ్‌గా, జిల్లా సహకార్యవాహగా బాధ్యతలు నిర్వహించారు. గత ఎనిమిది సంవత్సరాలుగా జాగృతి విస్తరణ కొరకు పనిచేశారు.

ఈ కార్యక్రమంలో యర్రంశెట్టి రామలింగయ్య. జిల్లా సంఘచాలక్ అంకతి అప్పయ్య, జాగృతి అసోసియేట్ ఎడిటర్ దుర్గారెడ్డి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు కె.ఉపేందర్ సూర్యాపేట మాజీ మున్సిపల్ చైర్మన్ అమృతారెడ్డి, జుట్టుకొండ సత్యనారాయణ, ఎం.శివరామయ్య, భుజంగరావు పాయలి, పిన్నని కోటేశ్వరరావు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నాకీ జైలు జీవితం హాయిగానే ఉంది. ఎవరైనా... ఎప్పుడైనా... వచ్చి... నన్ను తీసుకు పోతారేమోనని బెంగ... నాకెవరూ లేరు... ఎవరూ మిగలలేదు... నేనొక్కన్నే... కాని... ఎందుకో బెంగ...

నా మాటలు మీకు చిత్రంగా తోచవచ్చు... జైలు జీవితం హాయిగా ఉంది. అనటంలో నా వెర్రితనం మీకు కనిపించవచ్చు...

కాని... ఇలా నేను ఎందుకంటున్నాను... మీకు తెలిస్తే... బహుశా మీరు కూడా నాతో ఏకీభవించ వచ్చు... వించకపోవచ్చు.. అది మీ వ్యక్తిగతం...

నేనోసారి... మా ఊర్లో జరుగుతున్న హరికథకు వెళ్లాను. ఆ కథలో... ఏనుగు కాలును మొసలి పట్టు కోవడం అన్యాయం అనీ... ఏనుగు ధర్మం తప్పని కరిరాజని హరిదాసుగారు చెప్పారు... కనుకనే భగవంతుడు ఏనుగు రక్షణ కోసం ఎటువంటి దుస్తులు ధరించకుండా... ఆదరాబాదరగా పరుగెత్తు కొని వచ్చేసాడని కూడా చెప్పారు....

అప్పుడు నాకనిపించింది. ఏది న్యాయం, ఏది ధర్మం అని. న్యాయం, ధర్మం చాలా చిత్రమైన పదాలుగా నాకు తొలిసారిగా, అదిగో... అప్పుడే అనిపించాయి.

తరువాత తరువాత... వీటి గురించి చాలా ఆలోచించాను...

ఇదిగో...ఇప్పుడు కూడా.ఈ జైలులో కూడా హాయిగా రెస్టు తీసుకుంటూ ఆలోచిస్తున్నాను.

వాల్మీకి పూర్వాశ్రయంలో రత్నాకరుడు.దారి దోపిడీలు చేసి, కొండొకచో మర్డర్లు చేసే డబ్బు సంపాదించి సంసారాన్ని పోషించేవాడు....

ఒకనాడు నారదుడు వచ్చి 'ఛీ.ఛీ. ఇదన్యాయం. నీకు ముక్తి, భక్తి మార్గం చూపుతాను నా మాట వినమన్నాడు' అలాగే అన్నాడు రత్నాకరుడు.కాని ఎందుకైనా మంచిదని ఇంటికి వెళ్లి భార్యతో మాట్లాడి వస్తానన్నాడు. సరేనన్నాడు నారదుడు....

రత్నాకరుడు తన భార్యకు చెప్పాడు విషయాన్ని. మీ నిర్ణయం అధర్మం. ఏ పనైనా సరే పెళ్లాంబిడ్డలను పెంచి పోషించవలసిందే. ప్రాణాలు నిలుపు కోవలసిందే ఇదే ధర్మం అంది...

ఇక్కడే... రత్నాకరుడికి ఓ సమస్య వచ్చింది. ఏమిటంటే నారదుడు చెప్పింది న్యాయమా? తన భార్య చెప్పింది ధర్మమా? ఎవరి మార్గాన్ని తానెంచు కోవాలి!!

చివరకు న్యాయ మార్గాన్ని ఎంచు కున్నాడు. వాల్మీకిగా మారాడు. అంటే న్యాయం మనిషిలో మార్పును తెస్తుందన్న మాట.

మరి ధర్మం తప్పని ధర్మరాజు న్యాయం గురించి అతనికి తెలియదని అనుకోవచ్చా?న్యాయం తెలిస్తే.. 'అశ్వత్థామ అతః కుంజరహ' అని ఎందు కన్నాడు? అంటే తన అవసరార్థం, ధర్మం కోసం న్యాయాన్ని తప్పవచ్చునన్న మాట....

అవినీతి చేస్తే అన్యాయం. శిక్ష ఉంటుంది... అంటుంది న్యాయం....

ఏది చేసైనా సరే సమాజంలో గౌరవంగా బ్రతకడం, తన వారిని బ్రతికించుకోవడం ధర్మ మంటుంది ధర్మం...

మనిషి దేనిని అతిక్రమించాలి? దేనిని ఆశ్రయిం చాలి...!?

ఆకలేసినప్పుడు కుక్కమాంసం కూడా తినవచ్చు.. అది ధర్మమే అన్నారు పండితులు. నిరూపించాడు ఆదిశంకరుడు...

కాని వేదం చదివిన వారు... అది న్యాయం కాదంటారు... మాంసంలో జీవహింస ఉంది. దీనికోసం మరొకరిని మనం ప్రేరేపించడమంటే మనం కూడా జీవహింసను ప్రోత్సహించిన వారమేనంటుంది ధర్మం.


ఈ విధంగా, న్యాయం, ధర్మం మధ్య కనిపించని సన్నటి తెం, సున్నితపు పొర ఒకటుంది. దీనిని ఎలా తొలగించగలం?

ఇదంతా మీకెందుకు చెబుతున్నానంటే...

నేను చేసిన పని ధర్మమా?న్యాయమా? అని నా చుట్టూ చాలా మంది చేరి నన్ను ప్రశ్నించి, హింసించి, చివరకు అధర్మమంటూ న్యాయం కోసమని పోలీసులుకు అప్పగించి, ఎవరిమటుకు వారు వారి వారి ధర్మాలను నిర్వహించడం కోసం వెళ్లిపోయారు.

అన్యాయమైన పని నేను చేసాను కనుక అది వారి దృష్టిలో అధర్మం కనుక వారంతా ధర్మం తప్పని, న్యాయమార్గాన్ని నడుస్తున్న వారు కనుక నావంటి వారి మధ్యలో ఉంటే వారు కూడా 'అన్యాయమై పోతారని' తలచి నన్ను పోలీసులకు అప్పగించారు.

పోలీసులు నన్ను న్యాయస్థానంలో నుంచో



బెట్టారు...

నేరం చేసావా? అనడిగారు న్యాయాధీశులు...

చేసానన్నాను... ధైర్యంగానే...

'ఎందుకు చేసావు...'మళ్లీ అడిగారు.

ఎందుకో నేను చెప్పాను. నేను చెప్పింది పూర్తిగా వినలేదు... రిమాండు కోసం పంపారు...

ఈ దేశంలో న్యాయం ఎంతవేగిరంగా దొరుకు తుందో, ఎలా దొరుకుతుందో తెలిసినవాడిని కనుక నాకు ఈ మొత్తం ప్రక్రియ ఎంత మాత్రం ఆశ్చర్యం కలిగించలేదు.


కాని, నా మనసులోని బాధను... నేనందుకు అధర్మంగా.. అన్యాయంగా వర్తించవలసి వచ్చిందో మీకైనా చెప్పుకుంటే కొంచెం తేలికపడతాను.

కనుకనే నా ఈ కథను మీకు చెప్పాలను కుంటున్నాను. నా ఈ కథంతా విని? అర్జీలు పెటో, మానవహక్కులంటో, నా మీద జాలితోనో, జీవకారుణ్యం తోనో దయచేసి నన్ను జైలు నుంచి బయటకు తెచ్చే ప్రయత్నాలు మాత్రం మీరెవ్వరూ చేయకండి.

ఏది ఏమైనా నేను చేసింది నేరమని నాకు, నా అంతరాత్మకు తెలుసు. నేరానికి శిక్ష అనుభవించ వలసిందే అని నమ్ముతాను. ఇటువంటి నమ్మకం నాకు లేకపోయినా జైలు జీవితమంటే నాకసహ్యం అనుకున్నా, న్యాయవ్యవస్థతో 'దోబూచీ' ఆడుకోవా

# తోడు

భమిడిపాటి గౌరీశంకర్



లని నేనెంత మాత్రం తలచినా, ఏదో విధంగా బయటనే ఉండేవాడిని...

కనుక మీరెవ్వరూ కూడా నా విదుదల కోసం ప్రయత్నించకండి.కాని... దయచేసి నేను చెప్పేది మాత్రం వినండి.

నేను శ్రీకాకుళం జిల్లాలో ఓ కుగ్రామంలో పుట్టాను. దాదాపు ఇరవై సంవత్సరాలు వచ్చే వరకు అక్కడే ఉన్నాను. జీవితం... గుల్లలో ఇరుకున నత్తలాగా ఉండేది.

నేను, నాన్న, చెల్లి. తల్లి... ఇదీ నా కుటుంబం. మా నాన్న చదువు 'నిశాని'. కంప్యూటర్లపై ప్రపంచం నడుస్తున్న ఈ రోజులలో మా నాన్న వంటివారు ఏం పనిచేయగలరో మీ వంటి మేధావులు తేలిగ్గానే ఊహించగలరు...

కూలిపని, రిక్షా త్రొక్కడం. 'మనకు' సిగ్గు అనేది లేకపోతే నిక్షేపంగా అడుక్కోవటం. కాని, చిత్రం ఏమిటంటే డబ్బు, చదువు లేకపోయినా మా నాన్నకు పరువు, మర్యాద, సిగ్గు, కుటుంబ ప్రతిష్ట వంటి పదాలంటే విపరీతమైన అభిమానం ఉండేది. వాటికోసం రిక్షా తొక్కడం ప్రారంభించాడు.

పగలంతా అందరిని మోసి మోసి అలసి పోయినవాడు. రాత్రవగానే... తనను ఇంకొకరు తనను మోసే అధికారం ఇచ్చేవాడు. బాగా తాగి పడిపోయే వాడు. ఇది తెలిసి నేను నాన్నను రిక్షాలో వేసుకొని వచ్చేవాడిని. ఆ విధంగా రిక్షాతొక్కే వారసత్వం నాకు మా నాన్న పరోక్షంగా అందజేసాడు.

'వారసత్వానికి' మించిన సంపద ఏముంది చెప్పండి.?

మా నాన్న నన్ను మాత్రం టెన్త్ వరకు చదివించాడు. నేను కూడా శ్రద్ధగానే చదివాను. కాని ఆర్థిక పరిస్థితులు అంతకన్నా ముందుకు పోవటానికి

జరగరాని ఘోరం. ప్రకృతి వైపరీత్యం. ఒరిస్సా రాష్ట్రంలోని సగం జిల్లాలను జలమయం చేసింది. జనజీవనం అతలాకుతలమై పోయింది. మనుషులు, జంతువులు అనే తేడా లేదు. తెల్లారేసరికి ఎవరు బతికి ఉన్నారో! ఎవరు బ్రతికిలేరో? తెలియని పరిస్థితి... ప్రతీ కుటుంబం బజారు పాలైంది. కోటీశ్వరులు... కూటికి లేని వారుగా మారిపోయారు. ప్రకృతి ముందు మనిషి అత్యంత అల్పుడని మరోసారి రుజువయింది.



సరైన సదుపాయాలు అంటే కాలేజీలు వంటివి లేకపోవటం వలన నా చదువు అక్కడితో ఆగిపోయింది.

కాని... రోజులు చూస్తుండగానే మారి పోయాయి. ఆటోలు రిక్షాల స్థానాన్ని ఆక్రమించేసాయి. వేగానికి అలవాటుపడిన ప్రాణులు జనంలో వాహనాల రద్దీలో ముసలి ప్రాణం త్రొక్కే రిక్షాను ఎవరూ ఎక్కేవారు కాదు. ఇందువలన మా కుటుంబ ఆర్థిక వనరులు క్షీణించాయి. ఆకలిని తట్టుకోలేక అమ్మ, చెల్లి మరణించారు.

ఒక రకంగా నాకెంతో సంతోషమనిపించింది. సంతోషం వెనుక ఉన్న విషాదాన్ని మీరు అర్థం చేసుకున్నా, చేసుకోకపోయినా ఫర్వాలేదు. కాని వారిద్దరూ అలా వెళ్ళిపోవడం, నాకెంతో ఆనందాన్ని కలిగించింది.

ఇంతలో...

పదవ తరగతి చదువుకున్న యువకులు కావలంటూ, ఒరిస్సా రాష్ట్రంలో ని ఓ పరిశ్రమ వారు ప్రకటన ఇచ్చారు. అర్హులైన వారికి జీతంతో పాటు ఉచిత వసతి, భోజనం కూడా ఇస్తామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఓ రాయి విసురుదామని అనుకున్నాను... విసిరాను...

ఫలితం కనిపించింది.ఇంటర్వ్యూకు రమ్మన్నారు. కాని డబ్బు? నాకో ఆలోచన వచ్చింది. రిక్షాను అమ్మేసాను.

అన్ని సవ్యంగా జరిగిపోయాయి. నేను, నాన్న ఒరిస్సాలోని ఆ ప్రాంతానికి చేరుకున్నాం. అదేదో పెద్ద ఉద్యోగం కాదు. కూలిపనే. కాని ఇద్దరికి రెండు వేళ్లయినా నోట్లోకి వెళుతున్నాయి. ప్రస్తుతానికి హాయిగానే మా జీవితాలు సాగిపోతున్నాయి.

కాని, కాలం ఇలాగే జరిగిపోతే... నేను ఈ కథ మీకు చెప్పనవసరం లేకపోనూ...

ఆ రాత్రి...


జరగరాని ఘోరం. ప్రకృతి వైపరీత్యం. ఒరిస్సా రాష్ట్రంలోని సగం జిల్లాలను జలమయం చేసింది. జనజీవనం అతలాకుతలమై పోయింది. మనుషులు, జంతువులు అనే తేడా లేదు. తెల్లారేసరికి ఎవరు బతికి ఉన్నారో! ఎవరు బ్రతికిలేరో? తెలియని పరిస్థితి... ప్రతీ కుటుంబం బజారు పాలైంది.

కోటీశ్వరులు... కూటికి లేని వారుగా మారిపోయారు. ప్రకృతి ముందు మనిషి అత్యంత అల్పుడని మరోసారి రుజువయింది. మనిషి ఓడిపోయాడు. చేతులెత్తేసాడు. ప్రకృతి జయించింది. శాంతించింది. కాని... బతికిన మనుషుల బతుకు పోరాటం ఎలా...?

నా పరిస్థితి మరింత దారుణంగా మారింది.

తుపాన్‌కు మేముంటున్న ప్రాంతం మొత్తం సర్వనాశనం అయిపోయింది. మేము పనిచేస్తున్న నిర్మాణంలో ఉన్న పరిశ్రమ తాలూకా గుర్తులు ఏమీ కూడా మిగలలేదు. కనీసం ఒక ఇటుకైనా కనిపించలేదంటే మీరు నమ్మకపోవచ్చు. దీనిని కట్టిన 'బడాసేట్' వరదలో చనిపోయాడు.

నేను, నాన్న ఉంటున్న ప్రాంతం మొత్తం జలమయపోయింది. చుట్టూ నీరు.అదృష్టం కొద్ది ఎత్తయిన ప్రదేశంలో ఓ పెద్ద మట్టిచెట్టు ఆధారంగా మేం బతికి బయటపడ్డాం...



పగలు ఎండ, రాత్రి గాలి, చలి. ఇవే మాకు బంధువులు, స్నేహితులు.

మరో రోజు గడిచింది. మేమున్న ప్రదేశానికి మరో పదిమంది నీటిలో ఈదుకుంటూ వచ్చారు. దాదాపు డజను మందిమి చేరుకున్నాం. ఒక రోజంతా కష్టసుఖాలు పంచుకున్నాం. కాని ఖాళీ కడుపులు ఎంతకాలం 'కబుర్లు' చెప్పుకోనిస్తాయి. మేము అలసిపోయాం.

కనుచూపు మేర అంతా నీరు... నీరు...

అప్పుడప్పుడూ జంతువుల కళేబరాలు మేమున్న ప్రాంతం మీదుగా ప్రవాహానికి కొట్టుకు పోయేవి. వాటిని చూస్తే కనుపు దేవినట్టుగా ఉండేది. రాత్రవుతున్నదంటే.. సూర్యుడు ఉదయిస్తున్నాడంటే. మబ్బులు ఆకాశంలో తిరగాడుతున్నాయంటే మాకు విపరీతమైన భయంగా ఉండేది.

మరో రోజు గడచిపోయింది..

కడుపులు ఖాళీ అయినా 'కాల కృత్యాలు' తీర్చుకోవడం తప్పదు కదా. ఒకపూట.. రెండు పూటలు ఫర్వాలేదు. కాని రెండు రోజులు ఎలా ఆగుతాయి? ఎలా ఆపగలం అన్నీ అక్కడే.

ఇప్పుడు నేనున్న స్థితి ఇందుకు ఎంతమాత్రం భిన్నంగా లేదు. కాని మా అందరి ముఖాలలో అసహ్యం లేదు. ఆకలి, ఎవరైనా ఏమైనా తెచ్చివ్వక పోతారా అనే ఆశ ఉన్నాయి.

ఇంతలో ఆకాశంలో ఏదో చప్పుడు.

హెలీకాప్టర్ ఒకటి రివ్వున మా నుంచి ఎగిరిపోయింది. ఏమి జార విడవ కుండానే మరో రోజు గడిచింది. ఆకలి మరింత పెరిగింది. నాన్న పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. మరో రోజు కూడా ఆహారం లేకపోతే.. అతను చనిపోవడం గ్యారంటీ. నేను అతని గురించి దాదాపుగా ఆలోచించడం మానేసాననే చెప్పాలి.

కడుపు నిండుగా ఉన్నవాడు-నేను చెప్పిన మాట వింటే... సుమతీ, వేమన శతకాలతో పాటు శ్రవణ కుమారుడి కథ కూడా చెప్పి నీతి, నైతిక సూత్రాలు గురించి చెబుతాడు.


కాని, వాస్తవం కథంత నీతులంత కమ్మగా ఉండదు..

ఇంతలో ఆకాశంలో మళ్లీ చప్పుడు. మేమంతా ఆశగా ఆకాశం వైపు చూసాం. మా అదృష్టం బాగుంది. కొన్ని ఆహార పొట్లాలు, రొట్టెలు జార విడిచారు.

అందరికి అందాయి. మా నాన్న కూడా అందుకున్నాడు. నాకు మాత్రం ఏమి దొరకలేదు.

నేను వారి మీద పడి దోచుకుంటూననుకున్నారు కాబోలు. ఉన్న ఆ కొద్ది ప్రదేశంలోనే ఎవరికి వారుగా నాకు దూరంగా జరిగిపోయారు. చేతిలో కర్రలు కూడా ఉంచుకున్నారు.

చివరకు, మా నాన్న కూడా...



**మానాన్న కోసం ఒకటి రెండుసార్లు పిలిచాను. పలకలేదు. బహుశా ఆకలి వల్ల ఎక్కడో సొమ్మసిల్లి ఉంటాడు. రేపు తన కోసం మరో పొట్లం సంపాదించాలి. నాకు దొరికినదైనా సరే నేను, నాన్న కలసి తినాలి. కడుపు నిండింది. ఆలోచనలలో మార్పు వచ్చింది. అనుబంధం గుర్తుకు వచ్చింది. ఆ రాత్రి ఆ దుర్గంధపూరిత వాతావరణంలోనే హాయిగా నిద్రపోయాను. కడుపు నిండగానే కంటినిండా నిద్ర కూడా వచ్చింది. మరి ... తెల్లవారింది.....**

నాకు విపరీతమైన ఆక్రోషం, బాధ కలిగాయి. మేము అందరం అన్నం తింటున్నప్పుడు వీధిలో కుక్కను కొట్టడానికి కర్రను దగ్గర ఉంచుకొనేవారం. ఈ సంఘటన గుర్తుకు వచ్చింది. నాకిప్పుడు.

వారంతా అన్నం, రొట్టెలు తింటున్నారు.

నేను కుక్కలాగ కలియబడతానని కర్రలు కూడా రడీ చేసుకున్నారు. మా నాన్న కూడా...

నా స్థానంలో మీరు ఉండి ఒక్క క్షణం ఆలోచించండి.

ఆ రాత్రి ఆకలితోనే గడచిపోయింది. నాలో విచక్షణా జ్ఞానం పూర్తిగా నశించింది. నేనేమిటో నాకే తెలియని పరిస్థితి. ఏం చేయగలనో. ఏం చేయకూడదో కూడా ఆలోచించే స్థితిలో లేను. నాక్కావలసింది. అర్జంట్‌గా కడుపునిండే మార్గం..

అవకాశం కోసం ఆకాశం వైపు చూస్తున్నాను. రాత్రి సమయం... చీకటి... ఎవరు ఏమిటో తెలియని పరిస్థితి. చలి, ఆకలి, కోపం, తపన.

ఆకాశంలో చప్పుడు వస్తున్నది. ఏదో ఒకటి దొరకక పోదు. ఎలాగైనా సరే సంపాదించాలి. తప్పదు. ఈ పూట నా ఆకలి తీర్చుకోవాలి. ఇప్పటికే నాలుగు రోజులుగా కడుపు ఖాళీగా ఉంది. మరో రోజు గడిస్తే పక్కనున్న ఎవరినైనా సరే, చంపి అతని మాంసం అయినాసరే తినేస్తాను.

ఆకలి నాలో ఆలోచనా జ్ఞానాన్ని పూర్తిగా నశింప జేసింది. ఆ పరిస్థితిలో నేనో ఉన్మాదిని అంతే.

రెక్కల శబ్దం, హెలికాప్టర్ దగ్గరవుతున్నది. మా నెత్తిమీద నుంచి ఎగిరింది. దానికి క్రిందనున్న లైట్ వెలుగులో మా ఉనికిని గుర్తించి కొన్ని పొట్లాలు, రొట్టెలు విడిచి వెళ్లిపోయింది.మళ్లీ చీకటి.

నా బలాన్ని ఉపయోగించాను. కండబలం చూపాను. నా చేతిలో రెండు పొట్లాలు. ఒక రొట్టె. ఏనుగు ఎక్కినంత ఆనందం కలిగింది.

కాని ఎవరో నా చేతిని గుంజుతున్నాడు. నాలో ఆవేశం కట్టలు తెంచుకుంది. నా చేతికి వాడి పీక సరిగ్గా దొరికింది. ఆకలి, ఆవేశంలో నా మెదడు పనిచేయడం మానేసింది. అతని పీకను గట్టిగా పట్టుకున్నాను. నొక్కాను. చేతులు వదిలేశాడు. నేను మాత్రం అతని పీక వదలలేదు. మొదటి చిన్న శబ్దం. ఎవరో పడిపోయి న్నట్టుగా తరువాత నిశ్శబ్దం. తరువాత నేను దూరంగా వెళ్లి, దొరికింది. హాయిగా తిన్నాను.

మానాన్న కోసం ఒకటి రెండుసార్లు పిలిచాను. పలకలేదు. బహుశా ఆకలి వల్ల ఎక్కడో సొమ్మసిల్లి ఉంటాడు. రేపు తన కోసం మరో పొట్లం సంపాదించాలి. నాకు దొరికినదైనా సరే నేను, నాన్న కలసి తినాలి. కడుపు నిండింది. ఆలోచనలలో మార్పు వచ్చింది. అనుబంధం గుర్తుకు వచ్చింది.

ఆ రాత్రి ఆ దుర్గంధపూరిత వాతావరణంలోనే హాయిగా నిద్రపోయాను. కడుపు నిండగానే కంటినిండా నిద్ర కూడా వచ్చింది. మరి ...

తెల్లవారింది.....

''నేను ఎవరిని చంపానో- అందరికి తెలిసిపోయింది. నాక్కూడా..

ఇంతలో దూరంగా ఓ చిన్న నాటు పడవలో ఆంధ్రా పోలీసులు అధికారులు వస్తూ కనిపించారు. మేమున్న ప్రదేశానికి వచ్చారు. రాగానే ముక్కులు మూసుకున్నారు.


మా మధ్య ఉన్న శవాన్ని చూశారు. అందరిని అడిగారు. ఎవరు చేసారీ పని అని . మిగిలిన వారంతా నా వైపు చూపారు. నేను కూడా అంగీకరించాను.

నన్ను ఆ పడవలో కూర్చోబెట్టుకున్నారు. మరి కొంతసేపటిలో మరో పడవ వస్తుందని, మీరంతా రావచ్చునని... ఆ ఆహారం తినండి. ఈ మందులు వాడండి అని కొన్ని ఆహార పొట్లాలు, మందులు మిగిలిన వారికి ఇచ్చారు. వారంతా నన్ను అసహ్యంగా చూసారు. నేను తలదించుకున్నాను. పోలీసులతో వెళ్లి పోయాను. ఆ తరువాత నేను మా నాన్నను మరి చూడలేకపోయాను.

వచ్చేవారం కథ..

**నేటి ఉద్యోగ**

- గంటి భానుమతి



# 'రామనామం' వారు..





'అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుంది'.. ఇది 1980 తరువాత మైదాన ప్రాంతాలలో వినిపించింది కానీ, చత్తీస్‌గఢ్‌లో ఒక వర్గానికి వాళ్ల పెద్దలు 150 ఏళ్ల క్రితమే చెప్పారట. ఆ వర్గం పేరు రామ్‌నామీలు. చత్తీస్‌గఢ్‌లోనే రామ్‌నామీ సమాజ్ 19 శతాబ్దంలో ఆవిర్భవించింది. అప్పటికి బాగా పెరిగిపోయిన కుల వ్యవస్థను ప్రతిఘటిస్తూ ఉత్తర చత్తీస్‌గఢ్ ప్రాంతంలో ఈ సమాజ్ ఉనికిలోకి రావడం అపురూపమైన విషయమే. ఒక శతాబ్దం క్రితం ఈ వర్గం మరొక వినూత్న నిర్ణయం కూడా తీసుకుంది. ఆనాటి నుంచి ముఖం మీద, శరీరమంతటా వీరు రాముడి పేరును పచ్చబొట్టు పొడిపించుకుంటున్నారు. దీని వెనుక ఉన్న చింతన కూడా ప్రత్యేకంగా ఉంటుంది. రాముడు సర్వాంతర్యామి అన్న సందేశానికి ఇలా శరీరం మీద పచ్చబొట్టుతో వారు ఆకృతి ఇచ్చుకుంటున్నారు. దీనితో పాటు రాముడంటే తమ సమాజానికి ఉన్న భక్తి ప్రపత్తులను ప్రదర్శించుకోవడం కూడా ఈ పచ్చబొట్టు ఉద్దేశం. వీరే ఈ మధ్య తమ పూర్వీకులు చెప్పిన మాట గురించి వెల్లడించారు. అదే అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ విషయం. రాముడు ఈ దేశ ఆత్మ కదా!

అయోధ్యలో జనవరి 22, 2024న జరిగిన ప్రాణప్రతిష్ఠ కంటే ముందే చత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం రామ్‌నామీలతో ఒక కార్యక్రమం ఏర్పాటు చేసింది. రామ్‌నామీ సమాజ్ పుట్టుపూర్వోత్తరాలు ఈ తరానికి తెలియచేయడమే ఆ కార్యక్రమం ఉద్దేశం. వీరంతా రామభక్తులే. వారిలో కొందరు కాషాయధారులు ఉంటారు. కొందరు తమ రామభక్తికి గుర్తుగా నిరంతరం శిరోముండనం చేయించుకుంటారు. రాముడిని ఆరాధించేవారే ఆయనకు సన్నిహితులు కాగలుగుతారని వారి విశ్వాసం.

ఈ సమాజంలో స్త్రీపురుషులకు సమాన హక్కులు ఉంటాయి. వీరు ఘుంఘ్రూ (అంటే నెమలి ఈకలతో చేసిన కిరీటం)ధరించి, దానితోనే రామ భజన చేస్తూ నర్తిస్తారు. ఇది వీరికి ఎంతో ఇష్టమైన కళారూపం. వీరంతా సనాతన హిందూ ధర్మంలోనే ఉన్నా, రూప రహిత భగవదారాధన చేస్తారు. అలాగే ఒకరే నిజమైన దైవమనీ భావిస్తారు. ఆయనే రాముడు.

దేహం మీద రాముడి పేరుతో వేసుకునే పచ్చబొట్టు హస్తకళ. ఈ పచ్చబొట్టు పొడవడానికి రామ్‌నామీ సమాజ్‌లోని కొందరు పెద్దలు కళాకారులను నియమిస్తారు. నిజానికి వెదురు సూదులతో పొడిచే ఈ పచ్చబొట్టు ప్రక్రియ శరీరాన్ని హింసిస్తుంది. ఇందుకు ఉపయోగించే సిరాను కూడా వారే తయారు చేస్తారు. ★

---

బాంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వానికి నెమ్మదిగా వాస్తవాలు తెలుస్తున్నట్టే ఉంది. భారతదేశానికి హిల్సా అనే ఒక రకం చేప ఎగుమతిని నిషేధించడం ఎంత పిల్ల చేష్టో త్వరగానే గ్రహించింది. దసరా కోసం భారత్‌కు 3,000 టన్నుల హిల్సా రకం చేపను ఎగుమతి చేస్తామని సెప్టెంబర్ 21న హఠాత్తుగా ప్రకటించింది. అక్టోబర్ 9–13 తేదీల మధ్య ఆ నిషేధం అమలు కాదు. నిజానికి సెప్టెంబర్ ఆరంభంలోనే హిల్సా ఎగుమతిని నిషేధిస్తూ ప్రొఫెసర్ మమహ్మద్ యూనస్ నాయకత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. దసరాలో తప్పనిసరిగా వంటకంగా ఉండే హిల్సా ఎగుమతిని పునరుద్ధరించమని ఎగుమతిదారులు చేసిన విన్నపాల మేరకు 3,000 టన్నుల హిల్సాను పంపాలని నిర్ణయించినట్టు బాంగ్లా వాణిజ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలియచేసింది. 2023 సంవత్సరంలో దసరా నవరాత్రుల సమయంలో దాదాపు 4000 టన్నుల హిల్సా చేపలను భారత్‌కు ఎగుమతి చేయడానికి 79 సంస్థలకు అవామీ లీగ్ అనుమతి ఇచ్చింది. 2012లో కూడా నిషేధం విధించినప్పటికి తరువాత కొద్దిపాటి ఎగుమతులకు అనుమతి ఇచ్చింది.

ఉరిమి ఉరిమి మంగలం మీద పడినట్టు అని సామెత. భారత్–బాంగ్లాల మధ్య అనూహ్యంగా వచ్చిన ఘర్షణ చివరికి హిల్సా ప్రియులను ఇలా కొద్ది సమయం హతాశులను చేసేసింది. దీని ధర విన్నా కూడా నోరు ఊరడం ఆగదట. ఇప్పుడు కిలో రూ. 2,200 నుంచి రూ. 2,400 వరకు పలుకుతున్నదట.

భారత్‌తో సత్సంబంధాలు కావాలని ఒక పక్క అంటూనే ముస్లిం మతోన్మాద పార్టీలు ఆడించినట్టు ఆడుతున్న బాంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం మొదట భారత్‌కు హిల్సా చేపల ఎగుమతినే నిషేధించింది. భారత్‌కు ఎగుమతి కాకపోతేనేం! బాంగ్లాదేశీయులకి కావలసినన్ని దొరుకుతాయి అంటున్నాడు ఆ దేశ మత్స్యశాఖ మంత్రి సలహాదారు ఫరీదా అఖ్తర్, బీబీసీతో మాట్లాడుతూ. షేక్ హసీనా ప్రభుత్వం పడిపోయిన తరువాత, అంటే దాదాపు నెల క్రితం

# చేపతో బాంగ్లా కప్పదాట్లు



తాత్కాలిక ప్రభుత్వం భారత్ మీద గుడ్డి ద్వేషం పెంచుకుంటున్నది. హసీనా ప్రభుత్వం ఉన్నంత వరకు దుర్గాపూజ రోజులలో హిల్సా చేపల ఎగుమతి మీద నిషేధం ఉండేది కాదు. ఆమె భారత్‌తో హిల్సా దౌత్యం నడిపారని అంటారు.

నిజానికి ఈ చేప ఎగుమతి మీద బాంగ్లాలో నిషేధం ఉంది. స్థానిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని బాంగ్లా 2012 నుంచి హిల్సా ఎగుమతిని నిషేధించింది. తక్కువ పరిమాణం ఉన్న హిల్సాలను కాపాడేందుకు కూడా ఈ

# తనదాకా వస్తే...




జనగణమన అధినాయక జయహే... అంటూ జాతీయగీతం ఆలపించే సమయంలో సగౌరవంగా లేచి నిలబడాలని తెలియని భారత్‌లోని పాక్‌ భక్తులకు ఇదొక పాఠం. జాతీయగీతాన్ని అవమానించడమే ధ్యేయంగా ప్రవర్తించే మతోన్మాదులకు కూడా ఇది కనువిప్పు. సెప్టెంబర్‌ 17వ తేదీన పాకిస్తాన్‌, అఫ్ఘానిస్తాన్‌ ప్రతినిధులతో పెషావర్‌లో ఒక గోష్టి జరిగింది. దాని పేరు రహమత్‌ ఉల్‌ అలామీన్‌. దీనికి అఫ్ఘాన్‌ దౌత్యప్రతినిధులు హాజరయ్యారు. పైగా ఇది ఈద్‌ ఇ మిలాదున్‌ నబి సందర్భంగా ప్రవక్త గౌరవార్థం ఏర్పాటైన కార్యక్రమం.

ఇదంతా సరే. పాకిస్తాన్‌ జాతీయగీతం ఆలపించినప్పుడు అఫ్ఘాన్‌ అధికారి హఫీజ్‌ మొహిబుల్లా షాకీర్‌, ఆయన సహచరులు లేచి నిలబడకుండా, ఆసనాలలో అలాగే కూర్చున్నారు. వెంటనే పాక్‌ విదేశ వ్యవహారాల కార్యాలయం, 'ఇది మా జాతీయగీతానికి అవమానం, అభిశంసించదగిన చర్య' అని ప్రకటించింది. ఆ రెండు దేశాల సంబంధాలు మున్నెన్నడూ లేని స్థాయిలో పతనమైన దశలో ఈ ఘటన జరిగింది.

పాకిస్తాన్‌లో ఉగ్రవాద చర్యలకు అఫ్ఘానిస్తాన్‌ ప్రోత్సహిస్తున్న తెహ్రీక్‌ ఇ తాలిబన్‌ పాకిస్తాన్‌ కారణమంటూ ఇటీవల తరచు పాకిస్తాన్‌ పొరుగు దేశాన్ని విమర్శిస్తున్న సంగతి తెలిసినదే. గత వారం కూడా ఖుర్రం జిల్లా పరిసరాలలో పాకిస్తాన్‌ రక్షణ దళాలకీ, అఫ్ఘాన్‌ దళాలకు మధ్య జరిగిన ఘర్షణలో అఫ్ఘాన్‌కు చెందిన ఎనిమిది మంది చనిపోయారు. అందులో ఇద్దరు ఉన్నతాధికారులు కూడా ఉన్నారు. 'ఆతిథ్య దేశ జాతీయగీతం ఆలపిస్తున్నప్పుడు ఇలా ప్రవర్తించడం పూర్తిగా దౌత్య మర్యాదలను ఉల్లంఘించడమే.

అందుకే అఫ్ఘానిస్తాన్‌ దౌత్య కార్యాలయం అభిశంసించదగిన చర్యకు పాల్పడిందని అనవచ్చు' పాకిస్తాన్‌ విదేశ వ్యవహారాల కార్యాలయం అధికార ప్రతినిధి ముంతాజ్‌ జహ్రా వ్యాఖ్యానించారు. ఈ అంశాన్ని పాకిస్తాన్‌ అటు అఫ్ఘాన్‌, ఇటు పాకిస్తాన్‌ ఉన్నత వర్గాల దృష్టికి తీసుకు వెళతామని కూడా ఆమె వెల్లడించారు. కాబట్టి షాకీరాను పాకిస్తాన్‌ వ్యతిరేకిగా ప్రకటించి వెంటనే దేశం నుంచి బహిష్కరించాలని కొందరు కోరారు. అసలు అఫ్ఘానిస్తాన్‌ అధికారులకు ఎందుకు ఆహ్వానం పంపారని ఈ గోష్టి నిర్వహించిన కేపీ ప్రభుత్వాన్ని కొందరు నిలదీస్తున్నారు. ★

---

నిర్ణయం తీసుకున్నారు. గడచిన సంవత్సరం దుర్గాపూజకు ముందు 3,950 మెట్రిక్‌ టన్నుల పద్మా హిల్సా రకం చేపలను భారత్‌కు ఎగుమతి చేయడానికి హసీనా ప్రభుత్వం ఆమోదించింది. కానీ ఈ ఏడాది కాస్త తక్కువగా హిల్సా చేరుతుంది.

హిల్సా (టెనులోసా ఇలిషా) చేపల ఎగుమతిలో బాంగ్లాకు చాలా పేరుంది. అక్కడ బాంగాళాఖాతంలోనే కాదు, కొన్ని నదులలో కూడా విరివిగా దొరుకుతుంది. పద్మ రకానికి రుచీ ఎక్కువే. అందుకే గిరాకీ. మనకు ఎగుమతి చేయడం లేదు సరే, అసలు బాంగ్లాలోనే 20 నదులలో వీటి ఉనికి లేకుండా పోయిందట. మన మీద కోపం కంటే, ఆ వాస్తవం గమనించడం బాంగ్లాకి మరీ ముఖ్యం. 17 సంవత్సరాల లెక్కలు తీస్తే హిల్సా లభ్యతలో 20 శాతం లోటు కనిపిస్తున్నది.

ఎగుమతులకు అడ్డంకులు ఉంటాయి గాని, జిహ్వా చాపల్యానికి ఎవరు అడ్డంకులు పెట్టగలరు? ఈ వాస్తవం మీద స్మగ్లర్లకి పరిజ్ఞానం చాలా ఉంటుంది కూడా. అందుకు బాంగ్లా హిల్సాలనే మైన్మార్‌ ద్వారానే కాదు, ఒడిశాలోని కొన్ని ప్రాంతాల నుంచి రహస్యంగా భారత్‌కు తీసుకువస్తున్నారు. అయినా టన్నుల కొద్దీ రావుకదా! ఈ చేపకి ఢిల్లీలో బాగా గిరాకీ. హిల్సా ప్రియుల ఖర్మ కాకపోతే ఈ ఏడాది పశ్చిమ బెంగాల్‌లో ప్రవహించే గంగానదిలో కూడా కూడా అవి తక్కువగానే దొరుకుతున్నాయట. అవైనా రెండు వందల నుంచి నాలుగు వందల గ్రాములే తూగుతున్నాయట. అంటే చిన్న వయసు. దీని వల్ల చాలా నష్టం జరుగుతుందని చెబుతున్నారు. వాటి సంఖ్య అనూహ్యంగా పడిపోయే ప్రమాదం ఉంది. ఈ చేప వేటకి చాలా ఖరీదైన, ప్రత్యేకమైన వలలే కావాలట.

హిల్సా వంటకం లేకపోతే బాంగ్లావాసులకు ముద్ద దిగదట. దానికి దాదాపు జాతీయమత్స్యం హోదా ఉంది. 4,50,000 మంది హిల్సా వేటతో జీవనం సాగిస్తారు. దీని ఎగుమతితో ఏటా 10 మిలియన్‌ డాలర్ల విదేశీ మారకం వస్తుంది. అటు సముద్రంలోను, ఇటు గంగలోను రెండు రకాలు దొరుకుతాయి. హిల్సాలు రాజకీయ దుమారం కూడా లేపాయి. 2021 ఎన్నికలలో బీజేపీ దాదాపు అసెంబ్లీలో పాగా వేస్తుందని అంతా ఆశించిన క్రమంలో అవకాశం కోల్పోయింది. దానికి హిల్సాతో బంధం పెడుతూ కొందరు తృణమూల్‌ కాంగ్రెస్‌ పార్టీ నాయకులు భాష్యం చెప్పారు. సాధారణ బెంగాలీ తినే అన్నంలోకి హిల్సా రాకుండా చేసిన కేంద్ర విధానమే వాళ్లని అధికారంలోకి రాకుండా చేసిందని ప్రచారం చేశారట. అసలు సంగతి అది కాదు. అప్పటికే కిలో హిల్సా రూ. 1500 కి చేరింది. ఇప్పుడు రూ. 2400. అసలు సామాన్యుడి కంచం నుంచి హిల్సా ఎప్పుడో ఎగిరిపోయిందనే అంతా చెబుతారు. ★





# విజయదశమి ఉత్సవం ముఖ్య అతిథి రాధాకృష్ణన్

సంఘ ఆవిర్భావ దినోత్సవం, విజయదశమి సందర్భంగా ఏటా నాగపూర్‌లో సంఘం నిర్వహించే ఉత్సవానికి ఈ సంవత్సరం ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) మాజీ చైర్మన్ డాక్టర్ కొప్పిళ్లిలి రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఈ విషయం ఆర్‌ఎస్‌ఎస్ ఎక్స్ ద్వారా వెల్లడించింది. అక్టోబర్ 12న ఈ కార్యక్రమం జరుగుతుంది. సంఘం నిర్వహించే కార్యక్రమాలలో విజయదశమి ఉత్సవానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. దీనిలో సర్‌సంఘచాలక్ డాక్టర్ మోహన్‌జీ భాగవత్ ప్రసంగిస్తారు.

ఆగస్ట్ 29,1949న కేరళలోని ఇరంజలకూడలో పుట్టిన కె. రాధాకృష్ణన్ కేరళ విశ్వవిద్యాలయం నుంచి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో పట్టా తీసుకున్నారు. తరువాత బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుంచి పీజీడీఎం పట్టా తీసుకున్నారు. 'సమ్ స్ట్రాటజీస్ ఫర్ ఇండియన్ ఎర్త్ అబ్జర్వేషన్ సిస్టమ్' అన్న అంశం మీద ఐఐటీ, ఖరగ్‌పూర్‌లో పరిశోధన చేశారు. ఇండియన్ నేషన్ అకాడెమి ఆఫ్ సైన్సెస్, ఇండియన్ నేషనల్ అకాడెమి ఆఫ్ ఇంజనీరింగ్‌లలో ఆయన సభ్యుడు. ఏవియోనిక్స్ ఇంజనీర్‌గా విక్రమ్ సారాభాయి సెంటర్‌లో సైంటిస్ట్‌గా జీవితం ప్రారంభించిన రాధాకృష్ణన్ ఇస్రోలో పలు ఉన్నత పదవులు నిర్వహించారు. విక్రమ్ సారాభాయి సెంటర్, ఇండియన్ నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీల సంచాలకునిగా ఆయన ఎన్నో విజయాలను సాధించారు.లిండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ వ్యవస్థాపక సంచాలకులుగా కూడా రాధాకృష్ణన్ సేవలు అందించారు. ఆయన వందలాది పురస్కారాలు పొందారు. 2014లో పద్మభూషణ్ పురస్కారానికి ఎంపికయ్యారు.

# వక్ఫ్ చట్ట సవరణే ప్రజల ఆకాంక్ష?





వక్ఫ్ చట్ట సవరణకు ఉద్దేశించిన బిల్లుకు సూచనలు, సలహాలు వెల్లువెత్తాయి. సంయుక్త పార్లమెంటరీ సంఘం పరిశీలనలో ఉన్న ఈ బిల్లు మీద సలహాలను ఆహ్వానించిన సంగతి తెలిసిందే. పెంచిన గడువు కూడా సెప్టెంబర్ 16వ తేదీతో వీటి గడువు ముగిసింది. గడువు ముగిసే సరికి 84 లక్షల సూచనలు ఈమెయిల్ ద్వారా వచ్చాయి. లిఖితపూర్వక సూచనలతో మరొక 70 వరకు పెట్టెలు చేరుకున్నాయి. వక్ఫ్ చట్ట సవరణ బిల్లు 2024కు సూచనలు, సలహాలు ఇవ్వవలసిందిగా సంఘం దేశ ప్రజలకు, సంస్థలకు పిలుపునిచ్చింది. బిల్లుతో సంబంధం ఉన్న అన్ని సంస్థల అభిప్రాయాలను పరిశీలిస్తామని సంయుక్త పార్లమెంటరీ సంఘం అధ్యక్షుడు జగదంబికా పాల్ మీడియాకు చెప్పారు. ఒక బిల్లుకు సంబంధించి 84 లక్షల సూచనలు రావడం భారతదేశ చరిత్రలో ఇదే ప్రథమమని ఆయన చెప్పారు. వక్ఫ్ ఆస్తుల గురించి, బిల్లు గురించి వివాదాస్పద ముస్లిం మత బోధకుడు జకీర్ నాయక్ (మలేసియాలో ఉంటాడు) వ్యాఖ్యలను జగదంబికా పాల్ ఖండించారు. అలాగే క్యూఆర్ కోడ్ మీద వస్తున్న వివాదాలతో తమకు సంబంధం లేదని కూడా ఆయన చెప్పారు. ఈ సవరణ బిల్లు ఇస్లాంకు వ్యతిరేకం అంటూ జరుగుతున్న ప్రచారాన్ని కూడా పాల్ ఖండించారు. ఏ అధికారంతో, హోదాతో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారని ఆయన వ్యాఖ్యానించారు. 1913 నుంచి వక్ఫ్ చట్టం అమలు అవుతున్నదనీ, దీనికి 1995, 2013 సంవత్సరాలతో సహా పలు పర్యాయాలు సవరణలు జరిగాయని పాల్ తెలియచేశారు. చట్టం పరిధిలో చేసిన 44 సవరణల గురించి వచ్చిన సూచనలను మాత్రమే పార్లమెంటరీ సంఘం పరిశీలిస్తుందని ఆయన స్పష్టం చేశారు. కమిటీ మొదట చాణక్య న్యాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ ఫైజన్ ముస్తాఫా వాదనలను వింటుంది. తరువాత పస్మంద ముస్లిం సంఘాలు, అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు ప్రతినిధుల వాదనలు వింటుంది. సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 1 వరకు కమిటీ క్షేత్రస్థాయి సమావేశాలు నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా ముంబై, అహమ్మదాబాద్, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వెళుతుంది. ఆ పర్యటనలలో వక్ఫ్‌కు చెందిన వారు, ముస్లిం పండితులు, న్యాయ వాదుల సంఘ ప్రతినిధులతో సమావేశాలు జరుపు తుంది. వక్ఫ్ సవరణ బిల్లు 2024, ముసల్మాన్ వక్ఫ్ (రద్దు) బిల్లు 2024ను ఆగస్ట్ 8న కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. తరువాత సభ్యుల నిరసనల మధ్య పార్లమెంటరీ సంఘానికి పంపింది. సామాజిక మాధ్య మాలలో వస్తున్న విశ్లేషణల ప్రకారం వక్ఫ్ బిల్లు సవరణకు అనుకూలంగా 90 శాతం భారతీయులు ఉన్నారు. ★

# ఆతిశి: అధికారం కంటె ముందు అపకీర్తి



ఢిల్లీ మూడో మహిళా ముఖ్యమంత్రిగా ఆతిశి మార్లెనా ప్రమాణ స్వీకారం చేశారు. ఆమె దేశంలో ఆ పదవిని చేపట్టిన 17వ ముఖ్యమంత్రి. సెప్టెంబర్ 21 శనివారం రాజ్‌నివాస్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆమె చేత ప్రమాణం చేయించారు. ఆమె ఎమ్మెల్యేగా ఎన్నికైన తొలిసారే ముఖ్యమంత్రి పదవి దక్కించుకున్నారు. వచ్చే ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతాయి. కాబట్టి ఆమె ఆరు మాసాలు మాత్రమే అధికారంలో ఉంటారు. నిజానికి తన పదవి ప్రభావం, పలుకుబడి ఎంతో అందరికంటే ఆతిశియే సరిగా అర్ధం చేసుకున్నట్టు కనిపిస్తుంది. అభినందన సభలో కూడా ఆమె మళ్లీ మనం అరవింద్ కేజ్రీవాల్‌ను ముఖ్య మంత్రి చేయడానికి శ్రమించాలని మాత్రమే చెప్పు కొచ్చారు. తన పదవి కేవలం అలంకార ప్రాయమని ఆమెకు తెలుసు. అసలే లెఫ్టినెంట్ గవర్నర్ ఆధిపత్యం. ఆరునెలల పదవీ కాలం. ఈ స్పృహ ఆమె ప్రతి మాటలోను ధ్వనిస్తున్నది. 17వ మహిళా ముఖ్యమంత్రి, ప్రస్తుతం మమతా బెనర్జీకితోడు ఆతిశి పదవీ స్వీకారం చేయడంతో ఇద్దరు మహిళా ముఖ్యమంత్రులు ఉన్నారు వంటి సంఖ్యాపరమైన చరిత్ర తప్పితే ఆమెకు ప్రత్యేకమైన గుర్తింపు ఏదీ ఎవరూ ఇవ్వడం లేదు. పైగా కుటుంబ నేపథ్యం ఆమెకు కొంత ఇబ్బంది కలిగించేదిగానే ఉంది. ఆమె ప్రమాణ స్వీకారం కంటే ముందు, ఆ అపకీర్తి దేశవ్యాప్తమయింది. ఒక మార్క్సిస్టును తీసుకు వచ్చి ఢిల్లీ సింహాసనం మీద ప్రతిష్ఠించారన్న విమర్శలు వచ్చాయి.

సెప్టెంబర్ 13న బెయిల్ పొందిన ఢిల్లీ ముఖ్య మంత్రి అరవింద్ కేజ్రీవాల్ బయటకు రాగానే ఢిల్లీ రాజకీయాలలో మళ్లీ హడావిడి మొదలయింది. తాను పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించి, సెప్టెంబర్ 17న లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాకు పత్రం సమర్పించారు. ఆయన స్థానంలో ఆతిశి మార్లెనాను ఆప్ శాసనసభా పక్షం ఎన్నుకుంది. కేజ్రీవాల్ మంత్రివర్గంలో ఆర్థిక, విద్యాశాఖలు సహా 14 శాఖలను నిర్వహించిన ఆతిశి మీద అనూహ్యంగా విమర్శలు వెల్లువెత్తాయి. ఆమె ఆతిశి మార్లెనా సింగ్‌గా ప్రసిద్ధురాలు. మార్లెనా అంటే. మార్క్సిస్టు లెనినిస్ట్. ఉన్నత విద్యావంతులైన ఆమె తల్లిదండ్రులు తృప్తా వాహి, విజయ్‌సింగ్ వివాదాస్పదులే. ఆతిశి ఆక్స్‌ఫర్డ్‌లో చదివారు. పార్లమెంట్‌పై దాడి కేసులో ఉరిశిక్ష పడిన అఫ్జల్ గురుకు అనుకూలంగా వినతిపత్రాలు పంపిన ఆతిశి తల్లిదండ్రులు, అదే కేసులో సుప్రీంకోర్టు విడుదల చేసిన ఎస్ఏఆర్ జిలానీతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారని ఆప్ రాజ్యసభ ఎంపీ స్వాతి మలైవాల్ తీవ్ర ఆరోపణ చేశారు. 2001 నాటి పార్లమెంట్ దాడి కేసులో విడుదలైన జిలానీ, 2016లో ఢిల్లీ ప్రెస్ క్లబ్‌లో అఫ్జల్ గురు స్మారక కార్యక్రమం నిర్వహించాడని స్వాతి గుర్తు చేశారు. ఆనాటి కార్యక్రమంలో ఆతిశి తల్లిదండ్రులు వేదిక మీదే ఉన్నారని కూడా స్వాతి ఆరోపించారు. ఒక అఫ్జల్ గురు మరణిస్తే లక్షల మంది అఫ్జల్ గురులు పుడతారంటూ, కశ్మీర్ స్వాతంత్ర్యం కోరుతున్నదంటూ ఆ ఇద్దరు వేదిక మీద నుంచి నినాదాలు చేశారని స్వాతి ఆరోపించారు. సయ్యద్ జిలానీ అరెస్ట్, చిత్రహింసలు పేరుతో ఆతిశి తల్లిదండ్రులు వ్యాసం కూడా రాశారని తెలియ చేశారు. ఇవన్నీ స్వాతి తన ఎక్స్ ఖాతాలో సెప్టెంబర్ 18న పోస్టు చేశారు. పార్లమెంట్ మీద దాడి చేసిన వ్యక్తికి అనుకూలంగా పోరాడిన కుటుంబం నుంచి వచ్చిన మహిళ దేశ రాజధాని ఢిల్లీకి ముఖ్యమంత్రి కావడం దురదృష్టమని స్వాతి వ్యాఖ్యానించారు. ఆతిశి నామమాత్రపు ముఖ్యమంత్రి మాత్రమే కావచ్చు. కానీ ఇలాంటి వారు ఆ పదవికి వస్తే దేశ భద్రతకు ముప్పు అని స్వాతి ఆరోపించారు. కాబట్టి ఢిల్లీని దేవుడే రక్షించాలి అని అన్నారామె. ★




## న్యాయవాదులు లేక...



సెప్టెంబర్ 14న నేషనల్ జుడీషియల్ డేటా గ్రిడ్ ఒక నివేదిక విడుదల చేసింది. దేశంలో కోర్టుల పరిస్థితి ఏమిటో ఇది తెలియచేస్తున్నది. దోషుల ఆచూకీ తెలియక దాదాపు 38 లక్షల కేసులలో జాప్యం జరుగుతున్నదట. తరువాత స్థానం సాక్షులు లేక నిలిచిపోయిన కేసులది. ఇలాంటి కేసులు 2,920,033. చాలా కారణాలతో ముందుకు కదలని కేసులు 2,462, 051. న్యాయవాదులు లేక జిల్లా కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసులు 66,59,565. అయితే మొత్తం అన్ని కోర్టులలోను పెండింగ్‌లో ఉన్న కేసులు కోట్లలోనే ఉంది.

# రాజకీయ ఇస్లాంతో కేరళకు ముప్పే: సీపీఎం నేత

వాస్తవం వెలుగు చూడడం కాస్త ఆలస్యం కావచ్చు. కానీ సత్యమే గెలుస్తుంది. సత్యం చీకట్లో ఉండలేదు. కేరళలో రాజకీయ ఇస్లాం యువతను ఉగ్రవాదం వైపు నెట్టే ప్రయత్నం చేస్తున్నదనీ, ఐఎస్ఐఎస్‌లోకి సభ్యులను నియమించుకునే పనిలో ఉన్నదనీ సాక్షాత్తు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు, కన్నూర్‌లో విశేష రాజకీయ పలుకుబడి కలిగిన పి. జయరాజన్ కుండ బద్దలు కొట్టారు. అధికార పార్టీ సభ్యుడు చేసిన వ్యాఖ్య రాష్ట్రంలో దుమారం లేపుతున్నది. స్థానిక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో జయరాజన్ తీవ్ర వ్యాఖ్యలే చేశారు. రాజకీయ ఇస్లాం ఉగ్రవాదం వైపు యువతను ఆకర్షిస్తున్నదని, అందుకే అది రాష్ట్రానికి పెద్ద బెడద అని అన్నారు. రాబోయే తన పుస్తకం గురించి కొన్ని మాటలు చెబుతూ ఆయన వ్యాఖ్యలు చేశారు. ముస్లిం రాజకీయాలకీ, రాజకీయ ఇస్లాంకీ చాలా తేడా ఉందని ఆయన సూత్రీకరించారు. ముస్లిం రాజకీయాలు మైనారిటీలను నడిపించేవనీ, రాజకీయ ఇస్లాం ప్రమాదకరమని ఆయన చెప్పారు. కేరళలో జమాత్ ఏ ఇస్లామి, పాప్యులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా వంటి సంస్థలు రాజకీయ ఇస్లాం అనే ప్రమాదకర సిద్ధాంతాన్ని అనుసరిస్తున్నాయని ఆయన తేల్చి చెప్పారు (కానీ పాప్యులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియాను నిషేధిస్తే దానికి ఆమోద ముద్ర వేయడానికి సీపీఎం ప్రభుత్వం మీనమేషాలు లెక్కించింది. పైగా విశ్వ హిందూ పరిషత్‌ను కూడా నిషేధించాలని ఒక వికృత వాదన తెచ్చింది). కన్నూర్ నుంచి కొంతమందిని ఐఎస్ఐఎస్‌లో చేర్చారని, వారు సిరియా, అఫ్ఘానిస్తాన్‌లకు వెళ్లారని జయరాజన్ ఆరోపించారు. కశ్మీర్ ఉగ్రవాదులతో చేరిన నలుగురు, సైన్యం జరిపిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన సంగతి కూడా



వెల్లడించారు. ఈ అంశాన్ని పెద్దదిగా చేసిన చూపించడం తన ఉద్దేశం కాదని, రాజకీయ ఇస్లాం ప్రభావం రాష్ట్ర యువత మీద ఉందన్నది నిజమని ఆయన అన్నారు. అయితే బాబ్రీ మసీదు పతనం తరువాత తలెత్తిన సామాజిక పరిణామాల నేపథ్యంలో ఇది జరిగిందని ఆయన ముక్తాయించారు. సీపీఎం నేత వ్యాఖ్య దక్షిణాది రాష్ట్రాలలోనే పెద్ద చర్చకు తావిచ్చింది. కొన్నేళ్లుగా ఆర్ఎస్ఎస్, బీజేపీలతో పాటు కొన్ని క్రైస్తవ సంస్థలు ఇదే విషయాన్ని బహిరంగంగా చెబుతూనే ఉన్నాయి. ఆఖరికి కేరళ స్టోరీ అనే చలనచిత్రం కూడా ఈ అంశాన్ని కొంతవరకు చర్చించింది కూడా. అయినా ఎవరూ అంగీకరించడానికి ముందుకు రాలేదు. కనీసం ఆ అంశాన్ని గుర్తించడం కూడా చాలామందికి ఇష్టం లేదు. నిజానికి జయరాజన్ కూడా కేరళ స్టోరీలో చూపించింది పాక్షిక సత్యాలు మాత్రమేనని కొట్టి పారేసినప్పటికీ అందులో చూపించిన ఐఎస్ఐఎస్ లోకి యువకులను చేర్పించే సన్నివేశాలు మాత్రం సత్యమేనని అంగీకరించారు. యథాప్రకారం లెఫ్ట్ డెమాక్రటిక్ ఫ్రంట్ కన్వీనర్ ఈపీ జయరాజన్ మాత్రం తమ పార్టీ సీనియర్ నేత జయరాజన్ ప్రకటనను ఖండించారు. అసలు కేరళలో ఉగ్రవాదులు తమ కార్యకలాపాలను విస్తరించే అవకాశమే లేదని ప్రగల్భించారు. రాష్ట్రంలో ఉగ్రవాదం ప్రబలకుండా ప్రభుత్వం పరమ జాగరూకతతో వ్యవహరిస్తున్నదని ఆయన చెప్పుకున్నారు.

అధికార పార్టీకి చెందిన ఒక సీనియర్ నాయకుడు ఇలాంటి వ్యాఖ్య చేయడం తీవ్రమైన అంశమని రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ వ్యాఖ్యానించారు. తనకు కూడా ఈ విషయం పూర్తిగా తెలియకపోయినా, ప్రముఖ నాయకుడు వెలువరించిన అభిప్రాయం మేరకు ఈ అంశాన్ని లోతుగా పరిశీలించాలని గవర్నర్ అన్నారు. సీపీఎం నేత ప్రకటనకు ఆధారం ఏమిటో చూసి, ఈ సమస్య పరిష్కారానికి ప్రయత్నించాలని అన్నారు. శాసనసభలో ప్రతిపక్ష నేత వీడీ సతీశన్ మాట్లాడుతూ జయరాజన్ చేసిన వ్యాఖ్యలు చాలా తీవ్రమైనవని చెప్పారు. ఒకవేళ నిజంగానే కేరళ ఐఎస్ఐఎస్ నియామకాలకు కేంద్రంగా ఉంటే, అందుకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని సతీశన్ అభిప్రాయపడ్డారు. కన్నూర్ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సొంత ప్రాంతం కాబట్టి ఈ అంశాన్ని మరింత లోతుగా ఆలోచించాలని అన్నారాయన. జయరాజన్ వ్యాఖ్యను సీపీఎం సమర్థిస్తున్నదా లేదా అనే అంశాన్ని వెంటనే నిర్ధారించాలని సతీశన్ అన్నారు. కేథలిక్ చర్చ్ పత్రిక దీపిక జయరాజన్ ప్రకటనను స్వాగతించింది. ★

# మార్క్సిజం.. మత విశ్వాసం



కేరళ సీపీఎం నాయకుడు ఎంఎం లారెన్స్ (91)సెప్టెంబర్ 21న కన్నుమూశారు. వయసులో పెద్దవాడు పోయాడు. అయితే ఇప్పుడు ఆయన భౌతికకాయాన్ని అట్టే పెట్టవలసిందని కేరళ హైకోర్టు ఆదేశాలు ఇవ్వడమే కొసమెరుపు. ఆయన కుమారుడు ఎంఎల్ సంజీవ, ఒక కూతురు సుజాత బోబన్ తండ్రి మృతదేహం ప్రయోగాల కోసం ప్రభుత్వ వైద్య కళాశాలకు ఇవ్వాలని అనుకున్నారు. ఇక సీపీఎం శ్రేణుల సంగతి సరేసరి. కానీ ఆయన మరొక కుమార్తె ఆశా ఇందుకు అభ్యంతరం చెప్పారు. ఈ క్రమంలో ఆమె సీపీఎం కార్యకర్తలతో భౌతిక ఘర్షణకు కూడా దిగారు. అయినా పోలీసులు భౌతికకాయాన్ని ఎర్నాకులం వైద్య కళాశాలకు తరలించారు. తన తండ్రి అంత్యక్రియలు క్రైస్తవ సంప్రదాయం ప్రకారం జరగాల్సిందేనని పట్టుపట్టి, ఆశా ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర ధర్నా చేసి, హైకోర్టు నుంచి స్టే తెచ్చారు. తన ఇద్దరి తోబుట్టువుల నిర్ణయం తన తండ్రి ఇష్టానికి వ్యతిరేకమేనని కూడా చెప్పారు ఆశా. తన తండ్రి చర్చి సంరక్షణ సంఘంలో సభ్యుడని అసలు విషయం చెప్పారు. తన తోబుట్టువుల పెళ్లిళ్లు చర్చిలోనే జరిగాయని, తమ తల్లిని కూడా చర్చి శ్మశాన వాటికలోనే పూడ్చిపెట్టారని ఆశా గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో లారెన్స్ మృతదేహాన్ని తరువాతి ఆదేశాలు ఇచ్చేవరకు ఆసుపత్రి మార్చురీలోనే ఉంచవలసిందని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి మార్క్సిస్టుల మత వ్యతిరేకత ఉపన్యాసాల వరకే. ఇంట్లోకి అది రాదు. ★

భారతహాకీకి మళ్లీ మంచిరోజులొచ్చాయి. అంతర్జాతీయ హాకీలో భారత్ విజయపరంపర అప్రతిహతంగా కొనసాగుతోంది. గత ఐదేళ్లుగా అత్యంత నిలకడగా రాణిస్తున్న ఏకైక జట్టుగా భారత్ నీరాజనాలు అందుకొంటోంది.






# అంతర్జాతీయ హాకీలో భారత్ జైత్రయాత్ర!

ఫీల్డ్ హాకీ క్రీడకు చిరునామా భారత్. ఒలింపిక్స్ చరిత్రలోనే అత్యధికంగా ఎనిమిది బంగారు పతకాలు సాధించిన ఏకైకజట్టు భారత్ మాత్రమే. పాకిస్థాన్, కొరియా, జపాన్, మలేసియా, జపాన్ లాంటి పటిష్టమైన ప్రత్యర్థి జట్లున్న ఆసియా హాకీలో భారత్‌దే పైచేయిగా ఉంటూ వస్తోంది. 1980 మాస్కో ఒలింపిక్స్‌లో చివరిసారిగా బంగారు పతకం గెలుచుకొన్న భారత్ ఆ తరువాత ఒలింపిక్స్‌లో మరో పతకం కోసం నాలుగు దశాబ్దాల పాటు ఎదురు చూడాల్సి వచ్చిందంటే అంతర్జాతీయ హాకీలో పోటీ ఎంత అత్యుత్తమ స్థాయిలో ఉందో మరి చెప్పాల్సిన పనిలేదు. ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్, జర్మనీ, స్పెయిన్, అర్జెంటీనా, ఇంగ్లండ్, న్యూజి లాండ్, పాకిస్థాన్ జట్ల ఆధిపత్యానికి అడ్డుకట్ట వేయడానికి భారత హాకీ గత నాలుగు దశాబ్దాలుగా అంతులేని పోరాటమే చేయాల్సి వచ్చింది.

### 12వ ర్యాంక్ నుంచి 4వ ర్యాంక్‌కు....

ఒక దశలో ప్రపంచ 12వ ర్యాంక్‌కు దిగజారి పోయి.. ఒలింపిక్స్‌కు అర్హత సాధించడమే కనాకష్టంగా మారిన స్థితి నుంచి గత దశాబ్దకాలంలో 4వ ర్యాంక్‌కు చేరటానికి భారత్ అంతులేని పోరాటమే చేయాల్సి వచ్చింది. ఒలింపిక్స్ నుంచి ఆసియా చాంపియన్స్ ట్రోఫీ వరకూ విశ్వవిఖ్యాత అంతర్జాతీయ పోటీలలో అత్యంత నిలకడగా రాణిస్తూ వస్తున్న ఏకైక ఆసియా జట్టు భారత్ మాత్రమే.

ఆసియా హాకీలో భారత చిరకాల ప్రత్యర్థులుగా ఉన్న పాకిస్థాన్, దక్షిణ కొరియా, మలేసియా, జపాన్ జట్లు ర్యాంకింగ్స్‌లో దిగజారిపోతూ వస్తుంటే.. భారత్ మాత్రం సీజన్ సీజన్‌కూ తన ర్యాంకును మెరుగు పరచుకొంటూ వచ్చింది.

### ఒలింపిక్స్ లో వరుసగా రెండు కాంస్యాలు..

టోక్యో వేదికగా ముగిసిన 2020 ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలుచుకొన్న భారత్ ఇటీవలే ముగిసిన 2024 పారిస్ ఒలింపిక్స్‌లో సైతం కంచుపతకాన్ని నిలుపుకోవడం ద్వారా సత్తా చాటుకోగలిగింది. అంతేకాదు..ప్రపంచ హాకీ దిగ్గజం ఆస్ట్రేలియాపై నాలుగు దశాబ్దాల విరామం తరువాత తొలివిజయం సాధించడం ద్వారా తానేమిటో నిరూపించుకొంది.

ఆసియాక్రీడల్లో బంగారు పతకం, కామన్వెల్త్ గేమ్స్ లో రజత పతకం నెగ్గిన భారత్..ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో సైతం తిరుగులేని విజయాలతో తనకుతానే సాటిగా నిలిచింది.

పారిస్ ఒలింపిక్స్ ముగిసిన కొద్దిరోజుల వ్యవధిలోనే చైనా వేదికగా జరిగిన 2024 ఆసియా చాంపియన్స్ ట్రోఫీ టోర్నీలో భారత్ ఏడుకు ఏడుమ్యాచ్‌లు నెగ్గడం ద్వారా తిరుగులేని విజేతగా చరిత్ర సృష్టించింది.

### ఏడు టోర్నీలలో ఐదు స్వర్ణాలు...

ఆసియా ఖండంలోని అగ్రశ్రేణి జట్ల నడుమ జరిగే చాంపియన్స్ ట్రోఫీ పరంపరలో భాగంగా 2011 నుంచి 2024 వరకూ జరిగిన మొత్తం ఏడు టోర్నీలలో భారత్ ఆరుసార్లు ఫైనల్స్ చేరడంతో పాటు ఐదుసార్లు విజేతగా నిలిచిన తొలి, ఏకైక జట్టుగా రికార్డు నెలకొల్పింది. ఆసియా చాంపియన్స్ ట్రోఫీ టోర్నీ చరిత్రలో భారత్ 2018 నాటికే మూడుసార్లు విజేతగా నిలిచింది. 2011, 2016లో చాంపియన్స్ ట్రోఫీ విన్నర్ గా నిలిచిన భారత్ 2018 పాకిస్థాన్ తో కలసి సంయుక్త విజేతగా నిలిచింది.

2021 చాంపియన్స్ ట్రోఫీ టోర్నీలో సెమీస్ దశలోనే జపాన్ చేతిలో ఓటమి పొందిన భారత్ కాంస్య పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఐదేళ్ల విరామం తర్వాత తిరిగే విజేతగా నిలువగలిగింది.

ఆసియా చాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో నాలుగుసార్లు విజేతగా నిలిచిన ఏకైక జట్టుగా భారత్ సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఆరు జట్ల రౌండ్ రాబిన్ లీగ్ లో మలేసియా, జపాన్, కొరియా, చైనా, పాకిస్థాన్ జట్లను చిత్తు చేసిన భారత్ సెమీఫైనల్లో దక్షిణ కొరియాను, ఫైనల్లో చైనాను ఓడించడం ద్వారా రికార్డుస్థాయిలో ఐదోసారి ఆసియా చాంపియన్స్ ట్రోఫీ విజేతగా రికార్డుల్లో చేరింది.

భారతజట్టు 2011 , 2016, 2018, 2021, 2024 టోర్నీలలో బంగారు పతకాలు అందుకో గలిగింది.

### హర్మన్ ప్రీత్ నాయకత్వంలో...

టోక్యో ఒలింపిక్స్ వరకూ భారతజట్టుకు మిడ్ ఫీల్డర్ మన్ దీప్ సింగ్ నాయకత్వం వహించడం ద్వారా పటిష్టమైన జట్టుగా తీర్చి దిద్దాడు. ఆ తరువాత మన్ దీప్ నుంచి డ్రాగ్ ఫ్లిక్ స్పెషలిస్ట్ హర్మన్ ప్రీత్ సింగ్ భారతజట్టు నాయకత్వ బాధ్యతల్ని స్వీకరించి విజయపథంలో నడిపిస్తూ వస్తున్నాడు. పెనాల్టీ కార్నర్లను గోల్స్‌గా మలచడంలో ప్రపంచమేటిగా పేరుపొందిన హర్మన్ ప్రీత్ నైపుణ్యం కారణంగానే భారత్ గత రెండు ఒలింపిక్స్‌లోనూ పతకాలు అందుకోగలిగింది. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో అత్యధికగా 10 గోల్స్ సాధించిన ఒకే ఒక్కడు భారత కెప్టెన్ హర్మన్ ప్రీత్ మాత్రమే. ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో సైతం హర్మన్ ప్రీత్ అత్యుత్తమంగా రాణించడం ద్వారా ఉత్తమ ఆటగాడి అవార్డుకు ఎంపికయ్యాడు. ఏడుమ్యాచ్‌ల్లో భారతజట్టు సాధించిన మొత్తం 26 గోల్స్‌లో పెనాల్టీ కార్నర్ల ద్వారా హర్మన్ ప్రీత్ సాధించినవే ఏడు గోల్స్ వరకూ ఉన్నాయి. లాస్‌ఏంజెలిస్ వేదికగా జరిగే 2028 ఒలింపిక్స్‌లో స్వర్ణపతకం సాధించడమే లక్ష్యంగా భారత్ వచ్చే నాలుగు సంవత్సరాల పాటు తన పోరాటం కొనసాగించనుంది. అత్యున్నత స్థాయికి చేరుకోడం ఎంత కష్టమో.. ఆ స్థాయిని నిలుపు కోవడానికి అంతకు మించి కష్టపడాలని చెబుతున్న హర్మన్ ప్రీత్ నాయకత్వంలో భారత హాకీ సురక్షితంగా ఉంటుందనడంలో ఏ మాత్రం సందేహంలేదు.



**కృష్ణారావు చొప్పరపు**
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969



# దామగుండం క్షేత్రాన్ని రక్షించుకుందాం



దామగుండ క్షేత్రంలో
మహావిష్ణువు వాహనం గరుడుడు

శైవక్షేత్రాలలో ఆరాధ్యదైవం శివుడు. ఇది సర్వ సాధారణమైన విషయం. కానీ వికారాబాద్ జిల్లా, పూడూరు మండలంలో వెలసిన అతి ప్రాచీన ఆలయం శ్రీరామలింగేశ్వరస్వామివారి ఆలయం. దామగుండమనే క్షేత్రంలో ఉంది. ఆలయ ప్రధాన ద్వారం ఎదుట గరుత్మంతుడు వెలిశాడు. ఆయన శ్రీమహావిష్ణువు వాహనం. ఇదీ దామగుండం ప్రత్యేకత. అందుకే ఈ క్షేత్రాన్ని విష్ణుభగవానునితో అనుసంధానమైన శ్రీరామలింగేశ్వర క్షేత్రమంటూ స్కందపురాణంలో ప్రస్తావించారు.

**స్థలపురాణం :**

స్కందపురాణంలో సనత్కుమారుడు నారద మహర్షికి ఈ స్థల మహాత్మ్యాన్ని వివరించినట్లు కనిపిస్తుంది. తదనుసారం దీన్ని 'విభాండక క్షేత్ర'మని కూడా వ్యవహరిస్తారు. రామాయణ కాలంలో విభాండక రుషి దశరథునితో పుత్రకామేష్ఠి యజ్ఞాన్ని జరిపించి, తర్వాత 'దామగుండ' క్షేత్రంలో తపస్సు చేశాడట. ఈయన కుమారుడే రుష్యశృంగుడు. ఈ క్షేత్రంలోని సరోవరాన్ని 'దామ సరోవరం' అని పిలుస్తారు. మరో పౌరాణిక నామం నీలకంఠాశ్రమం. మార్కండేయ మహర్షితో సహా ఎందరో రుషులు ఈ క్షేత్రంలో తపస్సు చేశారని పురాణగాథ. ఇక్కడే మార్కండేయ గుహ ఉన్నది.

పురాతన కాలంలో ఇక్కడ 'ఇసుక'తో కూడిన శివలింగం ఉండేది. దీనినే విభాండక మహర్షి పూజించేవాడని చెబుతారు. శ్రీరామచంద్రుడు ప్రతిష్ఠించిన కోటిలింగాల్లో ఇదొకటి. ఆలయ జీర్ణోద్ధరణ కూడా 1665లో కాకతీయ రాజుల కాలంలో జరిగినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. దామసరోవరం, ఉత్తరాన బ్రహ్మ సరోవరం, వాణీ సరోవరం ఉన్నట్లు పురాణాలు చెబుతున్నాయి.

ఈ క్షేత్రంలో దాముడు, గుండుడు అనేవారు వసించినట్లు, వారి వ్యవసాయ క్షేత్రాల్లో శిలారూపంలో లింగం లభించడం, దాన్ని వారు ఈ క్షేత్రంలో ప్రతిష్ఠించడం వల్ల దామగుండం పేరుతో ఖ్యాతి గాంచింది. ఇది స్వయంభూలింగం. దామగుండం, భైరవ క్షేత్రం, అనంతగిరి, రాకమచర్ల, లొంక ఆంజనేయ /శివక్షేత్రాలను (పరిగి దగ్గర) పంచారామ క్షేత్రాలుగా పిలుస్తారు. దామగుండం క్షేత్ర సమీపంలో భైరవ క్షేత్రం ఉంది. ఈ క్షేత్రాల్లో శివదర్శనం, పూజలు గావించినవారికి పిశాచాది, ఈతిబాధలు తొలుగుతాయని భక్తుల విశ్వాసం. చుట్టూ దట్టమైన అడవులు ప్రశాంతమైన స్థలంలో ఈ ప్రాచీన ఆలయాలు వెలిశాయి.

ఈ క్షేత్రంలో శ్రావణమాసంలో సోమవారాలు, శివరాత్రి పర్వదినాలు, ఫాల్గుణ బహుళ దశమి

నుండి ఉగాది వరకు ప్రత్యక్ష పూజలు జరుగుతాయి. వేలాదిమంది భక్తుల దర్శిస్తారు.

ఫాల్గుణ మాసంలో బహుళ దశమి నుండి అయిదురోజులు రథోత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంలో ఉత్సవ విగ్రహాలు ఇక్కడ ఉంచుతారు.

ఈ శైవక్షేత్రం ప్రకృతి రామణీయకత మధ్య, దట్టమైన అటవీ ప్రాంతంలో ఉంది. ఈ రామలింగేశ్వరా లయాన్ని ఇటీవలి కాలంలో ఇక్కడ నుంచి తరలించాలన్న ప్రభుత్వ యత్నాన్ని స్థానికులు అడ్డుకున్నారు. ప్రతి సంవత్సరం ఉగాది పర్వదిన సందర్భంలో ఉత్సవాలు జరుగుతుంటాయని ఆలయంలోని కొలను (గుండం) ఎల్లప్పుడూ నీటిలో కళకళలాడుతుందనీ, ఇక్కడి అయిదు నీటిగుండాలు వేసవిలోనూ యాత్రికులను ఆదుకుంటూ ఉంటాయి. అందువల్ల ఈ పుణ్య క్షేత్రానికి ప్రాముఖ్యం ఏర్పడింది.

అయితే ఇక్కడి అటవీప్రాంతానికి చెందిన మూడువేల ఎకరాల భూముల్లో నావికాదళానికి చెందిన రాడార్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడం వల్ల ఈ ప్రసిద్ధ ఆలయానికి ముప్పు ఏర్పడనుంది. ఇందువల్ల పన్నెండు లక్షల చెట్లు నిర్మూలించక తప్పదని చెబుతున్నారు. దీనివల్ల పర్యావరణ సమతుల్యతకు విపరీతమైన నష్టం జరుగుతుంది. ప్రాచీన రామలింగేశ్వర ఆలయానికి భక్తుల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుందనటంలో ఎలాంటి సందేహంలేదు.

నేటి వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి, దామగుండం, రాకమచర్ల అటవీ క్షేత్రాలు, ప్రకృతి రామణీయతకు ఆధ్యాత్మిక వాతావరణానికి ప్రతీకలు. అనంతగిరి పద్మనాభస్వామి ఆలయం, దామగుండం శ్రీరామలింగేశ్వర ఆలయం రాకమచర్ల శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయాలను కలుపుతూ 'యాత్రా సర్క్యూట్' ఏర్పాటు చేస్తే ఈ వెనుకబడిన ప్రాంతంలో యాత్రతోపాటు, ఆహ్లాదకరమైన, ఆధ్యాత్మిక ఆనందాన్ని ఈ క్షేత్ర సందర్శనం కల్గిస్తాయి. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించి, టూరిజం అభివృద్ధికి తోడ్పడతారని ఆశిద్దాం.




**ఆచార్య మత్స్యరాజ హరగోపాల్**

hargopal33@yahoo.com




# ఇకనైనా స్వాతంత్ర్య సమరంలో సాయుధ పోరాట చరిత్రను నమోదు చేద్దాం!



హిందోళ్ సేన్‌గుప్తా

భారత స్వాతంత్ర్య సమర చరిత్ర రచనలోని ఒక ప్రధాన లోపాన్ని ఎత్తి చూపారు చరిత్రకారుడు, రచయిత హిందోళ్ సేన్‌గుప్తా. స్వరాజ్య సమరంలో అహింసా వాదంతో సాగిన ఘట్టాలను నమోదు చేసినట్టే, సాయుధ పంథాలో వెళ్లినవారి చరిత్రను కూడా నమోదు చేయవలసిన అవసరం వచ్చిందని, ఆ పంథాలో నడిచిన ఎందరో మహనీయులు ఉన్నారని సేన్‌గుప్తా స్పష్టం చేశారు. 'ది ఆర్ట్ ఆఫ్ బయోగ్రఫీ, నోయింగ్ లిమిట్స్' అన్న అంశం మీద ఆయన సెప్టెంబర్ 22న ఒడిశా సాహిత్య సమ్మేళనంలో ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ది సండే స్టాండర్డ్ కన్సల్టింగ్ ఎడిటర్ రవిశంకర్ ఎటీత్ అధ్యక్షత వహించారు. అటు సాయుధ పథంలోను, ఇటు అహింసా పథంలోను నడిచిన అరవిందులు వంటి మహనీయులు మన చరిత్రలో అరుదుగా తారసిల్లుతారని ఆయన గుర్తు చేశారు. ప్రొఫెసర్ హిందోళ్ జిందాల్ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎఫైర్స్‌లో పనిచేస్తున్నారు. ఉప్పు సత్యాగ్రహంతో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పడం వాస్తవం కాదని 'ది మ్యాన్ హూ సేవ్డ్ ఇండియా', 'బీయింగ్ హిందూ' పుస్తకాల రచయిత సేన్‌గుప్తా స్పష్టం చేశారు. ది మ్యాన్ హూ సేవ్డ్ ఇండియా గ్రంథం సర్దార్ పటేల్ జీవిత చరిత్రను ఆవిష్కరిస్తుంది. ది మోడరన్ మాంక్ అన్న హిందోళ్ పుస్తకం స్వామి వివేకానందుని గురించి చర్చించింది. లైఫ్, డెత్ అండ్ అష్టావక్రగీత, సోల్ అండ్ స్వోర్డ్, రీక్యాస్టింగ్ ఇండియా, సేక్రెడ్ స్వోర్డ్, సింగ్ డ్యాన్స్ అండ్ ప్రే వంటి పుస్తకాలు కూడా హిందోళ్ వెలువరించారు. బ్రిటిష్ వారు దేశం నుంచి ఎందుకు నిష్క్రమించారో వాస్తవికంగా ఆలోచించడం అవసరమని కూడా ఆయన అన్నారు. రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత ఇంగ్లండ్ పరిస్థితి ఎంతో దిగజారిపోయింది. బొంబాయి తీరంలో కూడా తాము ఓడలను నిలిపి ఉంచలేమన్న వాస్తవం వారి అర్థమైంది. ఇంకా చెప్పాలంటే వారు దేశం నుంచి నిష్క్రమించడానికి ముందుగా నిర్ణయించిన తేదీని ముందుకు జరిపి మరీ వెళ్లిపోయారని హిందోళ్ సేన్‌గుప్తా విశ్లేషించారు.

స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ పాత్రను ఎవరూ తక్కువ చేయలేరని, ఆనాటి కాలంలో ఆయన సందేశం ఎంతో ప్రభావం చూపిన మాట నిజమని, అలాగే కాంగ్రెస్ పార్టీ స్వతంత్రం కోసం ఎంతో కృషి చేసిందని అంటూనే హిందోళ్, దీని వెనుక ఆంతర్యాన్ని నమోదు చేసే సమయంలో చరిత్రకారులు మరింత వాస్తవికంగా వ్యవహరించాలని అభిప్రాయపడ్డారు.

దేశ చరిత్రలోని కొన్ని అంశాల పట్ల భారతీయులు ఎంతో ఉత్సుకతతో ఉన్నారని హిందోళ్ చెప్పారు. అందులో డచ్ ఈస్టిండియా కంపెనీని కకావికలు చేసిన వారిలో రాజా మార్తాండవర్మ ఒకరని గుర్తు చేశారు. కలైకాల్ యుద్ధంలో డచ్ ఈస్టిండియా కంపెనీ ఓటమి పాలు కావడం పెద్ద చారిత్రక అంశమని, ఆ యుద్ధంలో ఒక పెద్ద ఐరోపా శక్తి మోకరిల్లిందని హిందోళ్ చెప్పారు. కానీ ఈ చరిత్రను మన దేశంలో బోధించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తన చరిత్ర తనకు తెలియనప్పుడు భారత్ పురోగమనానికి సంబంధించి పటిష్టమైన వ్యూహం కలిగి ఉండడం కష్టమని ఆయన చెప్పారు. భారతదేశంలో చరిత్ర రచనను చాలావరకు స్థల పురాణాల రచన మాదిరిగా మార్చేశారని, లేదంటే చరిత్ర పురుషుల శీల హననం చేశారని హిందోళ్ ఆరోపించారు. జీవితచరిత్రల రచనలో ప్రయోజనాత్మక దృష్టి ఉండాలని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ★

# బాల జాగృతి

## తెలుసుకుందాం

## లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం - పెన్న అహోబిలం



ఏపీలోని అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం పెన్న అహోబిలంలోని పెన్నా నది తీరంలో వెలసిన ఆలయమిది. ఈ ఆలయం అనంతపురం నుంచి 41 కిలోమీటర్లు, ఉరవకొండ నుంచి 12 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. 5 అడుగుల 3 అంగుళాల కొలత గల లక్ష్మీ నరసింహ స్వామి పాదముద్రపై ఈ ఆలయాన్ని నిర్మించారు. ఇది వివాహ వేడుకలకు పేరొందిన ప్రదేశం. స్వామివారిని దర్శించుకునేందుకు ఇక్కడికి నిత్యం ఎంతో మంది భక్తులు వస్తుంటారు.

## కథ | తోడేలు- కోతి



అనగనగా ఒక అడవి.. ఆ అడవిలో తోడేలు, కోతి ఎంతో స్నేహంగా ఉండేవి.

తోడేలుకు ఒకరోజు మేక మాంసం తినాలనిపించింది.

అడవి పక్కనున్న గ్రామంలో చాలా మేకలు ఉండడం గమనించింది.

రాత్రి అందరూ పడుకున్న సమయంలో ఊళ్లోకి వెళ్లి మేకను ఎత్తుకుపోయేది.

ఇలా రోజుకో మేకను తెచ్చుకుని తినేది.

ఇదంతా గమనించిన కోతి.. రోజుకో మేకను ఎలా తెచ్చుకుంటున్నావని అడిగింది.

దానికి ఆ తోడేలు.. ఈ రోజు రాత్రి నువ్వు కూడా

## పద్యం

స్థానము తప్పివచ్చునెడఁ దానెటువంటి బలాఢ్యుడున్ నిజ
స్థానికుడైన యల్పుని కతంబుననైనను మోసపోవుగా
కానలలోపలన్ వెడలి గందగజం బొకనాఁడు నీటిలో
గానక చొచ్చినన్ మొసలికాటున లోఁబడ కున్నె భాస్కరా!

**భావం :** భాస్కరా! మదించిన ఏనుగు అడవిని వదిలి నీటియందు ప్రవేశము గల్గిన తోడనే మొసలికి లొంగిపోయినది గదా! అలాగే మానవుడెంత బలము గల వాడైననూ తన స్థానమును విడిచి, అన్య స్థానమును చేరినచో బలము తగ్గి పరాభవములు పొందునని భావం.

## శ్లోకం

రత్నాకరా ధౌతపదాం హిమాలయ కిరీటినీమ్
బ్రహ్మ రాజర్షి రత్నాఢ్యాం వందే భారత మాతరమ్

**భావం:** రత్నాకరుడైన సముద్రుడు కాళ్లు కడుగుతుండగా, హిమాలయ పర్వతం కిరీటంగా కలిగి, బ్రహ్మర్షులు, రాజర్షులు అనే రత్నాలతో నిండిన భారతమాతకు నమస్కరిస్తున్నాను.

## జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| అనిల్ కుంబ్లే | ఆస్ట్రేలియా |
| షేన్ వార్న్ | పాకిస్తాన్ |
| జయసూర్య | న్యూజిలాండ్ |
| ఇంజిమాముల్ | శ్రీలంక |
| కేన్ విలియమ్సన్ | భారత్ |

**సమాధానాలు :** అనిల్ కుంబ్లే–భారత్; షేన్ వార్న్–ఆస్ట్రేలియా; జయసూర్య–శ్రీలంక; ఇంజిమాముల్–పాకిస్తాన్; కేన్ విలియమ్సన్–న్యూజిలాండ్.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### అశోక్ మెహతా



గుజరాత్ రాష్ట్రానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు. 1911 అక్టోబర్ 24న జన్మించారు. 1932లో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నందుకు జైలుపాలయ్యారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో మెహతా చురుకుగా పాల్గొన్నారు. బ్రిటిష్ పాలకులు అతనికి ఐదుసార్లు కఠిన కారాగార శిక్ష విధించారు. స్వాతంత్ర్యానంతరం రాజకీయాల్లోకి ప్రవేశించి లోక్‌సభ, రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు. 1977లో జనతా ప్రభుత్వంలో అశోక్ మెహతా కమిటీ ఛైర్మన్‌గా ఉన్నారు. 1984 డిసెంబర్ 10న మరణించారు.



నాతోపాటు రా.. నీకు చూపిస్తానని చెప్పింది. కోతి సరేనంది. అప్పటికే ఊళ్లో చాలా మేకలు కనిపించకుండా పోవడంతో గ్రామ ప్రజలు రాత్రి వేళ కాపలా కాస్తున్నారు.

ఈ విషయం తెలియని కోతి, తోడేలు ఊళ్లోకి ప్రవేశించాయి.

మేకల మందలోకి వెళ్లగానే అప్పటికే కాపుకాసిన జనం.. తోడేలు, కోతిని పట్టుకుని చితక్కొట్టారు.

నాకేమీ తెలియదు, కేవలం తోడేలుతో పాటు వచ్చానని కోతి మొత్తుకున్నా వినకుండా మరిన్ని దెబ్బలు కొట్టారు.

వారి నుంచి ఎలాగోలా తప్పించుకున్న కోతి.. బతుకు జీవుడా! అంటూ అడవి బాట పట్టింది. ★

## జనరల్ నాలెడ్జ్

1. ప్రపంచంలోనే అత్యంత వేడిగా ఉండే ఖండం ఏది?
2. జపాన్ అధికారిక కరెన్సీ ఏది?
3. ప్రపంచంలోనే అతిపెద్ద సరస్సు పేరేంటి?

జవాబులు : 1. ఆఫ్రికా; 2. యెన్; 3. కాస్పియన్ సరస్సు.

## మెదడుకు మేత

కొమ్ములుంటాయి కానీ ఎద్దు కాదు. అంబారీ ఉంటుంది కానీ ఏనుగు కాదు?

జవాబు : నత్త

## మంచిమాట

మనిషికి నిజమైన ఆనందం లభించేది కేవలం వారి ఆలోచనల్లోనే!

– గౌతమ బుద్ధుడు




# వారఫలాలు 30 సెప్టెంబర్-06 అక్టోబర్ 2024

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

సమాజసేవలో భాగస్వాములతో పరిచయాలు. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. వాహనాలు, స్థలాలుకొంటారు. మీ నిర్ణయాలు అందరినీ ఆశ్చర్యపరుస్తాయి. వ్యాపారస్తులకు ఉత్సాహవంతంగా ఉంటుంది. ఉద్యోగస్తులకు ప్రమోషన్లు. పారిశ్రామికవేత్తల కృషి ఫలిస్తుంది. క్రీడాకారులు, రచయితలకు ప్రత్యేక ఆహ్వానాలు. 30, అక్టోబర్ 1తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. ధననష్టం. హయగ్రీవస్తోత్రాలు పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

నూతన వ్యక్తుల పరిచయం. శుభవార్తా శ్రవణం. దూరపు బంధువుల ద్వారా ధనలాభం. కోర్టు వ్యవహారాలలో చిక్కులు తొలగుతాయి. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. సమాజంలో కీర్తిప్రతిష్ఠలు పెరుగుతాయి. వ్యాపారులు లాభాలు ఆర్జిస్తారు. ఉద్యోగస్తులకు సమస్యలు తీరుతాయి. రాజకీయ వర్గాలకు నూతనోత్సాహం, పదవీయోగం. 2,3 తేదీలలో వృథా ఖర్చులు. ఆరోగ్యసమస్యలు. బంధువులతో తగాదాలు. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

ఏ కార్యక్రమం చేపట్టినా విజయవంతమే. వివాహ, ఉద్యోగయత్నాలు కలిసివస్తాయి. ప్రముఖుల పరిచయం. శత్రువులు కూడా స్నేహితులుగా మారవచ్చు. స్థిరాస్తివివాదాలు కొలిక్కి వస్తాయి. వాహనయోగం. వ్యాపారస్తులు ఆశించిన లాభాలు పొందుతారు. ఉద్యోగస్తులకు ఉన్నతపోస్టులు. రాజకీయవేత్తలకు కొత్త పదవులు. రచయితలకు శుభవార్తలు. 4,5తేదీల్లో వృథా ఖర్చులు. మానసిక అశాంతి. అనారోగ్యం. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ముఖ్య కార్యక్రమాలు మధ్యలోనే విరమిస్తారు. దేవాలయాల సందర్శన. నిరుద్యోగుల కృషి ఫలవంతం. సన్నిహితులతో వివాదాలు. కొన్ని నిర్ణయాలలో మార్పు. ఆస్తుల విషయంలో చికాకులు. ఇంటి నిర్మాణయత్నాలు వాయిదా. వ్యాపారాలలో ఒడిదుడుకులు. ఉద్యోగస్తులకు మరిన్ని బాధ్యతలు. కళాకారులకు అవకాశాలు చేజారవచ్చు. పారిశ్రామికవేత్తలు, క్రీడాకారులకు ఒత్తిడులు. 3,4 తేదీల్లో శుభవర్తమానాలు. అంగారక స్తోత్రాలు పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

మీ ఆశయాలు నెరవేరే సమయం. చిన్ననాటి స్నేహితులను కలుస్తారు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. బంధువులు అన్నింటా చేదోడు. పలుకుబడి కలిగిన వారితో పరిచయాలు. ఆస్తి వివాదాలు పరిష్కార. వ్యాపారులకు అనూహ్యమైన లాభాలు. ఉద్యోగస్తులకు కోరుకున్న మార్పులు. పరిశోధకులకు విదేశీ పర్యటనలు. 5,6 తేదీల్లో అనుకోని ఖర్చులు. కనకధారాస్తోత్రాలు పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

యత్నకార్యసిద్ధి. కుటుంబసభ్యులు,స్నేహితుల నుంచి మాటసహాయం. ముఖ్యమైన కార్యక్రమాలు విజయవంత. అందరిలోనూ మీ సత్తా చాటుకుంటారు. విద్యార్థులకు అనూహ్యమైన ఫలితాలు దక్కించుకుంటారు. ఉద్యోగస్తులకు ఉన్నత పోస్టులు. రాజకీయవేత్తల కృషి. పరిశోధకులకు ఆహ్వానాలు. 30,1తేదీల్లో ధననష్టం. శారీరక రుగ్మతలు. దూరప్రయాణాలు. అన్నపూర్ణాష్టకం పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

దూరపు బంధువుల రాకతో కుటుంబంలో సందడి. భూ,గృహయోగాలు. అందర్నీ ఆశ్చర్యపరిచేలా కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు. సన్నిహితులతో వివాదాలు పరిష్కారం. శుభకార్యాల రీత్యా ఖర్చులు అధికం. వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు అవార్డులు లభించే వీలుంది. 4,5 తేదీలలో దూరప్రయాణాలు. వృథా ఖర్చులు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

ముఖ్యమైన కార్యక్రమాలు అనుకున్న విధంగా పూర్తిచేస్తారు. ఆలోచనలు అమలు. శత్రువులు స్నేహితులవుతారు. దేవాలయ దర్శనాలు. సంగీత, సాహిత్య విషయాలపై ఆసక్తి. గృహనిర్మాణ యత్నాలు. వ్యాపారాలు నూతన పెట్టుబడులతో సాగుతాయి. పారిశ్రామికవేత్తలకు అరుదైన అవకాశాలు. రచయితలకు మంచి గుర్తింపు లభిస్తుంది. 3,4 తేదీల్లో దూర ప్రయాణాలు. ఆంజనేయ దండకం పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

కొన్ని అద్భుతాలు ఎదురవుతాయి. ముఖ్యమైన




సింహంభట్ల సుబ్బారావు
6300674054


కార్యక్రమాలు సకాలంలో పూర్తి. వాహనయోగం. ఎంతటివారినైనా ఆకట్టుకుంటారు. సమాజసేవలో భాగస్వాములవుతారు. వ్యాపారులకు చిక్కులు తొలగుతాయి. రాజకీయవర్గాలకు కొత్త పదవులు. కళాకారులకు ఉత్సాహం. 1,2 తేదీల్లో ఆరోగ్య, కుటుంబసమస్యలు. ఆకస్మిక ప్రయాణాలు. మానసిక అశాంతి. శ్రీరామరక్షా స్తోత్రాలు పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

గత కొంతకాలంగా వేధిస్తున్న కొన్ని సమస్యల నుంచి గట్టెక్కుతారు. విద్యార్థుల నైపుణ్యానికి తగిన గుర్తింపు. ప్రముఖులతో పరిచయాలు. శత్రువులు కూడా స్నేహితులుగా మారతారు. దేవాలయాల సందర్శన. వ్యాపారులు ప్రగతి సాధిస్తారు. పారిశ్రామికవేత్తలకు విదేశీ పర్యటనలు. పరిశోధకులు, కళాకారులకు ఊహించని అవకాశాలు. 30,1 తేదీల్లో వృథా ఖర్చులు. శారీరక రుగ్మతలు. బంధువిరోధాలు. గణేశాష్టకం పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

నిరుద్యోగులు ఇంతకాలం చేసిన కృషి ఫలించే సమయం. కొత్తగా చేపట్టిన కార్యక్రమాలు అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. ఇంటిలో శుభకార్యాలపై చర్చలు. వ్యాపారులు అనుకున్న లాభాలు ఆర్జిస్తారు. ఉద్యోగస్తు లకు పదోన్నతులు. కళాకారులకు పురస్కారాలు. క్రీడాకారులు, పరిశోధకులకు మంచి గుర్తింపు లభిస్తుంది. 4,5తేదీల్లో అనుకోని ఖర్చులు. ఆదిత్య హృదయం పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

చిన్ననాటి స్నేహితులను కలుసుకుని ఉల్లాసంగా గడుపుతారు. విద్యార్థులకు ప్రతిభ వెలుగులోకి వస్తుంది. పొరపాట్లు సరిదిద్దుకుని నిర్ణయాలను మార్చుకుంటారు. వ్యాపారులు మరింత లాభాలు దక్కించుకుంటారు. ఉద్యోగస్తులకు సమస్యలు తీరి ఊరటచెందుతారు. రాజకీయవేత్తలకు అనుకోని పదవీయోగం. కళాకారులు, రచయితలకు అనుకోని ఆహ్వానాలు రావచ్చు. 5,6 తేదీలలో అనారోగ్యం. దేవాలయ దర్శనాలు. నవగ్రహస్తోత్రాలు పఠించండి.

# పదరసం-483

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | ■ | 3 | | 4 | | 5 | ■ |
| | ■ | | ■ | | ■ | | ■ | | ■ |
| 6 | | | 7 | | ■ | 8 | | | |
| | ■ | ■ | | ■ | 9 | | ■ | | ■ |
| 10 | 11 | | | ■ | ■ | 12 | | ■ | ■ |
| ■ | | ■ | ■ | 13 | 14 | | ■ | 15 | 16 |
| 17 | | | 18 | ■ | | ■ | 19 | ■ | |
| | ■ | ■ | | ■ | 20 | | | | |
| | ■ | 21 | | | | ■ | | ■ | |
| 22 | | ■ | | ■ | ■ | 23 | | | ■ |

## ఆధారాలు

**అడ్డం**

1) ఇంటి ముందరభాగం, ద్వారం (3)

3) తొందర (5)

6) విపరీతమైన, అడ్డు ఆపు లేని (5)

8) అటునుంచి ఆపుట, వదలు (4)

9) భ్రాంతి (2)

10) తిరగబడ్డ నగ (4)

12) అచ్చు కాదు (2)

13) ఏదైనా వ్యాసపరంపరకు పెట్టే పేరు సరిగా లేదు (3)

15) తమిళంలో... రామాయణం సుప్రసిద్ధం (2)

17) చెడ్డ పనులు (4)

20) బాధ్యతతో కూడిన జంఝాటం (5)

21) అక్రమంగా ప్రవేశించడం (4)

22) తడబడుతూ మాట్లాడే జబ్బు (2)

23) మన పొరుగు దేశం (3)

**నిలువు**

1) శీతోష్ణ స్థితి (5)

2) ఇంద్రుని సారథి పైకొచ్చాడు (3)

3) బాధ (3)

4) అరుణాచలంచేరి ప్రసిద్ధుడైన మహనీయుడు (6)

5) తప్పు తలక్రిందులైంది (4)

7) పైకొచ్చిన క్షుద్బాధ (3)

11) తలక్రిందులైన విపత్తు (3)

14) నియమం (4)

16) బెంగాలీ రచయిత శరత్ చంద్ర ఛటోపాధ్యాయ వ్రాసిన నవల (4)

17) సాధారణంగా సంగీత కచేరీలలో చేసే రాగసాధన (4)

18) పైకొచ్చిన గ్రామ్య ఉత్సవం (4)

19) చాలాకాలం (4)

## పదరసం - 482 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| మే[1] | లు | కో[2] | లు | పు[3] | ■ | ఆ[4] | క | ళిం | పు[5] |
| ధా | ■ | రి | ■ | న[6] | న | ట | ■ | ■ | క్కి |
| వి[7] | రి[8] | వి | ■ | శ్చ | ■ | వి | ■ | ఓ[9] | టి |
| ■ | హ | ■ | ప[10] | ర | గ | డు | పు | ■ | పు |
| క[11] | ల | శం[12] | ■ | ణ | ■ | పు | ■ | ■ | రా |
| కా | ■ | క[13] | లి[14] | ■ | శ[15] | ■ | క[16] | ర | ణం |
| వి[17] | ధి | ■ | గు | ■ | ట[18] | మ్మ | ర | ■ | ■ |
| క | ■ | ■ | బి[19] | కా[20] | రి | ■ | చా[21] | వ | డి[22] |
| లు[23] | ద[24] | మొ | ■ | ల | ■ | దూ[25] | ల | ■ | గ |
| ■ | ట్టం | ■ | తో[26] | డి | మ | ■ | నం[27] | జ | అం |

సినిమా



చిరంజీవి నటించిన తొలి చిత్రం 'పునాది రాళ్లు'. కానీ విడుదలైన మొదటి సినిమా 'ప్రాణం ఖరీదు' (1978 సెప్టెంబర్ 22). సరిగ్గా 46 సంవత్సరాల తర్వాత అదే రోజున మెగాస్టార్ చిరంజీవి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్నారు. 156 చిత్రాలు, 537 పాటలు, 24 వేల డాన్స్ మూమెంట్స్.... వెరసి ఆయనకు గిన్నిస్ బుక్‌లో స్థానాన్ని దక్కించాయి. చిరంజీవి కీర్తి కిరీటంలో ఇది మరో కలికితురాయి.

# చిరంజీవి కీర్తి కిరీటంలో మరో కలికితురాయి!

చెన్నై అడయార్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ తీసుకుంటున్న సమయంలోనే చిరంజీవికి 'పునాదిరాళ్ళు' సినిమాలో నటుడిగా అవకాశం వచ్చింది. ఐదుగురు హీరోలలో ఆయన ఒకరు. జులై వరకూ శిక్షణ కాలం. కానీ అనుమతి తీసుకుని, ఇది తనకో స్క్రీన్ టెస్ట్‌గా భావించాలని కోరి ఆ చిత్రం షూటింగ్‌లో 1978 మార్చిలో పాల్గొన్నాడు చిరంజీవి. అది సెట్స్ మీద ఉండగానే క్రాంతి కుమార్.... పి.వాసు దర్శకత్వంలో నిర్మిస్తున్న 'ప్రాణం ఖరీదు'కు చిరంజీవిని ఎంపిక చేశారు. జులైలో షూటింగ్ మొదలైంది. రాజమండ్రి అప్సరా హోటల్లో చిరంజీవి రూమ్‌లోనే నూతన్‌ప్రసాద్‌కూ బస. మర్నాడు చెప్పాల్సిన డైలాగ్స్‌ను నూతన్ ప్రసాద్ వల్లెవేసుకుంటూ ఉంటే, చిరంజీవి టేప్ రికార్డర్ పెట్టుకుని పాటలకు డాన్స్ చేయడం మొదలెట్టారు. కాస్తంత చిరాకుగా నూతన్ ప్రసాద్ 'ఇదిగో చిరంజీవి... ఈ డాన్సులు, పాటలు జనాలు చూడరయ్యా... పాట రాగానే లేచి బయటకు వెళ్తారు' అని అన్నారు. దానికి చిరంజీవి చెప్పిన ఒకే ఒక్క సమాధానం 'అలా హాలు బయటకు వెళ్లే వాళ్లను నా డాన్సులతో కూర్చోబెడతాను' అని. ఆ తర్వాత రోజుల్లో అదే జరిగింది. చిరంజీవి ముందు సూపర్ స్టార్స్‌గా ఉన్న ఎన్టీఆర్, ఏఎన్ఆర్, కృష్ణ, శోభన్ బాబు వంటి వాళ్లు డాన్సులు, ఫైట్స్ చేసినా... చిరంజీవి వాటిల్లో ఓ వేగాన్ని తీసుకొచ్చాడు. డాన్స్ మూమెంట్స్‌ను పూర్తిగా మార్చేశాడు. ఫైట్స్, డాన్సులంటే చిరంజీవి చేస్తేనే చూడాలనిపించు కున్నాడు. ఇప్పుడు ఏకంగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ మోస్ట్ ప్రొలిఫిక్ ఫిల్మ్ స్టార్ ఇన్ ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ యాక్టర్, డాన్సర్‌గా అవార్డును అందుకున్నాడు. కేంద్ర ప్రభుత్వం నుంచి 2006లో పద్మభూషణ్, 2024లో పద్మవిభూషణ్ పురస్కారాలను పొందారు చిరంజీవి. మూడు నంది అవార్డులతో పాటు ప్రతిష్ఠాత్మకమైన రఘుపతి వెంకయ్య అవార్డును అందుకున్నారు. తాజాగా అక్కినేని నాగేశ్వరరావు జాతీయ అవార్డునూ చిరంజీవికి ప్రకటించారు. ఇది వెలువడిన రెండు రోజులకే చిరంజీవికి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో చోటు దక్కడం విశేషం.

స్వయంకృషితో చిత్రసీమలో అంచలంచెలుగా ఎదిగి ఉన్నత శిఖరాలను అధిరోహించిన చిరంజీవిని సినీ, రాజకీయ ప్రముఖులు అభినందనల వెల్లువతో ముంచెత్తారు. అభిమానుల ఆనందం అంబరాన్ని తాకింది. 'చిరంజీవి ఇలాంటి ఓ గొప్ప అఛీవ్‌మెంట్ సాధించారు. దానికి సంబంధించిన వేడుక సెప్టెంబర్ 22న జరుగుబోతోందనే విషయం చాలా మందికి తెలియదు. చిత్రసీమలో గత కొద్దిరోజులుగా జరుగుతున్న పరిణామాల కారణంగా కావచ్చు, చిరంజీవి చికన్ గున్యాతో బాధపడుతుండటం వల్ల కార్యక్రమం జరుగుతుందో లేదో అనే సందేహం వల్ల కావచ్చు నిర్వాహకులు ముందస్తు సమాచారాన్ని ఇవ్వలేదు. ఏదేమైనా అందరికీ ఇదో స్వీట్ సర్ప్రైజ్! తెలుగు సినిమా రంగంలో డి. రామానాయుడు, దాసరి నారాయణరావు, విజయనిర్మల, బాల సుబ్రహ్మణ్యం, పి. సుశీల, బ్రహ్మానందం వంటి వారు ఇప్పటికే వివిధ కేటగిరిల్లో గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించుకున్నారు. ఇప్పుడా జాబితాలో చిరంజీవి కూడా చేరారు.

ప్రజారాజ్యం పార్టీని స్థాపించి, ఆ తర్వాత దానిని కాంగ్రెస్‌లో విలీనం చేసిన చిరంజీవి... కేంద్ర మంత్రిగానూ బాధ్యతలు నెరవేర్చారు. ఆపైన రాజకీయాలు తనకు సరిపడవని భావించి, వాటికి స్వస్తి పలికి చిత్రసీమలోకి రీ-ఎంట్రీ ఇచ్చారు.

**ఇటు జానీ వివాదం - అటు చిరు సత్కారం!**

ఈ ఏడాది 'తిరుచిత్రం బలం' అనే సినిమాకు గానూ జానీ మాస్టర్ జాతీయ స్థాయిలో ఉత్తమ నృత్యదర్శకుడిగా ఎంపికయ్యారు. తెలుగు సినిమా, టీవీ డానర్స్ అండ్ డాన్స్ మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సేవలు అందిస్తున్నారు. జనసేన పార్టీలో క్రియాశీలంగా పనిచేయడంతో పాటు, తెలుగువాడు కావడంతో అందరూ జానీ మాస్టర్‌ను అభినందించారు. తెలుగు సినిమా రంగంలోని ప్రధాన శాఖలన్నీ కలిసి ఆయనను సత్కరించాయి. ఇది జరిగిన కొద్ది రోజులకే తన అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌పై అత్యాచారం ఆరోపణపై అరెస్ట్ అయ్యాడు. జానీ మాస్టర్ భార్య కూడా హిందువు కావడం, వివాహానంతరం ఆమెను మతం మార్చడం, అలానే అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ ను కూడా మతం మారి తనను పెళ్లి చేసుకోవాలని ఆయన ఒత్తిడి చేశారనే అభియోగాలపైనా విచారణ జరుగుతోంది. జాతీయ స్థాయిలో కొరియోగ్రాఫర్‌గా అవార్డు తెచ్చుకున్న వ్యక్తిపై ఇలాంటి మచ్చపడిన సమయం లోనే తనదైన డాన్స్ మూమెంట్స్‌తో చిరంజీవి కోట్లాది మంది హృదయాలను గెలుచుకుని గిన్నిస్ బుక్‌లో చోటు దక్కించుకున్నారు. చిరంజీవి 'ఖైదీ నంబర్ 150' సినిమాలోని 'సుందరి' పాటకు అప్పట్లో జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. మెగా ఫ్యామిలీతో సన్నిహిత సంబంధాలు ఉన్న ఆయనను కొందరు సినిమా వాళ్లే టార్గెట్ చేశారనే విమర్శలు వస్తున్నాయి. జానీ మాస్టర్ సెంట్రిక్‌గా ఇటు మెగా, అటు అల్లు ఫ్యామిలీ మధ్య దూరాన్ని పెంచే ప్రయత్నం కూడా కొంత జరుగుతోందని అంటున్నారు. నివురుగప్పిన నిప్పులా ఉన్న అభిమానుల ఆవేశకావేశాలను ప్రత్యర్థి పార్టీలు సోషల్ మీడియా వేదికగా ఎగదోస్తున్నాయి. ఇలాంటి సమయంలో జరిగిన చిరంజీవి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ అవార్డు స్వీకరణకు అల్లు అరవింద్ హాజరయ్యారు. చిరంజీవిని అభినందించారు. తమ రెండు కుటుంబాల మధ్య ఎలాంటి పొరపొచ్చలు లేవని తెలియచెప్పే ప్రయత్నం చేశారు. జానీ మాస్టర్ కారణంగా డాన్స్ మాస్టర్స్ ప్రవర్తన ఇవాళ దేశ వ్యాప్తంగా చర్చ నీయాంశమైన సమయంలో... గ్రేస్ డాన్స్ మూమెంట్స్ చేసిన గొప్ప నటుడిగా చిరంజీవి గిన్నిస్ బుక్ లో చోటు సంపాదించుకోవడం ఆ మచ్చను కాస్తంత చెరిపేదిగా భావించాలి.

**– అరుణ,** సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

# మాతృదేశానికి....

ఇప్పుడు భారతదేశానికి తిరిగి వస్తున్న కళాఖండాలు ఏవి? ఇసుక రాయితో చెక్కిన అప్సర. దీనిని మధ్య భారతదేశం నుంచి అపహరించుకుపోయారు. ఇది **10** లేదా **11**వ శతాబ్దానికి చెందినది. **16**వ శతాబ్దంలో తయారైన కంచు విగ్రహం కూడా ఉంది. తూర్పు భారతం నుంచి ఎల్లలు దాటిన టెర్రకోటా పూలకుండీ కూడా తిరిగి వస్తున్నది. ఇది **3** లేదా **4** శతాబ్దాలకు చెందినది. వినాయకుడి కంచు విగ్రహం కూడా వెనక్కి వస్తున్నది. దీనిని దక్షిణ భారత శిల్పులు **16** లేదా **17**వ శతాబ్దంలో తయారు చేసి ఉంటారు. **17** లేదా **18**వ శతాబ్దంలో కంచుతో చేసిన శ్రీ మహావిష్ణువు విగ్రహాన్ని కూడా పంపిస్తున్నారు. అమెరికాకు చేరిన భారతీయ పురాతన కళాఖండాలను స్వస్థలానికి పంపించే చర్యలను **2016** నుంచి ఆ దేశం తీసుకున్నది. ఆ సంవత్సరం జూన్‌లో మోదీ అమెరికా వెళ్లినప్పుడు **157** పురాతన కళాఖండాలను, **2021**లో **105** కళాఖండాలను అప్పగించింది. ఇందులో ఇంకా ఎన్నో ఉన్నాయి. **2016** నుంచి చూస్తే అమెరికా భారత్‌కు అప్పగించిన సాంస్కృతిక, ధార్మిక పరమైన కళాఖండాలు **578**.













From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 76 Issue : 47


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు





వెల : ₹.90/-





వెల : ₹.390/-





వెల : ₹.220/-





వెల : ₹.360/-




వెల : ₹.200/-




వెల : ₹.360/-





వెల : ₹.300/-




వెల : ₹.200/-





వెల : ₹.90/-





వెల : ₹.100/-





వెల : ₹.250/-





వెల : ₹.799/-




వెల :₹.495/-




వెల : ₹.549/-




వెల : ₹.399/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.

040-27563236, 9290127329, 8179163138

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 8333812687